12-05Pg1fG 1 GNT_12-05Pg1fG.qxd 11/May/26 10:13 PM Page 1

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 101 పేజీలు: 12 వెల: 6.50




SHOWROOM: ANDHRA PRADESH: RENAULT GUNTUR Ph: 8860086167.

# భారత్ ఎవరికీ తలవంచదు..

>> ఈ దివ్య సాన్నిధ్యం, ఈ సౌందర్యం, భూమి, ఆకాశం నుండి కురుస్తున్న పుష్ప వర్షం, కాషాయ జెండాల కాంతి, కళ, సంగీతం, నృత్యాల అద్భుత ప్రదర్శనలు, వేద మంత్రాల పఠనం, గర్భగుడిలో నిరంతరం జరుగుతున్న శివ పంచాక్షరీ పారాయణం, వీటన్నిటితో పాటు సముద్రపు అలల ఘోష... సృష్టి అంతా ఏకమై "జై సోమనాథ్! జైజై సోమనాథ్" అని పలుకుతున్నట్లు అనిపిస్తోంది!" అని ప్రధాని మోడీ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. భారత ఆధ్యాత్మిక శక్తి, సాంస్కృతిక చైతన్యాన్ని ఈ అమృతోత్సవం ప్రతిబింబిస్తుందని అన్నారు. పునర్నిర్మించిన ఆలయంలో మహాదేవుని ప్రతిష్ఠ జరిగి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం జరిగిందని, ఇది 'వెయ్యేళ్ల అమరత్వ ప్రయాణాన్ని' ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి అన్నారు. 'తన మూలాలకు కట్టుబడి ఉంటూనే, ఆధునికత శిఖరాలను చేరుకోవడానికి సిద్ధంగా ఉండే భారతదేశాన్ని నిర్మించాలనే సంకల్పానికి సోమనాథ్ అమృత్ మహోత్సవం ప్రతీక' అని అన్నారు. 'సత్యాన్ని అణచివేయవచ్చు కానీ తుడిచివేయలేమని ఈ సోమనాథ్ ఆలయం మనకు బోధిస్తుంది. విశ్వాసాన్ని సవాలు చేయవచ్చు కానీ ఓడించలేము' అని ఆయన వ్యాఖ్యానించారు. పవిత్ర పుణ్యక్షేత్రం వారసత్వానికి గుర్తుగా ఒక స్మారక తపాలా బిళ్లను, నాణేన్ని కూడా విడుదల చేశారు.

**పోఖ్రాన్ అణు పరీక్షల ప్రస్తావన:** 1998లో భారతదేశం నిర్వహించిన పోఖ్రాన్ అణు పరీక్షలను దేశ ఆధ్యాత్మిక సంప్రదాయాలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం అనుసంధానించారు. పోఖ్రాన్ అణు పరీక్షల వార్షికోత్సవం సోమనాథ్ వేడుకలతో ఒకే సమయంలో రావడం విశేష ప్రాముఖ్యతను కలిగి ఉందని ప్రధాని మోడీ అన్నారు. "ఈ రోజు మరొక కారణం వల్ల కూడా ప్రత్యేకమైనది. సరిగ్గా ఇదే రోజున, అంటే 1998 మే 11న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో ప్రోఖ్రాన్-2 పేరుతో అణు పరీక్షలను నిర్వహించింది" అని పేర్కొన్నారు. "మన శాస్త్రవేత్తలు ప్రపంచం ముందు భారతదేశ బలాన్ని, సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ప్రపంచవ్యాప్తంగా అలజడి రేగింది. ప్రపంచ అగ్రరాజ్యాలు వ్యూహరచన చేయడం ప్రారంభించాయి. అనేక ఆంక్షలు విధించబడ్డాయి, ఆర్థిక అవకాశాలకు దారితీసే అన్ని మార్గాలూ మూసివేయబడ్డాయి" అని ఆయన అన్నారు. ఈ పరీక్షల తర్వాత భారతదేశం తీవ్రమైన అంతర్జాతీయ ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ, రెండు రోజుల తర్వాత అదనపు అణు పరీక్షలను నిర్వహించి ముందుకు సాగిందని ప్రధానమంత్రి తెలిపారు. "మే 11న శాస్త్రవేత్తలు తమ పనిని పూర్తి చేశారు, కానీ మే 13న మరో రెండు అణు పరీక్షలు నిర్వహించబడ్డాయి. భారతదేశ రాజకీయ సంకల్పం ఎంత దృఢమైనదో అప్పుడు ప్రపంచం గ్రహించింది" అని ఆయన అన్నారు. "ఆ సమయంలో, ప్రపంచం మొత్తం భారతదేశంపై ఒత్తిడి తెస్తోంది. కానీ అటల్ జీ నాయకత్వంలో, మాకు దేశమే సర్వస్వం అని బిజెపి ప్రభుత్వం నిరూపించింది. ప్రపంచంలో ఏ శక్తి కూడా భారతదేశాన్ని తలవంచేలా చేయలేదు, లేదా ఒత్తిడికి లొంగేలా బలవంతం చేయలేదు. "శివుడితో పాటు శక్తిని ఆరాధించడం ఎప్పటి నుంచో మన సంప్రదాయంగా వస్తోందని, అందుకే ఈ అణు పరీక్షలకు "ఆపరేషన్ శక్తి" అని పేరు పెట్టారని ప్రధాని మోడీ తెలిపారు. "అర్ధనారీశ్వరుడైన శివుడు కూడా శక్తితోనే పరిపూర్ణమవుతాడు" అని ఆయన అన్నారు. ఈ అంశాన్ని భారతదేశ చంద్రయాన్ యాత్రతో కూడా ప్రధానమంత్రి అనుసంధానించారు. "చంద్రయాన్ యాత్ర విజయవంతమైనప్పుడు, చంద్రునిపై భారతదేశ రోవర్ దిగిన ప్రదేశానికి "శివ శక్తి పాయింట్" అని పేరు పెట్టడం మీకు గుర్తుండే ఉంటుంది" అని ఆయన అన్నారు. "ఎందుకంటే మన విశ్వాసంలో, చంద్రుడు శివునితో, శివుడు శక్తితో ముడిపడి ఉన్నారు. ఈ జ్యోతిర్లింగాన్ని సోమ అంటే చంద్రుడు అనే పదం నుండి సోమ నాథ్ అని పిలవడం ఎంత ఆహ్లాదకరమైన విషయం. "శివశక్తి" తత్వం భారతదేశ శాస్త్రీయ, సాంకేతిక పురోగతికి స్ఫూర్తినిస్తూనే ఉండాలని ప్రధాని మోడీ అన్నారు. "శివశక్తి ఆరాధన అనే ఈ తత్వం దేశ శాస్త్రీయ పురోగతికి స్ఫూర్తినిస్తూనే ఉండాలి" అని ఆయన అన్నారు.

ఆపరేషన్ శక్తి వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పరీక్షలను భార తదేశ సంకల్పానికి, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి నిదర్శనంగా అభివర్ణించారు. 1951లో పునర్నిర్మించిన ఆలయ ప్రారంభోత్స వానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమనాథ్ అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా, ప్రధాని మోడీ సోమవారం సోమనాథ్ ఆలయంలో కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత వైమానిక దళానికి చెందిన సూర్య కిరణ్ ఏరోబాటిక్ బృందం ప్రదర్శించిన వైమానిక ప్రదర్శనను వీక్షి ంచారు.



సోమవారం సోమనాథ్ ఆలయం వద్ద పోస్టల్ స్టాంపులు, నాణెం విడుదల చేస్తున్న ప్రధాని మోడీ

## సోమనాథ్ ఆలయం భారతదేశ నాగరికత, ఆత్మగౌరవానికి శాశ్వత చిహ్నం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే11, ప్రభాతవార్తప్రతినిధి:** సోమనాథ్ అమృత్ మహోత్సవం సందర్భంగా భక్తు లకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలను తెలి యజేశారు. మన దేశం విశ్వాసాలను గౌరవించే భూమిగా సీఎం అభివర్ణించారు. ఈ విశ్వాసం మనం దరినీ ఏకంచేసే గొప్ప శక్తిగా నిలుస్తుంద న్నారు. సోమనాథ్ ఆలయం భారతదేశ నాగరికత, ఆత్మగౌరవానికి శాశ్వత చిహ్నంగా నిలుస్తుందని కొని యాడారు. ఆలయ పునర్నిర్మాణానికి అంకితమైన వారి త్యాగాలకు, భక్తికి ఇది నిదర్శనంగా సీఎం చంద్రబాబు భావించారు. వికాస్ భీ, విరాసత్ భీ స్ఫూర్తిని ఎన్డీయే ప్రభుత్వం అందిపుచ్చుకుందన్నారు.

## దేశ పురోగతిని ఆపలేరు

>> దోహద పడుతుందని అన్నారు. ఒకప్పుడు దేశానికే ఆదర్శం గా నిలిచిన పశ్చిమ బెంగాల్, గత కొంతకాలంగా అభివృద్ధి ఆలో చనలే లేకుండా వెనుకబడిపోయిందని ఆయన అభిప్రాయ పడ్డారు.1990లలో పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశానికి ఎన్నో అవకాశాలు కల్పించాయని, టెలికాం, విద్యుత్, రహదారుల రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. ఆ సంస్కరణల్లో తాను కూడా భాగస్వామిని కావడం సంతోషంగా ఉందన్నారు.ప్రధాని ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పలు చర్యలు చేపడుతోందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో ప్రోజ్యూమర్‌ఖి (ఉత్పత్తిదారువినియోగ దారు) విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. మైక్రో గ్రిడ్ వ్యవస్థ ద్వారా విద్యుత్ సరఫరా నష్టాలను తగ్గిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారని, దీని ద్వారా భూసారాన్ని పెంచుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నామని వివరించారు. ప్రతీ సవాలు ఒక అవకాశాన్ని సృష్టిస్తుందని, భారత్ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని (అన్‌స్టాపబుల్), త్వరలోనే దేశం ఒక గ్లోబల్ జెయింట్‌గా మారుతుందని చంద్రబాబు అన్నారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాలే తన అజెండా అని ఆయన స్పష్టం చేశారు.

## లింక్‌కు అనుమతులివ్వండి

>> వివరించారు. ప్రస్తుతం కుడి కాలువ 95 శాతం మేర ఎడమ కాలువ పనులు 78 శాతం మేర పూర్తి అయినట్టు తెలిపారు. కాలువల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీఎంబర్సు చేయాలని జలశక్తిశాఖ మంత్రికి చంద్ర బాబు విజ్ఞప్తిచేశారు. ప్రాజెక్టు తదుపరి పనులకు సంబంధించి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ప్రధానమంత్రి కృషి సీంచాయి యోజన కింద రాష్ట్రంలోని వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునీకరణకు నిధులు మంజూరు కోరుతూ లేఖ ఇచ్చిన సీఎం." హర్ ఖేత్ కో పానీ "కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మతులు, పునరుద్ధరణ ,ఆధునీకరణ, కాలువల పూడిక తీత, గట్ల బలోపేతం లాంటి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృధాగా పోయే 200 టీఎంసీల వరద జలాలలను మళ్లించేలా పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నట్టు వెల్లడించారు.. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్తామని పేర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీ నీటి అవసరాలకు అనుగుణంగా 8 వేల క్యూసెక్కుల సామర్థంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనికి అవసరమైన భూసేకరణ కోసం ఒడిశాను ఆదేశించాల్సిందిగా కేంద్ర జలశక్తి శాఖకు లేఖ ఇచ్చిన సీఎం చంద్రబాబు వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి గెజిట్ ప్రకారం ముందుకెళ్తామన్నారు. సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కేంద్రమంత్రి పాటిల్ తో భేటీ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కరవు రహితంగా మార్చే ప్రాజెక్టు పోలవరమని అన్నారు. కేంద్రం అందిస్తున్న సహకారానికి మంత్రి నిమ్మల ధన్యవాదాలు తెలియజేశారు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి కానుందని పేర్కొన్నారు. ప్రధాని చేతుల మీదుగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. వైఎస్సార్సీపీ పట్టించుకోని తుంగభద్రకు మొత్తం గేట్లను కొత్తవి నిర్మిస్తున్నామని అన్నారు. గోదావరికావేరి నదుల అనుసంధానం యాక్షన్ ప్లాన్ తయారీపై కేంద్రమంత్రి పాటిల్‌తో చర్చించామని నిమ్మల వెల్లడించారు.




సోమవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి సిఆర్‌పాటిల్‌కు జ్ఞాపికను అందచేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నిమ్మల

## వైద్యసేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం

>> సమకూర్చారు. ఇందులో 4 ఆపరేషన్ టేబుళ్లు, 5మల్టీపారా మానిటర్లు, వీన్ ఫైండర్లు, రోగుల విశ్రాంతి కోసం 20 కుర్చీలను అంద జేసి, వాటిని తక్షణమే వినియోగంలోకి తీసుకు రావాలని ఆదేశించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే బాధ్యతారాహిత్య సిబ్బందిపై కఠినంగా ఉం టామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆర్‌డిఓ ఎం.కృష్ణ మూర్తి, ఆసుపత్రి ఇన్చార్జి సూపరిం టెండెంట్ డాక్టర్ మహారాజ్, పలువురు వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

**టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా దర్బార్ :** స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు స్వీకరించారు. అధిక సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు భారీగా తరలివచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించాలని, సమస్యల పరిష్కారంలో జాప్యం వహించకూడదని అధికారులను ఆదే శించారు. కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు, ఆర్డీఓ ఎమ్.కృష్ణ మూర్తి, తహసిల్దార్ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

**13 మంది విద్యార్థులను అభినందించిన మంత్రి:** ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర విద్యా చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సోమవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అత్యుత్తమ మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులను సోమవారం ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్య తలు చేపట్టిన వెంటనే రూపొందించిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక అద్భుత ఫలితాలను ఇచ్చింది. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కాకాణిపై మరో కేసు నమోదు

>>పట్ల నిరసిస్తూ కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. న్యాయం అడిగిన బాధితుడిని ఎటువంటి రిపోర్టులు లేకపోయినా పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై హనీఫ్ తీవ్రంగా కొట్టి బెదిరించి కొట్టడాన్ని వీడియో తీసి ఆయన్ను ఆదేశించిన టిడిపి శ్రేణులకు పంపి ఎస్ఐ అవాచికంగా వ్యవ హరించాడని ఆరోపణతో కాకాణి గోవర్ధన్ రెడ్డి వైసిపి శ్రేణులతో కలిసి స్టేషన్ ముందు నడి రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కానీ దురుసుగా వ్యవహరించిన ఆ ఎస్ఐ పై విచారణ ఏమైందో తెలియదు కానీ నిరసన వ్యక్తం చేసిన కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైసిపి నాయకులపై ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగించారంటూ తాజాగా ఎస్ఐ మరో కేసును నమోదు చేసారు. ఈ విషయమై సర్వత్రా కేసు విషయం చర్చనీయాశమైయింది.

## నీట్ 2026 పేపర్ లీక్!

>> సరిపోలాయని గుర్తించింది. ఈ గెస్ పేపర్ కేరళలోని ఒక మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థికి చెందినదని , అతను మే 1న తన స్నేహితుడికి ఇవ్వగా అది వాట్సాప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా కోచింగ్ , పీజీ సెంటర్లలోని విద్యార్థులకు చేరిందని తేలింది. గెస్ పేపర్ ను ఒక్కో అభ్యర్థికి భారీ మొత్తాలకు విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ వ్యవ హారంలో ఇప్పటివరకు సుమారు 13 మంది అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేసి లోతుగా విచారిస్తున్నారు.

**లీకు వార్తలపై ఎన్‌టిఏ స్పందన:** ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం పై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ) స్పందించింది. దీనిపై ఆదివారం ఓ మీడియా ప్రకటన విడుదల చేసింది. ప్రశ్నపత్రం లీక్ అయిందన్న వార్తలను కొట్టిపారేసింది. 2026 మే 3న పరీక్ష పూర్తి భద్రతా ప్రోటోకాల్‌లతో నిర్వహించామని పేర్కొంది. ప్రశ్నాపత్రాలు జిపిఎస్ ట్రాకింగ్ వాహనాల ద్వారా, ప్రత్యేక వాటర్‌మార్క్ గుర్తులతో రవాణా చేయబడ్డాయని తెలిపింది. పరీక్షా కేంద్రాల్లో ఏ ఐ ఆధారిత నిఘా వుంటుందని స్పష్టం చేసింది. అయితే మే 7 రాత్రి పరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత పరీక్షకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందిందని తెలిపింది. మీడియాలో వస్తున్న వార్తలు, కొందరిని అదుపులోకి తీసుకోవడాలు తదితర చర్యల్లో పాల్గొం టున్న సంస్థలకు కృతజ్ఞతలు తెలిపింది. విచారణకు కావలసిన సహకారాన్ని ఎన్ టి ఏ అందిస్తోందని స్పష్టం చేసింది. నిజాయితీగా పరీక్ష రాసిన విద్యార్థుల కృషి , నిబద్ధతపై ఎలాంటి సందే హం లేదని పేర్కొంది. ఈ తరహా వార్తలు కలిగించే ఆందోళనను తమకు తెలుసని, దర్యాప్తు సంస్థలు తమ పని పూర్తి చేయడానికి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించింది.

**తెలుగు రాష్ట్రాల నుండి 1.50 లక్షలకు పైగా విద్యార్థుల్లో ఆందోళన:** డాక్టరు అవ్వాలనే కల నెరవేర్చుకునేందుకు దేశవ్యాప్తంగా సుమారు 22.05 లక్షల మంది విద్యార్థులు నీట్ 2026 పరీక్షకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుండి 58 వేలకు పైగా విద్యార్థులు, పొరుగు రాష్ట్రమైన తెలంగాణ నుండి సుమారు 91వేలకు పైగా అభ్యర్థులు పరీక్ష రాశారు.అయితే ఈ లీక్ వ్యవహారంతో విద్యార్థులు , తల్లిదండ్రులు ఆందోళన చెందుతు న్నారు. దీనిపై ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు స్పందిస్తూ నీట్ పరీక్ష పై వస్తున్న ఆరోపణలు లక్షలాది విద్యార్థులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. 2024లో జరిగిన అక్రమాల తర్వాత కూడా 2026లో మళ్లీ ఇలాంటి వివాదం రావడం ఎన్‌టీఏ భద్రతా వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపుతోం దని స్పష్టం చేశారు. ఈ వ్యవహారం పై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో లేదా సీబీఐ నేతృత్వంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని, ఎన్ టి ఏ భద్ర తా ఏర్పాట్లు, ప్రశ్నాపత్రం సిద్ధం చేసే ప్రక్రియ, కోచింగ్ సెంటర్ల పాత్రను పూర్తిగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.

## డిజిటల్ వాణిజ్య కారిడార్

>> ముఖ్యంగా సింగపూర్, ఏపీలోని విశాఖపట్నం . కృష్ణపట్నం పోర్టు మధ్య ఒక డిజిటల్ వాణిజ్య కారిడార్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశాంఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "సీఫుడ్, వ్యవసాయ ఉత్పత్తులు, ఖనిజాలు, ఫార్మాస్యూటికల్ రంగాల్లో వాణిజ్య అనుసంధానం కోసం సీఐసీ సహకారం ఆశిస్తున్నా అన్నారు.. సీఐసీకి చెందిన బ్లాక్‌చెయిన్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి కాగిత రహిత వాణిజ్యం, సరుకు రవాణాలో పారదర్శకత తీసుకురావచ్చు. దీని కోసం ఏపీలోని ఓడరేవుకు, సింగపూర్‌కు మధ్య డిజిటల్ వాణిజ్య కారిడార్‌ను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలి" అని కోరారు.కోవిడ్ మహమ్మారికి ముందు సీఐసీ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి చైనాకు మిర్చి ఎగుమతి చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని, అయితే సంస్థాగత మద్దతు కొరవడటంతో ఆగిపోయిందని లోకేష్ గుర్తుచేశారు. "ఆ వాణిజ్య కారిడార్‌ను పునరుద్ధరించడం ద్వారా గుంటూరు మిర్చికి కొత్త మార్కెట్‌ను అందించవచ్చు. ఇందుకు సీఐసీ తమ ప్లాట్‌ఫాం ద్వారా సహకరించాలి. రాష్ట్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓ) నాణ్యమైన సరుకును గ్రేడింగ్ చేసి సరఫరా చేస్తాయి. కొనుగోలుదారులతో అనుసంధానం, వాణిజ్య ఫైనాన్సింగ్ వంటి విషయాల్లో సీఐసీ తోడ్పాటు అందించాలి. ముందుగా మిర్చి ఎగుమతులపై పైలట్ ప్రాజెక్టు ప్రారంభిద్దాం" అని లోకేశ్ సూచించారు. ఇందుకోసం సీఐసీ తన చైనా కొనుగోలుదారుల నెట్‌వర్క్‌ను, ఫైనాన్స్ యంత్రాంగాన్ని క్రియాశీలం చేయాలని కోరారు.

**రౌండ్‌టేబుల్ సమావేశానికి సూచన**

మిర్చితో పాటు ఏపీ నుంచి ఎగుమతికి అనువైన ఇతర సరుకులను గుర్తించేందుకు ఒక వేదికను ఏర్పాటు చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. "ఏపీలోని ఎగుమతిదారులు, సీఐసీ, ఎంటర్‌ప్రైజ్ సింగపూర్, ఎస్‌జీఎక్స్‌లను ఒకచోట చేర్చి ఖిఏపీ-సింగపూర్ జాయింట్ కమాడిటీ ట్రేడ్ రౌండ్‌టేబుల్‌ఖి సమావేశాన్ని నిర్వహించాలి" అని ఆయన సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఓడరేవుల ఆధారిత పారిశ్రామికీకరణపై దృష్టి సారించిందని, తద్వారా రాష్ట్ర ఉత్పత్తులను ప్రపంచానికి ఎగుమతి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆక్వాకల్చర్ ఉత్పత్తిలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, మిర్చి ఎగుమతుల్లో 4045 శాతం వాటా కలిగి ఉందని వివరించారు.

**ప్రతిపాదనలు పరిశీలిస్తామన్న సీఐసీ సీఈవో**

మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై సీఐసీ సీఈవో గ్లోరియా ఊ సానుకూలంగా స్పందించారు. తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా కొనుగోలుదారులు, అమ్మకందారులు, లాజిస్టిక్స్ ప్రొవైడర్లను అనుసంధానించే ఒక డిజిటల్ బీ2బీ మార్కెట్‌ప్లేస్ అని ఆమె వివరించారు. బ్లాక్‌చెయిన్ ఆధారిత భద్రత, ఒకే క్లిక్‌తో కస్టమ్స్ క్లియరెన్స్, సప్లై చైన్ ఫైనాన్స్ వంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని గ్లోరియా వూ హామీ ఇచ్చారు.

## 14న రాష్ట్ర కేబినెట్ సమావేశం

**విజయవాడ మే 11 ప్రభాతవార్త ప్రతినిధి:** సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను 13వ తేదీ ఉదయం 11 గంటల్లోగా సాధారణ పరిపాలన శాఖకు పంపాలని అన్ని శాఖలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ఏపీ పెట్టుబడుల మండలి సమావేశం ఆమోదించిన అంశాలు మూడు రోజుల అసెంబ్లీ నిర్వహణ తదితర అంశాలపై మంత్రి మండలి సమావేశంలో చర్చించి ఆమోదించే అవకాశం ఉంది.

## కానిస్టేబుల్ దారుణ హత్య

>> సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఏఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, టూ టౌన్ సీఐ అప్పల నాయుడు, క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తూ నిందితులు కదలికలపై ఆరా తీస్తున్నారు.ఈ ఘటన పాత కక్షలా లేక వ్యక్తిగత కక్షల అనేదానిపై పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పడవ మునిగి ఇద్దరు మృతి

**గుంటూరు, మే 11 ప్రభాత వార్త ప్రతినిధి :** పల్నాడు జిల్లా జిల్లా నరసరావుపేట మండలంలోని కాకాని చేపల చెరువులో పడవ మునిగి ఇద్దరు కూలీలు మృతి చెందారు.చేపలకు ఆహారం వేసేందుకు సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ముగ్గురు కూలీలు పడవలో వెళ్లారు. ఈ క్రమంలో పడవ అదుపు తప్పి చెరువులో బోల్తా పడింది. ముగ్గురిలో ఒకరు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగా మరో ఇద్దరు చెరువులో మునిగిపోయారు.గల్లంతైన వారు పిట్టంబండ్ల హస్సాన్ బుడే (53),అగ్రహారం హుస్సేనా (32)లుగా గుర్తించారు. గజ ఈతగాళ్ళ సహాయంతో ఫైర్ సిబ్బంది, స్థానికులు చెరువులో గాలింపు చేపట్టగా హస్సాన్ బుడే మృతదేహం లభ్యమయ్యింది. మరొకరి కోసం ఫైర్ సిబ్బంది ముమ్మరంగా గాలింపు చేపట్టారు.

## హోంమంత్రి అమిత్ షాతో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,మే 11,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. సోమవారం ఉదయం హోం మంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు.. విభజన హామీలు, పెండింగ్ ప్రాజెక్టలతోపాటు నిధుల కేటాయింపులపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలతో పాటు గతంలో హామీ ఇచ్చిన మేరకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రి అమిత్‌షాకు విజ్ఞప్తి చేశారు. విభజన అంశాలతో పాటు వివిధ పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన నిధుల్ని మంజూరు చేయాలని ఆయన కేంద్ర హోం మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత కేంద్ర బడ్జెట్ లో చేసిన కేటాయింపులతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఆయన కోరారు.పోలవరం ప్రాజెక్ట్ సత్వరం పూర్తి చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేసారు.అమిత్‌షా,చంద్రబాబుల మధ్య ఇటీవల అయిదు రాష్ట్రాల ఎన్నికలు,ముఖ్యంగా బెంగాల్ ఎన్డీఏ విజయం తదితరంశాలపై కీలక చర్చ జరిగిందని సమాచారం. ఏపీలో తాజా రాజకీయ పరిణామాలు,కూటమి ప్రభుత్వ విధానాల అమలుపై ఈ బేటీలో ప్రస్తావనకు వచ్చిందంటున్నారు.ఇక ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్. మహేంద్రదేవ్‌తో సహా నీతిఆయోగ్ సభ్యులతో సీఎం సమావేశం కానున్నారు.



సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమైన సిఎం చంద్రబాబు

## నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం

**విజయవాడ,మే 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర శ్రీలంక తీరం, నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం నెలకొంది. దాంతో రాగల 48 గంటల్లో అల్పపీడనం మరింత బలపడే అవకాశముంది. దాని ప్రభావంతో రేపు పలు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి వర్ష సూచన ఉంది. రేపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పోలవరం అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, తూ.గో, ప.గో, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, జిల్లాల్లో వర్ష సూచన ఉం దగా, తిరుపతి, పోలవరం, అల్లూరి జిల్లాల్లో పలుచోట్ల వడగాలులు వీచే అవకాశముంది. ఇక విజయవాడలో 42.3, ఏలూరు జిల్లా కుక్కునూరులో 42.1డిగ్రీలు,కూనవరం (పోలవరం)లో 42.1, మంత్రాలయంలో 41.5 డిగ్రీలు కొప్పెరపాడు (ప్రకాశం)లో 41.4, కడపలో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కానుంది. అదే విధంగా తాడేపల్లి (ప.గో.)లో 41.2, అచ్చంపేట (పల్నాడు)లో 40.9 డిగ్రీలు, రాయదుర్గం (అనంతపురం)లో 40.8,పెదపారుపూడి (కృష్ణా)లో 40.7డిగ్రీలు, దోర్నిపాడు (నంద్యాల)లో 40.7, నందనమారెళ్ల (మార్కాపురం)లలో 40.6 డిగ్రీలు నమోదు కానుంది.

## ప్రజా అర్జీలపై త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలి

**శ్రీకాకుళం, మే 11 ప్రభాతవార్త :** పబ్లిక్‌గ్రీవెన్స్ కార్యక్రమంలో స్వీకరించే ప్రజా అర్జీలను త్వరితగతిన పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 62 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని చట్టప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదులపట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అర్జీలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీ లించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## అమరావతిలో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి బృందం

>> బృందానికి అధికారులు వివరించారు. నగరంలో 40 కిలోమీటర్ల మేర భారీగా 'అవెన్యూ ప్లాంటేషన్' (పచ్చదనం) చేస్తున్నారు. రాజధానిలోని మూడు ప్రధాన ప్రాంతాల్లో భారీ రిజర్వాయర్లు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆ రిజర్వాయర్ల పైన ఎకో టూరిజం తరహాలో భారీ పర్యాటక ప్రాజెక్టులను రూపొందిస్తున్నామన్నారు. ఇక్కడ నిర్మిస్తున్న గ్రావిటీ కెనాల్ పొడవు 7.8 కిలోమీటర్లు ఉంటుంది. ఇందులో ప్రత్యేకంగా బోటింగ్ సదుపాయం తీసుకురానున్నారు.5 వేల స్క్వేర్ మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్లు చేశారు. ఆ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ పర్యాటక ప్రాజెక్టుల రూపకల్పన కోసం ఇప్పటికే నిపుణులైన ఆర్కిటెక్టులను నియమించినట్లు వెల్లడించారు. వీటన్నింటితో పాటు రాజధాని ప్రజల కోసం అత్యున్నత స్థాయి రవాణా వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ కూడా ప్రపంచ బ్యాంకు బృందంతో పాటే ఉన్నారు. క్షేత్రస్థాయి పనుల పరిశీలన అనంతరం ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం నీరుకొండలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి వెళ్లింది.

అక్కడ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన క్వాంటం కంప్యూటర్ సెంటర్‌ను వారు ఎంతో ఆసక్తిగా చూశారు. అక్కడ విద్యార్థులు, అధ్యాపకులు చేస్తున్న సాంకేతిక, పరిశోధనా కార్యకలాపాలను యూనివర్సిటీ అధికారులు బృందానికి వివరించారు. సాంకేతికత వినియోగంపై బృందం హర్షం వ్యక్తం చేసింది. యూనివర్సిటీ సందర్శన పూర్తయిన తర్వాత ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం తిరిగి సీఆర్డీఏ కార్యాలయానికి చేరుకుంది.

అక్కడ ఏపీ సీఆర్డీఏ కమిషనర్ విజయ రామరాజుతో ప్రతినిధుల బృందం సమావేశమైంది. ప్రస్తుతం అమరావతిలో జరుగుతున్న భారీ భవనాల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో కమిషనర్ వారికి వివరించారు.

మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల పురోగతి గురించి ప్రపంచ బ్యాంకు బృందానికి కమిషనర్ విజయరామరాజు తెలియజేశారు.

## వారం - వర్జ్యం

12-05-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
దశమి మ.2.46
పూర్వాభాద్ర రా.1.13
వర్జ్యం : ఉ.7.46-ఉ.9.21
దు.ఉ.8.11-ఉ.9.02, 2) రా.11.38-రా.12.29
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** బాధ్యతల వెనుక ఉన్న క్లిష్టమైన సమస్యలు ఒక్కొక్కటిగా మీ ముందుకు వస్తాయి. వాహన యోగం కలదు.

**వృషభం:** సంతాన పురోగతిపై పునః పరిశీలన చేసి కొన్ని కొత్త నిర్ణయాలు అమలు చేస్తారు.కుటుంబ గౌరవానికి హాని ఉండదు.

**మిథునం:** ప్రతిష్ఠ పెరుగుతుంది. కొనుగోలు, అమ్మకాలు విషయాలు లాభిస్తాయి. అప్రయత్నంగా పనులు పూర్తి చేస్తారు.

**కర్కాటకం:** కొద్దిపాటి ఒడిదుడుకులు మినహా ఈ రోజు సాఫీగా సాగుతుంది. ఆప్తుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకంగా వుంటుంది. ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**కన్య :** కుటుంబ విషయములో ఇతరుల జోక్యం అధిక మౌతుంది. పోటీ పరీక్షలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు.

**తుల :** ఓర్పు బాగా అవసరము. ఋణ యత్నము ఫలిస్తుంది. మీకు రావలసిన ప్రతిఫలము కొద్దికొద్దిగా చేతికి అందుతుంది.

**వృశ్చికం:** విదేశీ వస్తువుల ఆకర్షణనుండి బయట పడుటకు జాగ్రత్త వహించండి. స్థిరాస్తి విషయములో ఒక నిర్ణయమునకు వస్తారు.

**ధనుస్సు:** శ్రేయోభిలాషుల సలహాలు సంప్రదింపులు పాటించడం మంచిది. స్వయంగా వాహనాలు నడపకపోవడం మంచిది.

**మకరం:** చికాకులు ఉన్నప్పటికీ బాధ్యతలు సక్రమంగా నిర్వహించ గలుగుతారు. సంఘంలో గౌరవ మర్యాదలు పొందుతారు.

**కుంభం:** అస్తవ్యస్తంగా ఉన్న చాలా వ్యవహారాలను మీ ప్రతిభతో అనుకూలంగా మలచుకుంటారు.కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం:** శుభకార్యములకు బహుమతులకు చందాలను, ధనమును అధికంగా ఖర్చు చేయవలసి వస్తుంది. మిత్రుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

సాహితీ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హోంమంత్రి అమిత్‌షాతో సిఎం చంద్రబాబు భేటీ
2లో

నైరుతి బంగాళా ఖాతంలో అల్పపీడనం

epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 101 పేజీలు: 12 వెల: 6.50

# దేశ పురోగతిని ఆపలేరు



సోమవారం న్యూఢిల్లీలో జరిగిన సిఐఐ సమ్మిట్‌లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## గ్లోబల్ జెయింట్‌గా భారత్ ఆవిర్భావం
### క్వాంటం, ఎఐ, ఇంటెలిజెంట్ లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఎంతో అభివృద్ధి
### ప్రధాని సూచించిన 8 అంశాలతో ముందుకు
## సిఐఐతో సుదీర్ఘ అనుబంధం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే11,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ స్వయం సమృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచిన 8 అంశాల జాతీయ మిషన్‌ను ప్రతిఒక్కరూ స్వీకరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సంస్కరణల వాది అయిన ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థానానికి చేరుతుంది అన్నారు. తాజ్ ప్యాలస్ లో జరుగుతోన్న సీఐఐ బిజినెస్ సమ్మిట్‌కు హాజరై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ సీఐఐతో నాకు సుదీర్ఘ అనుబంధం ఉంది. పెట్టుబడుల గురించి సీఐఐతో కలిసి పనిచేశాను అన్నారు. దేశ ప్రయోజనాలు, రాష్ట్ర ప్రయోజనాలే నా అజెండా. అన్నారు. నాలెడ్జ్, టెక్నాలజీ, ట్రస్ట్, స్పీడ్ అనే అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా పోటీ ఉందిఅన్నారు. పరిశ్రమల ఎకోసిస్టమ్, పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఐఐ చాలా కృషి చేసింది. 1990లో వచ్చిన సంస్కరణలను అందిపుచ్చుకుని మనం అంతా కలిసి ముందుకు వెళ్లాంఅన్నారు. క్వాంటం, ఏఐ, అడ్వాన్స్డ్ మాన్యుఫాక్చరింగ్, ఇంటెలిజెంట్ లాజిస్టిక్స్ రంగాలను అందిపుచ్చుకునేలా మనం పనిచేస్తున్నాంఅన్నారు. వేర్వేరు రంగాల్లో గ్లోబల్ ట్యాలెంట్ కూడా మనకు ఉంది అన్నారు. దేశానికి సరైన చోట సరైన నాయకుడుగా ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారు అన్నారు. ఆర్థిక సంస్కరణలు దేశానికి చాలా అవకాశాలు కల్పించాయి. చాలా ఆవిష్కరణలకు కారణం అయ్యాయి. టెలికామ్ డీరెగ్యులేషన్, ఓపెన్ స్కై పాలసీ, విద్యుత్ సంస్కరణలు, రహదారులు లాంటి విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ సంస్కరణల్లో నేను కూడా భాగస్వామిని కావటం సంతోషంగా ఉంది అన్నారు. ప్రస్తుతం దేశంలో సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయి అన్నారు. పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో మంచి ఫలితాలు వచ్చాయి గతంలో పశ్చిమ బెంగాల్ దేశానికే ఆదర్శంగా ఉండేది. కాని గత కొంత కాలంగా ఆ రాష్ట్రానికి అభివృద్ధి ఆలోచనలే లేకుండా పోయాయి అన్నారు. 8 అంశాలతో కూడిన నేషనల్ మిషన్ ను ప్రధాని మోదీ ప్రజలకు ఇచ్చారు. బంగారం కొనుగోలును వాయిదా వేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఇంధనాన్ని పొదుపుగా వాడాలని, విద్యుత్ ఉత్పత్తిని కూడా సూచించారు. ప్రతీ ఇల్లూ, పరిశ్రమ, పొలం అన్నీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు కావాలి. ప్రజా రవాణాను వినియోగించాలని కూడా ప్రధాని స్పష్టంగా పేర్కొన్నారు. యుద్ధానంతర పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు మనం చూశామన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అన్న నినాదాన్ని కూడా ప్రధాని ఇచ్చారు. దానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు మనకు ఉన్నాయి. గ్రేటర్ సెల్ఫ్ రిలయన్స్ అనే అంశాన్ని ప్రధాని ప్రస్తావించారు. ప్రకృతి సేద్యం అన్నది ఓ కీలకమైన అంశంగా మారింది. తద్వారా ఎరువుల దిగుమతి తగ్గుతుంది. మనం స్వయం సమృద్ధి సాధిస్తాం. ఈ జాతీయ టాస్క్ ను మనం అంతా కలిసి సాధించాలి. ప్రతీ సవాలూ ఓ అవకాశాన్ని మనకు సృష్టిస్తుంది.

**దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్:** ప్రధాని ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పలు చర్యలు చేపడుతోందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో ప్రోజ్యూమర్ (ఉత్పత్తిదారువినియోగదారు) విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. మైక్రో గ్రిడ్ వ్యవస్థ ద్వారా విద్యుత్‌సరఫరా నష్టాలను తగ్గిస్తున్నామన్నారు. ప్రకృతి సేద్యం వల్ల ఎరువుల దిగుమతి తగ్గి దేశం స్వయం సమృద్ధి సాధిస్తుంది. ప్రకృతి సేద్యం వల్ల ఎరువుల దిగుమతి తగ్గి దేశం స్వయం సమృద్ధి అన్నారు. మొతమ్మీద ఇది ఒక జాతీయ టాస్క్ అని, దీన్ని అందరూ కలిసికట్టుగా సాధించాలని ఆయన అన్నారు. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ లభించారని చంద్రబాబు ప్రశంసించారు. సంస్క రణల వాది అయిన మోదీ నేతృత్వంలో భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయని, ఇది అభివృద్ధికి >>2


సోమవారం సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రధాని మోదీ

# భారత్ ఎవరికీ తలవంచదు..
### దేశ అభేద్య స్ఫూర్తికి సోమనాథ్ ప్రతీక
### మన 'ఆపరేషన్ శక్తి' దుర్భేద్యం
### పోఖ్రాన్ అణుపరీక్షలతో భారత్ శక్తి ప్రపంచానికి వెల్లడి
### సోమనాథ్ అమృతోత్సవాలలో 'మహాపూజ'లు నిర్వహించిన ప్రధాని మోడీ
### ప్రత్యేక పోస్టల్ స్టాంప్, నాణెం విడుదల

**గిర్ సోమనాథ్(గుజరాత్), మే 11:** గుజరాత్‌లోని ప్రభాస్ పటాన్‌లో సోమవారం నిర్వహించిన "సోమనాథ్ అమృత్ మహోత్సవ్" వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ, సోమనాథ్ ఆలయాన్ని భారతదేశపు "అభేద్య స్ఫూర్తికి", "నాగరిక చైతన్యానికి" ప్రతీకగా అభివర్ణించారు. శతాబ్దాలుగా విధ్వంసాలు, దండయాత్రలు ఎదురైనా పదేపదే పుంజుకునే దేశ సామర్థ్యానికి ఈ ఆలయం ప్రతీక అని అన్నారు. "జై సోమనాథ్", "హర హర మహాదేవ్" నినాదాలతో తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ, "ప్రభాస్ పటాన్ ప్రాంతం ఒక ప్రత్యేకమైన ఉత్సాహంతో నిండిపోయింది. దైవిక కాంతితో వేగిపోతోంది" అని కొనియాడారు. "ఈ మహాదేవుని >>2

# అమరావతిలో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి బృందం

**విజయవాడ.మే 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో. ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటించింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో చేపడుతున్న వరద నియంత్రణ ప్రణాళికలు, పర్యాటక అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులను ఈ బృందం క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించింది. రాజధానిపై భవిష్యత్తులో వరద ప్రభావం పడకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ప్రతినిధుల బృందం ఎన్16 జంక్షన్ సమీపానికి చేరుకుంది. అక్కడ వేగంగా జరుగుతున్న గ్రావిటీ కెనాల్ అభివృద్ధిపనులను ప్రత్యక్షంగా పరిశీలించింది. ఈ సందర్భంగా అమరావతి అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్, సీఎండీ లక్ష్మీ ... పార్థసారథి వరద నియంత్రణ చర్యలను ప్రపంచ బ్యాంకు బృం దానికి వివరించారు. వందేళ్లలో ఎప్పుడూ లేనంత వరద వచ్చినా సులభంగా తట్టుకునేలా ఒక బృహత్తర ప్రణాళికను రూపొం దించామని బృందానికి స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్ ఆధారంగా వాగులు, కాలువలను వెడల్పు చేస్తున్నట్లు తెలిపారు. రాజధాని పరిధిలోని చెరువుల అభివృద్ధి పనులను కూడా ఎంతో శాస్త్రీ యంగా చేపడుతున్నామని ఆమె వివరించారు. అమఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలను కూడా >>2



## మాజీ మంత్రి కాకాణిపై మరో కేసు నమోదు

**పొదలకూరు (నెల్లూరు), మే 11, ప్రభాత వార్త :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు జిల్లా వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పై కేసుల నమోదు పర్వం ప్రారంభమైయ్యింది. దాదాపు 25 కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. జిల్లా అధ్యక్షుడుగా కాకాణి ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఏదో ఒక కారణం చూపిస్తూ కేసులు పెడుతున్నారని వైసిపి ఆరోపణ చేస్తోంది. ఏది ఏమైనా తాజాగా ఓ రైతు విద్యుత్ కనెక్షన్ విషయంలో పొదలకూరు విద్యుత్ ఎఇ లంచం తీసుకుని మరీ పని చేయకుండా తెలుగుదేశం నాయకులతో చెప్పియమని చెప్పటంతో ఈ విషయం కాస్త బయటకు పొక్కింది. వైసిపి శ్రేణులపై కక్ష సాధిస్తున్న తెలుగుదేశం నాయకుల తీరు పట్ల విద్యుత్ శాఖ ఎఇ అవినీతి >>2


జి.నాగేశ్వరరావు(ఫైల్)

## కానిస్టేబుల్ దారుణ హత్య

**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,మే 11,ప్రభాతవార్త:** కాకినాడ గాంధీనగర్ రెడ్ క్రాస్ సమీపంలో ఏపీ ఎస్పీ కానిస్టేబుల్ జి.నాగేశ్వరరావు(46) దారుణ హత్యకు గురయ్యారు. ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న దారుణ ఘటనకు జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. రెడ్ క్రాస్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న నాగేశ్వరరావుపై గుర్తుతెలియని దుండగులు కత్తితో దాడిచేసి పరారయ్యారు. స్థానికులు పోలీసులకు >>2

# నీట్ 2026 పేపర్ లీక్!




### పరీక్షకు ముందు కేరళ నుండి రాజస్థాన్ విద్యార్థులకు గెస్ పేపర్
### సుమారు 140 ప్రశ్నలు యథాతథంగా పరీక్షలో..
### విచారణ చేపట్టిన రాజస్థాన్ ప్రత్యేక దర్యాప్తు బృందం
### పేపర్ లీక్ ఆరోపణలను కొట్టిపారేసిన ఎన్‌టిఎ
### తెలుగు రాష్ట్రాల నుండి 1.50లక్షల మంది విద్యార్థులు నీట్‌కు హాజరు

**గుంటూరు, మే 11 ప్రభాతవార్త ప్రతినిధి :** అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థుల ఎంపిక కోసం నిర్వహించే నీట్ పరీక్ష పై మరోసారి నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద పరీక్షగా చెప్పబడుతున్న నీట్ నిర్వహణలో ఎన్ టి ఏ సామర్థ్యం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నీట్ 2026 పరీక్ష ప్రశ్నావళిలోని కొన్ని ప్రశ్నలు గెస్ పేపర్ రూపంలో ముందుగానే లీక్ అయ్యాయనే వార్తలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం అయ్యాయి. 2024లో జరిగిన నీట్ పరీక్ష గందరగోళం తర్వాత కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశాయి. అయినా ఇలా ప్రతి సంవత్సరం లీక్ వార్తలు రావడం పరీక్షల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈసారి కూడా కొన్ని కోచింగ్ , పిజి సెంటర్లలో వుండే విద్యార్థులకు కొంతమంది బ్రోకర్ల ద్వారా భారీ మొత్తాలకు ప్రశ్నాపత్రాల్లోని ప్రశ్నలను గెస్ పేపర్ రూపంలో లీక్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వెలుగులోకి వచ్చింది ఇలా..** రాజస్థాన్‌లోని సికార్ ప్రాంతంలో నీట్ పరీక్షకు ముందు కొన్ని పీజీ సెంటర్లలోని విద్యార్థులకు పిడీఎఫ్ రూపంలో సుమారు 80 పేజీల ఒక గెస్ పేపర్ వివిధ సోషల్ మీడియా గ్రూపుల ద్వారా చేరింది. ఈ గెస్ పేపర్ కొంతమంది లైట్ తీసుకోగా మరికొందరు సీరియస్‌గా ప్రిపేర్ అయ్యారు. అయితే మే 3 వ తేదీన పరీక్ష పూర్తయిన తర్వాత విద్యార్థులు ప్రశ్నపత్రం సరి చూసుకోగా గెస్ పేపర్‌లో పేర్కొన్న సుమారు 140 ప్రశ్నలు మక్కీకి మక్కీ నీట్ ప్రశ్నపత్రంలో వచ్చినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని విద్యార్థులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గెస్ పేపర్ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ గెస్ పేపర్ పై దర్యాప్తు చేపట్టిన రాజస్థాన్ స్పెషల్ ఆపరే షన్స్ గ్రూప్ప్రాథమిక విచారణలో సుమారు 140 ప్రశ్నలు అసలు పేపర్‌తో ఖచ్చితంగా >>2

# పోలవరం-బనకచర్ల లింక్‌కు అనుమతులివ్వండి

### కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సిఆర్ పాటిల్‌ను కోరిన సిఎం చంద్రబాబు
### గోదావరి పుష్కరాలలోగా పోలవరం పూర్తికి సహకరించాలని వినతి



సోమవారం న్యూఢిల్లీలో కేంద్రజలశక్తి శాఖమంత్రి సిఆర్‌పాటిల్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 11, ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరుకు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలను మళ్లించేలా ప్రాజెక్టు చేపడుతున్నట్టు వెల్లడించారు. సీఎం చంద్రబాబు సోమవారం ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యారు. పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ సీఆర్ పాటిల్ కు విజ్ఞప్తి చేసిన సీఎం చంద్రబాబు. 2027 గోదావరి పుష్కరాల లోపు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును పూర్తి చేసేందుకు పూర్తి సహకారం అందించాలని జలశక్తి శాఖను సీఎం చంద్రబాబు కోరారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని కోరిన సీఎం. ఇప్పటికే తాను స్వయంగా 5 మార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించినట్టు వెల్లడించిన ముఖ్యమంత్రి. 2026 ఏప్రిల్ 2 నాటికి కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని, గ్యాప్ 1, గ్యాప్ 2 లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉందన్న కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. దీని వల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినట్టు సీఎం చంద్రబాబు >>2

# వైద్యసేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం


సోమవారం టెక్కలి ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

### టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ప్రతి విభాగాన్ని తనిఖీ చేసిన మంత్రి అచ్చెన్నాయుడు
### మంచినీటి సమస్యపై ఆగ్రహం.. 36 గంటల్లో నివేదిక సమర్పించాలని ఆదేశం
### రోగుల సౌకర్యాలపై బాధ్యతతో వ్యవహరించాలని సిబ్బందికి హెచ్చరిక

**శ్రీకాకుళం/టెక్కలి, మే 11 ప్రభాతవార్త:** జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎటువంటి అలసత్వం వహించినా సహించేది లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను హెచ్చరించారు. సోమవారం ఉదయం 9 గంటలకే ఆకస్మికంగా టెక్కలి జిల్లా ఆసుపత్రికి చేరుకున్న మంత్రి,సుమారు గంటన్నర పాటు ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా తనిఖీచేశారు. ప్రధానంగా వైద్యులు, సిబ్బంది సమయపాలనపై ఆరా తీసిన ఆయన విధులకు ఆలస్యంగా వచ్చిన 42 మంది సిబ్బందికి మరోసారి పునరావృతం కాకుండా పద్ధతి మార్చుకోవాలని సుతిమెత్తగా హెచ్చరించారు. ఆసుపత్రిలో తాగునీటి సమస్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దీనిపై కమిటీ వేసి 36 గంటల్లోగా నివేదిక సమర్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, రోగులకు ఇబ్బంది కలగకుండా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ఆసుపత్రిలో నీటి లభ్యత ఉన్న చోట వెంటనే కొత్త బోరు తవ్వించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించడంతో పాటు, రోగుల రాకపోకల సౌకర్యార్థం ప్రధాన గేటు వద్ద రెండు మాన్యువల్ గేట్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఆసు పత్రికి వచ్చే కేసులకు సాధ్యమైనంత వరకు ఇక్కడే చికిత్స అందించాలని, అత్యవసరమైతేనే జిల్లా కేంద్రానికి రిఫర్ చేయాలని వైద్యులకు దిశానిర్దేశం చేశారు. ఓపీ విభాగాన్ని సందర్శించి రోగులతో మాట్లాడిన మంత్రి మరుగుదొడ్ల నిర్వహణ, ఫ్యాన్లు, లైట్లు, లిఫ్ట్ సౌకర్యాలను స్వయం గా పరిశీలించారు. మంత్రి చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద రూ.18 లక్షల విలువైన వైద్య పరికరాలను ఆసుపత్రికి >>2


సింగపూర్ కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ (సిఐసి) సిఇఒ గ్లోరియా వూతో మంత్రి లోకేష్

# సింగపూర్, విశాఖ-కృష్ణపట్నం మధ్య డిజిటల్ వాణిజ్య కారిడార్

### సింగపూర్‌లో సిఐసి సిఇఓతో మంత్రి లోకేష్ చర్చలు
### గుంటూరు మిర్చికి కొత్త మార్కెట్ లభ్యం

**విజయవాడ,మే 11, ప్రభాతవార్తప్రతినిధి:** సింగపూర్, ఏపీలోని విశాఖపట్నం- కృష్ణపట్నం పోర్టు మధ్య ఒక డిజిటల్ వాణిజ్య పైలట్ ప్రాజెక్టుగా కారిడార్ నిర్మించే దిశలో ఆలోచన చేయాలని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ కోరారు. ఏపీ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌కు చేర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రణాళికలను కార్యచరణలోని తీసుకుని వస్తోంది. ఈ క్రమంలో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. సోమవారం ఆయన సింగపూర్ కమాడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ (సీఐసీ) సీఈవో గ్లోరియా వూతో సమావేశమై రాష్ట్ర ఎగుమతులను ప్రోత్సహించేందుకు పలు కీలక ప్రతిపాదనలు చేశారు. >>2

వార్త

ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కరే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం కొనసాగిందంటే ఇద్దరూ బాధ్యులే.

-థామస్ ఫుల్లర్

# దేశహితమే సమ్మతం!

నిన్నటివరకు రాజకీయ హితం గురించి మాట్లాడిన ప్రధాని మోడీ ఒక్కసారిగా తన గొంతు సవరించు కొని అభివృద్ధి సంక్షేమాల తాళింపుతో దేశహితోపదేశం చేశారు. అదీ తెలంగాణ గడ్డమీద. పశ్చిమాసియా యుద్ధ సంక్షోభంలో ఇంధన సమకూర్పుకు ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నామో ఏకరువు పెడుతూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకోవడమెలాగో హితవు పలికారు. నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా! అంటూనే తెలుగు ప్రజలతో మమేకమై ఎంతో ప్రియాతిప్రియమైన హితవచనాలు వారి చెవికెక్కేలా ప్రసంగాన్ని పండించారు. సంక్షోభం తలెత్తినప్పుడు దేశహితం కోసం పనిచేయడానికి ప్రతీపౌరుడు కట్టుబడి ఉండటం ఈ దేశానికి శ్రేయస్కరమన్న పలుకులు ఆయన నోటంట వినిపించాయి. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రతి భారతీయుడు సంకల్పం చెప్పుకోవాల్సిన అవసరముందని చెప్పగానే జనం జేజేలు పలికారు. ప్రపంచంలో పెట్రోలు ధరలు బాగా పెరిగాయి. వాటి కొనుగోలుపై ఖర్చయ్యే విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయాలి. ప్రస్తుతానికిది మోడీ మంత్రంగానే పనిచేస్తుంది. దేశంలో వంటనూనె కోసం పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని వ్యయపరుస్తున్నాం. నూనెల వినియోగాన్ని కనీసం పది శాతాన్ని తగ్గిస్తే ఆరోగ్యానికి ఆరోగ్యం, దేశానికి లాభం కలుగుతుంది. మానవాళి సౌభాగ్యం కోసం పండించే 'పంట సిరి'లను కూడా అధిక ఎరువుల వినియోగం ద్వారా వృథా చేయవద్దని ఆయన అభిలాష. కొన్నిటి విషయమై శాస్త్రజ్ఞులు చెబితే ఎంత ఆతృతంగా వింటామో అంతే ఆతృతగా ప్రధాని స్వయంగా చెప్పారంటే వినని, వినిపించుకోని జనం ఉండనే ఉండరు. దేశ సౌభాగ్యానికి ప్రతీక రైతు. అలాంటి రైతు నుంచి ప్రధాని ఆశిస్తున్న అంశాలేవైనా ఉన్నాయంటే అది రసాయనిక ఎరువుల వినియోగం రెట్టింపైపోతుండగా వాటి దిగుమతులకు హెచ్చు వ్యయం జరుగుతోంది. క్షేత్రీయ అవసరాలను నియంత్రించుకుని 25, 30, 40, 45 శాతం తగ్గించుకోవాలి. రసాయనిక ఎరువులు అతిగా వాడితే పంట నాశనమౌతోంది. భూమిని కాపాడుకోవడమూ కష్టమే. అందుకే మితిమీరిన ఎరువుల వినియోగం ఆపాలి. సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారిస్తే మేలు. తద్వారా నేచురల్ ఫామింగ్‌తో భూసారాన్ని వ్యవసాయ క్షేత్రాలను, రక్షించుకోవాలని రైతుల్ని కోరారు. డీజిల్ పంపుల బదులు సోలార్ పంపుల వినియోగంపై దృష్టి పెట్టాలి. ఇంటి ఇల్లాలికి పనిపెట్టారు. విదేశీ దిగుమతులను ఆపడం ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని తగ్గించుకోవచ్చని ప్రధాని ఉవాచ. ప్రత్యేకించి మహిళలు ఒక ఏడాది పాటు బంగారు కొనుగోళ్లు ఆపేస్తే కూడా మారకద్రవ్యం నిలబడుతుందన్నారు. ఇంధన ఉత్పత్తుల విషయంలో ప్రపంచమంతటా సప్లై చైన్ ఇబ్బందులు ఏర్పడినందున పెట్రోలు, డీజిల్ వినియోగాన్ని కూడా తగ్గించుకోవడంలో సంయమనం పాటించాలి. ఉక్రెయిన్, రష్యా యుద్ధంలో ఆహారం, ఎరువులు, ఇంధనం ధరలు ప్రపంచవ్యాప్తంగా బాగా పెరిగిపోయాయి. కరోనా కారణంగా సరఫరావ్యవస్థలన్నీ చిన్నాభిన్నం అయిపోయాయి. ఇలా ప్రపంచ పరిస్థితుల్ని చెబుతూనే ప్రజల్ని కార్యోన్ముఖుల్ని చేయడం స్వాగతించదగిన విషయం. రాజకీయ ప్రసంగాన్ని ఒక్కసారిగా కట్టడిచేసి తెలంగాణలో అడుగుపెట్టగానే అభివృద్ధి గణాంకాలను వల్లె వేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చినట్లు అభివృద్ధి నిధులు కావాలంటే తెలంగాణకు పెద్దగా నిధులు సమకూరవని, గణాంకాలు మార్చుకుని 'డబుల్ ఇంజన్ అభివృద్ధి సాధించడంలో కేంద్రప్రభుత్వానికి సహకరించాలని స్థానిక ప్రభుత్వాన్ని కోరారు. గతంలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై సుంకాలు రుద్దగానే ఒక్కసారిగా ప్రధాని 'స్వదేశీ నినాదాన్ని ఎత్తుకున్నారు. స్వదేశీ ఉద్యమం ఈనాటిది కాదు. కొత్తగా వచ్చింది కాకపోయినా స్వావలంబన సిద్ధాంతాన్ని, స్వయం సమృద్ధి ఆవశ్యకతను ఆయన పలికారు. ఇళ్లల్లో వాడే టూత్‌పేస్ట్, బ్రష్, దువ్వెన వంటి నిత్య వినియోగ వస్తువులు కూడా విదేశాల్నించి తెచ్చుకోవడాన్ని ఆయన నిరసించారు. అయితే వీధి గుమ్మం దాటి వంటింట్లోకి చేరిన విదేశీ వస్తు నియంత్రణకు మహిళల సహకారం ఎంతో అవసరమన్నది ప్రధానంగా చాటి చెప్పారు. స్వదేశీ అనగానే దీపావళి దివ్వెలను వాడుతున్నాం కదా! అని సరిపెట్టుకోరాదని ప్రధాని వివరించారు. తాను చెప్పినవన్నీ ప్రతి పౌరుడు, రాజకీయ పార్టీ, ప్రతిసంస్థ పాటించాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరడం విశేషం. భారత దేశాభివృద్ధిలో సంక్షోభాలను జయించడం కూడా ఒక భాగమేనన్నారు. ప్రపంచమార్కెట్‌లో ఎరువుల బస్తా రూ.3వేలు ఉండగా భారత్ కేవలం రూ.300లకే అందించగలుగుతోందని వెల్లడించారు. భారత్‌లో పెద్ద పెద్ద పెట్రోలు బావులు లేనందున దిగుమతులు తప్పడం లేదని, వాటి వలన సామాన్యులపై భారం పడకుండా కేంద్రమే భరిస్తోంది. వీటన్నిటినీ క్రోడీకరించుకుంటే విదేశీ మారకద్రవ్య నిల్వలు భారీగా తగ్గిపోతున్నందున వ్యయకర్తనం తప్పదన్నది ఆయన ఆందోళనకు కారణం. ఇంధన వినియోగం తగ్గించే పరిష్కార మార్గంలో సాధ్యమైనంతవరకు రైల్వే సరుకు రవాణాను మాత్రమే వినియోగించాలి. ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని ఆయన సూచిస్తున్నారు. ఓ యేడాదిపాటు విదేశీ పర్యటనలను ఆపేయాలి. భారత్‌లో గల అనేక పర్యాటక ప్రాంతాలను మాత్రమే సందర్శించాలి. భారత్‌ను ఆత్మనిర్భర్ కాకుండా అడ్డుకునే అన్ని అంశాల్లోనూ అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత భారతీయులదేనన్నారు. అటు పార్టీ శ్రేణులను ఎంతగా తట్టిలేపారో, ఇటు సామాన్య ప్రజానీకాన్ని ప్రధాని నరేంద్రమోడీ తన చైతన్యవంత ప్రసంగం ద్వారా స్ఫూర్తి కలిగించారు.

సంకల్పబలం ఉన్నవారు అన్నిటినీ తనకు అనుకూలంగా మలచుకోగలరు. సంకోచించే మనస్సుతో పనిచేసే వాడికి కార్యనాశనం తప్పదు.



సోక్రటీస్

సత్యమనేది మహావృక్షం లాంటిది. దానికి మనం నీళ్లుపోసి పెంచితే అది ఎన్నో పూలు, పండ్లు మనకు ఇస్తుంది.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### ఆచరణలేని ప్రధాని మాటలు

నిన్న హైదరాబాద్‌లో ప్రధాని మోడీ మాట్లాడుతూ ప్రజలు ఖర్చు తగ్గించుకోవాలి అని చెప్పారు. సంతోషం. ఐతే తాము చెప్పేదాన్ని ఎవరైతే ఆచరిస్తారో, వెనుకవారు అనుసరిస్తారు. చెప్పేదోకటి చేసేదోకటిగాఉంటే ఎవరూ నిన్ను అనుసరించరు. ఇది ప్రధానమంత్రి తెలుసుకోవాలి. పటేల్ విగ్రహం మూడువేల కోట్లు పెట్టి నిర్మించడం ఇప్పుడు మన పేద దేశానికి అవసరమా! ప్రధాని నిత్యం ధరించే సూటు ఖరీదు పది పదిహేను లక్షలుంటుంది. ఒక పేద దేశ ప్రధానికి అంత ఖరీదు డ్రెస్ అవసరమా? నెహ్రూ ఎంత సింపుల్‌గా ఉండేవాడు. లాల్‌బహదూర్ శాస్త్రి గారు ఎలాఉండేవాడు? నెలకు 20 రోజులు విదేశాలలో పర్యటిస్తున్నారు. అవసరమా? మనదేశప్రధానులలో ఇంతవరకు ఇన్ని విదేశ ప్రయాణాలు ఎవరూ చెయ్యలేదు. ఇదంతా దుబారాకాదా ఆచరణలేని ప్రకటనలు చెయ్యకూడదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఆప్షనల్ సబ్జెక్ట్‌గా అడ్వర్టైజింగ్

మార్కెటింగ్ వ్యవస్థలో అడ్వర్టైజింగ్ ప్రముఖ పాత్ర వహిస్తుంది. ప్రతిరోజు ప్రతి వ్యక్తి ఏదో ఒక వస్తువును వినియోగిస్తూనేఉంటాడు. ప్రతి మానవుడువినియోగదారుడే. కనుక విద్యార్థులకు ఒక ఆప్షనల్ సబ్జెక్టుగాఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు అడ్వర్టైజింగ్ సబ్జెక్టు ఉండాలి. పూర్వం డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో అడ్వర్టైజ్మెంట్ సబ్జెక్టు కలిగినవారికి బోధన రంగంలో అవకాశాలు కల్పించాలి. అడ్వర్టైజ్మెంట్ సబ్జెక్టు మీద అవగాహన కల్పించాలి 2026-2027 విద్యా సంవత్సరం నుండి ప్రారంభించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### అతివేగం ప్రమాదకరం

రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మితిమీరిన వేగంతో వెళ్తున్న బైకులు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు అన్ని ఏమాత్రం ఆలోచించకుండా అతి వేగంతో వెళ్ళడం వలన నిరంతరం ప్రమాదాలు జరుగుతూ ఇంట్లో వాళ్ళని కోల్పోతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఏక్కడికైన వెళ్ళినప్పుడు నిదానంగా నడుపుతూ, ఇంట్లో వాళ్ళ భవిష్యత్ గురించి ఆలోచిస్తూ ఉంటే తప్ప ప్రమాదాలనుకొంత వరకైనా నివారించే అవకాశం ఉంది. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల గురించి ఆలోచించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### పాఠశాలలు ప్రగతికి నిలయాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలు నేడు అద్భుతమైన ప్రగతికి నిలయాలుగా మారుతున్నాయి. ఇటీవల వెలువడిన ఒక స్ఫూర్తిదాయక ప్రకటన ఈపాఠశాలలు కేవలం ప్రత్యామ్నాయాలు మాత్రమే కావు, శ్రేష్ఠమైన విద్యా కేంద్రాలని చాటి చెప్పింది. 'తల్లిలాలాలన, తండ్రిలారక్షణ, స్నేహితుడిలా బోధన' అనే నినాదం అక్కడి ఆత్మీయవాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. కేవలం వసతుల గురించి మాత్రమే కాకుండా, విద్యార్థుల విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఈ ప్రచారం తల్లిదండ్రుల్లో గొప్పనమ్మకాన్ని కలిగిస్తోంది. నాణ్యమైన విద్యను కోరుకుంటూనే ఆర్థిక భారాన్ని మోయలేని కుటుంబాలకు ఇవి సరైన వేదికలుగా మారాయి. ఈ విద్యా విప్లవంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం. వారు విద్యార్థుల విద్యా వృద్ధిని పర్యవేక్షిస్తూ, వారినిఉన్నత శిఖరాలకు చేరుస్తున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పండ్ల తోటలను పెంచాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వరికి బదులుగా వేరే పంటలను ప్రోత్సహించడానికి ప్రయత్నం చెస్తుంది అనే వార్త కొంత ఆశాజనకంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా 2014 లో తెలంగాణ లో 68.64 లక్షల ఎకరాలలో వరి సాగు చేస్తే ఇప్పుడు అది 1.34 కోట్ల ఎకరాలలో సాగు చేస్తున్నారు. అంటే నీటి వసతిపెరగడం ఒకవిషయం అయితే వరిసాగు తేలికగా అయిపోవడం ఒక కారణం. ఇకపోతే తెలంగాణ లాంటి రాష్ట్రంలో చిరు ధాన్యాలు సాగు చేయడానికి అనుకూలంగా వాతావసరణం ఉంటుంది. ముఖ్యంగా పండ్ల సాగు, కురగాయల సాగు కందులు పెసలు, మినుములతో సహా మిగిలిన చిరు ధాన్యాల సాగుకీ చాలా అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఇంకా తెలంగాణకు ఉండే చిన్న నీటి పారదల వ్యవస్థ ఉండడం నెల స్వభావం సహకరించడం వల్ల పండ్ల తోటల పెంపకం, కూరగాయల సాగు ఉపాధి హామీకి వినియోగించాలి.

- భారత అవినాష్ ,జనగామ

### ఇంటర్ కౌన్సెలింగ్ రెమ్యూనేషన్

ఇంటర్మీడియట్ విద్య శాఖపరిధిలోఉన్న అన్నిజూనియర్ కళాశాల లెక్చరర్ల కౌన్సిలింగ్ రెమ్యూనేషన్ ఈవిద్యా సంవత్సరం పెంచాలి. రెగ్యులర్ లెక్చరర్ అందరికి డ్యూటీ లు వేయాలి. సరిపోకపోతే పార్ట్‌టైమ్ లెక్చరర్‌లను వినియోగించుకోవాలి. వికాకలాంగుల లెక్చరర్‌లకు తగిన వసతి కలిపించాలి. నగదు రూపంలో ఇంటర్ కౌన్సిలింగ్ రెమ్యూ నిటేషన్ ఇవ్వాలి. ఇంటర్‌కౌన్సిలింగ్‌కోసం స్పెషల్‌గాసర్క్యులర్‌జి.ఓ తీయాలి..

-రాపాక రవీందర్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'విజయ' ఢంకా మోగింది!

**హీరోగా మొదలుపెట్టినవాడు జీరోగా ఎందుకు మారు తాడు అన్న ఆశావాదంతో అతని అభిమానులు ఈలలతో చప్పట్లతో రాబోయే కథను చూడానికి సిద్ధంగా ఉన్నారు. సినిమా హీరోలు రాజకీయాల్లోకి ప్రవేశిస్తే ఆ కథే వేరు అన్నది ఎంజీఆర్, ఎన్‌టీఆర్, హీరోయిన్ జయలలిత నిరూపించగలిగారు. విజయాన్నే పేరులో ధరించిన విజయ్, అపజయాన్ని ఎదుర్కోడన్న నమ్మకంతో అతని ఫాన్స్‌తో బాటు తమిళనాడంతటా సుపరిపాలనతో ప్రజలను ఆకట్టుకోగలడని ఆశలు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. వారే కాదు దేశమంతటా అదే మాదిరి తమిళనాడును ముఖ్య రంగస్థలంగా భావిస్తూ ఏమవుతుందో అని ఎదురు కావులు కాస్తున్నది. రాజకీయం, క్రికెట్ ఉత్కంఠ భరితంగానే ఉంటాయి. కానీ చివరి మలుపులో గెలుపుతో దోబూచులాట ఉంటుందని అందరికీ తెలుసు.**



రావులపాటి సీతారాం రావు

తమిళనాడు ఎన్నికలు చరిత్రను తిరగరాసాయి. సినిమా నటుడు విజయ్ విజయం చారిత్రాత్మకంగా మారింది. దానికి కారణం రెండు బలమైన ద్రవిడ పార్టీలను ఎదుర్కోవటమేకాకుండా రెండు జాతీయ పార్టీలు బిజెపి, కాంగ్రెస్‌కు అంతు చిక్కని రీతిలో విజయం సాధించగలిగారు. ఆ విజయం ముఖ్యమంత్రి కుర్చీకి పది సీట్ల దూరంలో ఆగిపోవడం కూడా. మనదేశంలో పాతుకొనిపోయినపార్టీల తీరుతెన్నులను పరిపూర్ణంగా ప్రజలు అర్థం చేసుకోటానికి విధి ఇచ్చిన అవకాశంగా భావించాలేమో! కాలికి వేస్తేమెడకు, మెడకేస్తే కాలికి మెలికలు పెట్టి గవర్నర్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని వాయిదాల మీద వాయిదాలు వేయడం కూడా ఒక విధంగా దేశంలోని ప్రజలందరికీ, నామినేట్ చేయబడ్డ రాజ్యాంగ పదవిలోని వారి పనితనం తెలియచేసినట్లయింది. రామ్‌లాల్ గవర్నర్ గిరీని జ్ఞప్తికి తెచ్చే రీతిలో ఈ ఉదంతం సాగటం ఉత్కంఠను కలిగించింది కానీ ప్రజాస్వామ్యవాదులను తీవ్రంగా నిరుత్సాహపర్చింది. అసామాన్య రీతిలో డబ్బును ఎరజూపకుండా విజయ్ (చాలా ఉచితాలు ప్రకటించడం కూడా ఈ సందర్భంగా విమర్శించవచ్చు) విజయాన్ని దిగ్గజాలను ఢీకొట్టి సాధించడం చరిత్రలో నిలిచిపోతుంది. విజయం తర్వాత తరువాయి భాగం ఏవిధంగా నడుస్తుందో గొప్పగొప్ప రాజకీయ పండితులకూ, విశ్లేషకుల ఊహలకు అందకుండా ఉండటం కూడా విడ్డూరంగానే ఉంది. 2024లో విజయ్ స్థాపించిన టి.వి.కే పార్టీ అనూహ్యంగా రెండు సంవత్సరాలలోనే అధికారాన్ని చేజిక్కించుకోవటం ఇప్పుడు విశేషవార్తగా కొనియాడబడుతుండడంలో ఆశ్చర్యంలేదు. అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి.ఆర్ తొమ్మిది నెలల్లోనే అనూహ్యంగా రాజ్యాధికారం సంపాదించగలిగారు. ఈ రెండింటికి పోలికలు అనివార్యమని అనుకోవచ్చు. కానీ అప్పటి ఎపి పరిస్థితులువేరు, ఇప్పటి తమిళనాడు పరిస్థితులు వేరు. అప్పుడు ఎపిలో రాజకీయంగా ఖాళీ ఉంది. అంటే కాంగ్రెస్‌తో విసిగిపోయిన ఆంధ్ర ప్రజానీకం మార్పు కోసం అర్రులు చాచిన రోజులవి. ఆధిపత్య ధోరణితో ఢిల్లీ కాంగ్రెస్‌ను దర్బార్ ఇష్టమొచ్చిన రీతిలో ముఖ్యమంత్రులను మార్చి ప్రజల మనోభావాలను పట్టించుకోకపోవడం పతాక స్థాయికి చేరుకున్నప్పుడు ఎన్.టి.ఆర్ రంగప్రవేశం చేసి అప్పటికే నట సార్వభౌముడిగా సినీరంగాన్ని తిరుగులేని రీతిలో ఏలుతుండడంతోపాటు, ప్రచారంలో కొత్తపోకడలతో, చైతన్యరథంతో నవచైతన్యంతోపాటు 'పొగడరా నీ తల్లి భూమి భారతిని అనితెలుగు జాతి గౌరవాన్ని తెలుగు వారి మనోభావాలను దెబ్బతీసిన వైనాన్నినిలువెత్తు అద్దంలోహావభావాలతో డైలాగ్‌లతో చూపిస్తూ కదిలిరా అంటూ నిద్రలో ఉన్న జనాన్ని రాజకీయ రీతిలో మేల్కొల్పగలిగారు. అందువల్లే కాంగ్రెసును ప్రక్కకు నెట్టేసి ఎన్.టి.ఆర్‌కు పట్ట కట్టారు. ఇప్పుడు విజయ్ పరిస్థితి రెండు పులులతోనే కాదు, కనపడని మరో అజ్ఞాత వ్యక్తితో పోరాటం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ద్రవిడ మనోభావాలకు నిలువెత్తు నిదర్శనమైన తమిళజాతిని ప్రాణం పోసిన డియంకే, ఎడియంకెలతోపాటు ఇతర బిజెపి, లెఫ్ట్ పార్టీలను చివరకు కాంగ్రెసును కూడా ఒక్కడంటే ఒక్కడిగా ఓడించి విజయం సాధించడం అపూర్వం. కారణాలు అందరికీ కనపడినవే. నిజాయితీకి, అవినీతిరహిత ఎన్నికలలో పాల్గొన్న విధానానికి విజయ్‌ని నిదర్శనంగా అక్కడి ప్రజలు భావించారు. పెరియార్, కామరాజ్, అంబేద్కర్‌లతో తమిళులకు ఆదర్శులైన మరో ఇద్దరు, నాయకుల వేలు నాచియార్ అంజలాయి అమ్మాల్ విగ్రహాలను ఒక వేదికపై అధిష్టింపచేసి, వారే తనకు ఆదర్శప్రాయులని ఆ స్థలాన్ని సందర్శిస్తూ



ఇన్నేళ్లు తమిళులకు తనేమిటో, తన విధానాలూ, ఆదర్శాలు ఆ విధంగా తెలియచెప్పారు. ప్రచారం మొదటి దశలోనే టి.వి.కె నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాటలో దాదాపు నలభైకిపైగా మృత్యువాతపడినప్పుడు ఆ సందర్భంగా అప్పటి ప్రభుత్వం కేసులే కాకుండా ప్రచారంలో ఆ సంఘటనను అస్త్రంగా మల్చుకున్నప్పుడు వెనుకడుగు వేయకుండా ప్రచార శైలిని మార్చుకొని పెద్దఎత్తున బహిరంగ సభలు నిర్వహించకుండా సోషల్ మీడియా మీద ఆధారపడకుండా, ప్రెస్‌మీట్స్ పెట్టకుండా ఎవరినీ అసభ్యకరంగా విమర్శించకుండా హుందాగా ప్రచారాలను విజయవంతంగా ముగించటం ఓటర్లను ఆకట్టుకుంది. నిజానికి 2009లోనే విజయ్ మక్కల్ ఇయ్యాకం (వి.యం.ఐ) ఒక ఆర్గనైజేషన్ స్థాపించారు. (వి.యం.ఐ) పేరిట 80వేలకుపైగా ఉన్న ఫాన్స్ అసోసియేషన్స్‌తో విజయ్ ఓటర్లలోకి చొచ్చుకొని వెళ్లగలిగాడు. 'స్టాలిన్ అంకుల్' అని హ్యూమర్‌తో డియంకే నాయకుడ్ని తిట్ల పురాణం లేకుండా ఏదైనా ఆ పిలుపుతో సద్విమర్శలకు పూనుకోవటం ఓటర్లకు ప్రచారం వీనులవిందుగా మారింది. అందరికీ కొత్తవారికే పార్టీ టికెట్లు ఇవ్వటం ధైర్యంతో కూడుకున్న పని. చివరకు తన డ్రైవర్ కొడుకును కూడా అభ్యర్థిగా ఎంచుకొని ప్రజల మనోభావాలకు ఆప్యాయతకు మరింత దగ్గరయ్యాడు. ఇవి మచ్చుకు కొన్ని కారణాలు మాత్రమే. అయినా ఇవి చాలవా ఓటర్ల హృదయాలలో స్థానం సంపాదించుకోవటమే కాకుండా పోలింగ్ బూతులకు క్యూలు కట్టడానికి ఆడవారికి ఉచితాలు కొన్ని సహేతుకంగా తోచే రీతిలో ఇస్తానని హామీ ఇవ్వటంతోపాటు విద్యార్థులకు 'మీ మామా మిమ్మల్ని అన్నివిధాలా ఆదుకుంటాడని, మీ పేరంట్స్‌కు చెప్పి నాకు ఓటు వేయమనండి అన్న కొత్త తరహా ప్రచార నిర్వహణ సాగించటం అందర్నీ ఆకట్టుకుంది. చివరకు చిన్నారులను కూడా మీ అమ్మా, నాన్నలకు చెప్పి నాకు ఓటు వేయించండి అని విజ్ఞప్తి చేయడం వారిని కూడా ఉత్సాహంగా విజయ్‌కు చెందిన ప్రచారంలో పాల్గొనేట్లు చేసింది. అన్నిటికంటే మించినది తను హద్దులు మీరకుండా ఇతరులు హద్దు మీరటాన్ని వెలికి తీయటం! వెకిలితనం ఎక్కడా విజయ్‌లో కనపడకపోవడంతో హెచ్చుసంఖ్యలో విజయఢంకా మ్రోగించారు. టి.వి.కె పార్టీ కొత్త రకంగా ఇతర పార్టీలకు భిన్నంగా రాజకీయాలు నడపగలదని ఎన్నికల్లో 108సీట్లతో 35శాతం ఓట్ల షేర్‌తో అందరికంటే మించిన విజయాన్ని తమిళనాడులో సాధించగలిగింది. చివరకు ఎక్కడా ఎవరికీ లొంగకుండా ఓపికతో గవర్నర్ దగ్గర మాటమీరకుండా, ఇతర పార్టీలను ఈ తతంగంలో విమర్శించకుండా పట్టువదలని విక్రమార్కుడు మాదిరి ప్రతిసారీ తనకున్న ఓట్ల బలాన్ని గవర్నర్ అడిగినా అడగకపోయినా వినయంగా ప్రదర్శించటం, అతని రాజనీతిజ్ఞతతోపాటు చతురత, కృత్రిమ ఓటమని ఒప్పుకోకుండా 'జయమ్ము నిశ్చమ్మురా' అన్న ధోరణిలో హీరోలా ప్రవర్తించారు. ప్రజలకు మరింత దగ్గరగా ఆ వైఖరి విజయ్‌ను చేర్చింది. ఇప్పుడు అసలు కథ విజయ్‌కు కానీ, ఇతర పార్టీలకు కానీ కేంద్రానికి కానీ మొదలవుతుంది. ఉత్కంఠ భరితంగా మొదలైన సన్నివేశాలు మరింత ఆసక్తికరంగా ఉంటాయా, విజయ్ వ్యవహారశైలి, ముఖ్యమంత్రిగా ఏ విధంగా ఉండబోతుంది అన్నది, ఈ హీరో విజయాపజయాలను తెరమీద కాదు లైవ్‌లో తమిళనాడే కాదు దేశమంతటా చూడడానికి ఉత్కంఠ భరితంగా ఎదురుచూస్తున్నది. హీరోగా మొదలుపెట్టినవాడు జీరోగా ఎందుకు మారుతాడు అన్న ఆశావాదంతో అతని అభిమానులు ఈలలతో చప్పట్లతో రాబోయే కథను చూడానికి సిద్ధంగా ఉన్నారు. సినిమా హీరోలు రాజకీయాల్లోకి ప్రవేశిస్తే ఆ కథే వేరు అన్నది ఎంజిఆర్, ఎన్‌టిఆర్, హీరోయిన్ జయలలిత నిరూపించగలిగారు. విజయాన్నే పేరులో ధరించిన విజయ్, అపజయాన్ని ఎదుర్కోడన్న నమ్మకంతో అతని ఫాన్స్‌తో బాటు తమిళనాడంతటా సుపరిపాలనతో ప్రజలను ఆకట్టుకోగలడని ఆశలు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. వారే కాదు దేశమంతటా అదే మాదిరి తమిళనాడును ముఖ్య రంగస్థలంగా భావిస్తూ ఏమవుతుందో అని ఎదురుచూపులు చూస్తున్నది. రాజకీయం, క్రికెట్ ఉత్కంఠ భరితంగానే ఉంటా యి. కానీ చివరి మలుపులో గెలుపుతో దోబూచులాట ఉంటుందని అందరికీ తెలుసు. ●

# రహదారి వ్యవస్థలో సాంకేతిక విప్లవం

తిప్పర్తి శ్రీనివాస్

భారతదేశంలో రహదారి మౌలిక వసతులు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో టోల్ వసూళ్ల విధానంలో కూడా సాంకేతిక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిణామంలో భాగంగా మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో టోల్ వ్యవస్థను ప్రవేశపెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం అడు గులు వేస్తోంది. ఇది సంప్రదాయ టోల్ ప్లాజాల యుగా నికి ముగింపు పలుకుతూ, వాహనాలు ఆగకుండా ప్రయా ణిస్తూ టోల్ చెల్లించే సరికొత్త విధానంగా భావించబడుతోంది. ఇప్పటి వరకు మనం చూసిన టోల్ ప్లాజాలలో వాహనాలు తప్పనిసరిగా ఆగాలి. ఫాస్టాగ్ వంటి డిజిటల్ చెల్లింపు విధానం వచ్చినప్పటికీ, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయాల్లో టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడటం సహజం. ఇది ఇంధన వ్యర్థాన్ని, సమ య నష్టాన్ని మాత్రమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని కూడా పెంచుతుంది. ఈ సమస్యలకు పరిష్కారంగా ఎం ఎల్ ఎఫ్ ఎఫ్ వ్యవస్థను తీసుకురావడం సముచితమైన చర్యగా కనిపిస్తుంది. ఎం ఎల్ ఎఫ్ ఎఫ్ విధానంలోటోల్ ప్లాజాలు ఉండవు. వాటి స్థానంలో హైవే పై గ్యాంట్రీలు (గేట్లు వంటి నిర్మాణాలు) ఏర్పాటు చేస్తారు. ఈ గ్యాంట్రీ లపై ఉన్న సెన్సర్లు, కెమెరాలు వాహన నంబర్ ప్లేట్లను చదివి, సంబంధిత బ్యాంక్ ఖాతా లేదా డిజిటల్ వాలెట్ నుండి టోల్ మొత్తాన్ని ఆటోమేటిక్‌గా డెబిట్ చేస్తాయి. అంటే వాహనం ఎక్కడా ఆగాల్సిన అవసరం లేకుండా నిరంతరంగా ప్రయాణం కొనసాగుతుంది. ఈ విధానం వల్ల ప్రయాణికులకు అనేక ప్రయోజనాలున్నాయి. మొదటగా, సమయం ఆదాఅవుతుంది. ముఖ్యంగా దీర్ఘదూరప్రయాణాల్లో టోల్‌ప్లాజాల వద్ద వృథా అయ్యే సమయం గణనీయంగా తగ్గుతుంది. రెండవది, ఇంధన వినియోగం తగ్గుతుంది. వాహనాలు ఆగి మళ్లీ స్టార్ట్ అయ్యే అవసరం లేక పోవడం తో ఇంధన పొదుపు సాధ్యమవు తుంది. మూడవది కాలుష్యం



తగ్గుతుంది. ట్రాఫిక్ నిలిచిపోవడం తగ్గడం వల్ల కార్బన్ ఉద్గారాలు కూడా తగ్గుతాయి. అయితే, ఈ కొత్త వ్యవస్థపై కొన్ని ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గోప్యత అంశం ప్రధానంగా చర్చకు వస్తోంది. వాహనాల కదలికలను నిరంతరం ట్రాక్ చేసే అవకాశం ఉండటంతో, వ్యక్తిగత డేటా భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈడేటా ఎక్కడ నిల్వఅవు తుంది? దాన్ని ఎవరు ఉపయోగిస్తారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలుఅవసరం. ఇంకా ఒక సమస్య - సాంకేతిక లోపాలు. కెమెరాలు తప్పుగా నంబర్ ప్లేట్లుచది వితే? లేదా ఖాతాలో సరిపడా డబ్బు లేకపోతే? ఇలాంటి సందర్భాల్లో వాహనదారులు అన్యాయంగా జరిమానాలు చెల్లించాల్సి రావచ్చు. అందుకే ఈ వ్యవస్థను అమలుచేసే ముందు పటిష్టమైన సాంకేతిక మౌలిక వసతులు, పారద ర్శకమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో లేదా సాంకేతిక అవగాహన తక్కువగా ఉన్న వాహనదారుల విషయంలో కూడా సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందరికీ డిజిటల్ చెల్లింపు వ్యవస్థలు అందు బాటులో ఉండకపోవచ్చు. ఈనేపథ్యంలో ప్రభుత్వం అవ గాహన కార్యక్రమాలు చేపట్టి, అవసరమైన సహాయాన్ని అందించాలి. మరోవైపు, ఈ వ్యవస్థద్వారా ప్రభుత్వానికి ఆదాయం పారదర్శకంగా, సమర్థవంతంగా వసూలు కావ చ్చు. టోల్ ఎగవేత తగ్గే అవకాశం ఉంది. దీంతో రహ దారి అభివృద్ధికి మరింత నిధులు సమకూరుతాయి. సారాంశంగా చెప్పాలంటే, మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో టోల్ వ్యవస్థ రహదారి ప్రయాణం లో ఒక సాంకేతిక విప్లవం. ఇది సమయం, ఇంధనం, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించగలదు. అయితే, దీనిని అమలు చేసేక్రమంలో గోప్యత, సాంకేతిక లోపాలు, ప్రజల అవగాహన వంటి అంశాలను సమగ్రంగాపరిష్కరించాల్సిన అవసరం ఉంది. సరైన ప్రణాళిక, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం ఉంటే, ఈకొత్త విధానం భారతదేశ రహదారి వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చగలదు. ●

# బెంగాల్ మార్పు దేశానికి దిక్సూచి!

సొప్పరి నరేందర్

భారతదేశ చరిత్రలో బెంగాల్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. బెంగాల్ రాజకీయాలకు దేశ రాజకీయ గతిని మార్చేశక్తిగా ఉంటుంది. మమత బెనర్జీ తృణమూల్‌కాంగ్రెస్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ బిజెపి బలంగా పుంజుకోవడం రాష్ట్రంలో అధికారం కోసం జరుగుతున్న హోరాహోరీ పోరు దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ప్రాంతీయ ఆకాంక్షలను ప్రభావితం చేయనుంది. అక్రమ వలసలు జాతీయ పౌరసత్వ అంశాలు బెంగాల్‌లో ప్రధాన ఎన్నికల అంశాలుగా మారాయి. బెంగాల్ ఫలితాలు కేంద్రం తీసుకునే కఠినమైన సరిహద్దు భద్రతా నిర్ణయాలకు పౌరసత్వ బిల్లుల అమలుకు బలమైన సంకేతాన్ని ఇస్తాయి. రాజకీయ విశ్లేషణల ప్రకారం మైనారిటీ ఓట్ల ఏకీకరణ హిందూ ఓట్ల ధ్రువీకరణ బెంగాల్‌లో కొత్త రకమైన రాజకీయ సమీకరణాలకు దారితీస్తున్నాయి. స్వాతంత్ర్య పోరాటం నుంచి సాహిత్యం, సంస్కృతి, రాజకీయాలు, విద్య, ఆర్థిక రంగాల వరకు ప్రతి విభాగంలో బెంగాల్ దేశానికి మార్గదర్శకంగా నిలిచింది. నేడు బెంగాల్ ఆలోచించేదే రేపు భారత్ ఆలోచిస్తుంది అనే నానుడి యాదృచ్ఛికంగా రాలేదు. కాలానుగుణంగా మార్పులను స్వీకరించి దేశానికి దిక్సూచిగా నిలవడం బెంగాల్ ప్రత్యేకత. నేటి పరిస్థితుల్లో కూడా బెంగాల్‌లో జరుగుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయి. బెంగాల్ మార్పు గురించి మాట్లాడితే ముందుగా విద్యా, సాంస్కృతిక రంగాలను ప్రస్తావించాలి. రాజారామమోహన్ రాయ్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయులు సామాజిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. బాల్యవివాహాల నిర్మూలన, మహిళా విద్య, ఆధునిక విద్యా వ్యవస్థ వంటి అంశాల్లో బెంగాల్ ముందడుగు వేసింది. ఆ మార్పులు క్రమంగా దేశమంతటా వ్యాపించాయి. నేటికీ విద్య, సాహిత్యం, కళల విషయంలో బెంగాల్ ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తోంది. రాజకీయ పరంగా కూడా బెంగాల్ ఎప్పుడూ దేశ దృష్టిని ఆకర్షించింది. స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ వంటి నేతలు జాతీయ భావజాలాన్ని బలపరిచారు. అనంతరం వామపక్ష రాజకీయాల కేంద్రంగాబెంగాల్ నిలిచి భూసంస్కరణలు, గ్రామీణ అభివృద్ధి వంటి అంశాల్లో దేశానికి కొత్త నమూనాలను చూపించింది. తరువాత రాజకీయ మార్పులతో ప్రాంతీయ పార్టీల ఎదుగుదల చోటుచేసు



కుంది. ఇది భారతదేశంలో ప్రాంతీయ రాజకీయాల ప్రాధాన్యాన్ని మరింత స్పష్టంగా చేసింది. ఆర్థిక రంగంలో కూడా బెంగాల్ మార్పు గమనించదగ్గది. ఒకప్పుడు జూట్ పరిశ్రమలు, నౌకాశ్రయాలు, వ్యాపార కేంద్రాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన అండగా ఉన్న బెంగాల్, కొన్ని దశాబ్దాల్లో పరిశ్రమల క్షీణతను ఎదుర్కొంది. అయితే ఇటీవల ఐటీ, సేవా రంగం, స్టార్టప్‌ల అభివృద్ధి ద్వారా కొత్త అవకాశాల వైపు అడుగులు వేస్తోంది. కోల్‌కత్తా వంటి నగరాలు మళ్లీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మార్పు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఒక పాఠంలా నిలుస్తోంది. కాలానికి అనుగుణంగా మారితేనే అభివృద్ధి సాధ్యమని సూచిస్తోంది. సామాజిక రంగంలో బెంగాల్ ఎప్పుడూ చైతన్యానికి కేంద్రబిందువుగా నిలిచింది. సాహిత్యం, సినిమా, నాటకరంగం ద్వారా ప్రజల్లో సామాజిక అవగాహన పెంచడం బెంగాల్ ప్రత్యేకత. సత్యజిత్ రే సినిమాలు, బెంగాలీ సాహిత్యం దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయి. మేధావుల చర్చలు, ప్రజాస్వామ్య భావజాలం, రాజకీయ చైతన్యం అక్కడి సమాజాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి. ప్రజలలో ప్రశ్నించే ధోరణి ఎక్కువగా ఉండటం కూడా బెంగాల్ ప్రత్యేకతగా చెప్పవచ్చు. అయితే బెంగాల్ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా విస్మరించలేం. నిరుద్యోగం, రాజకీయ హింస, వలసలు, పరిశ్రమల కొరత వంటి సమస్యలు రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకులుగా మారుతున్నాయి. అయినప్పటికీ బెంగాల్ ప్రజలలో ఉన్న సృజనాత్మకత, చైతన్యం, మార్పును స్వీకరించే స్వభావం ఈ సమస్యలను అధిగమించే శక్తిని ఇస్తోంది. అందుకే బెంగాల్ మార్పు దేశానికి దిక్సూచిగా భావించబడుతోంది. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో కూడా బెంగాల్ కీలక పాత్ర పోషిస్తోంది. జాతీయ పార్టీలకు బెంగాల్ ఒక రాజకీయ పరీక్షా స్థలంగా మారింది. అక్కడి ఎన్నికల ఫలితాలు దేశరాజకీయ ధోరణులపై ప్రభావం చూపుతున్నాయి. సామాజిక సమీకరణాలు, మైనారిటీ రాజకీయాలు, సంక్షేమ పథకాల ప్రభావం వంటి అంశాల్లో బెంగాల్ ఒక ప్రయోగశాలగా కనిపిస్తోంది. ఈ మార్పులను గమనిస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయి. మొత్తానికి బెంగాల్ భారతదేశ ఆలోచనా విధానానికి ప్రతిబింబం. విద్యలో, సంస్కృతిలో, రాజకీయాల్లో, సామాజిక చైతన్యంలో జరిగిన ప్రతి మార్పు దేశవ్యాప్తంగా ప్రభావం చూపింది. నేటి మారుతున్న భారతదేశంలో బెంగాల్ మరోసారి కొత్త దిశను చూపించే స్థితిలో ఉంది. అభివృద్ధి, ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం కలగలిపిన మార్గాన్ని చూపగలిగితే బెంగాల్ నిజంగా దేశానికి దిక్సూచిగా నిలుస్తుంది. 2026 మే నెలలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయం సాధించి రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది. బిజెపి బెంగాల్ లో తొలి సర్కార్‌తో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తీసుకొచ్చింది. ●

# గుంటూరు వార్త

## గ్రీవెన్స్‌లో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన మంత్రి నాదెండ్ల

**తెనాలి మున్సిపాలిటీ, మే11,(ప్రభాతవార్త):** ప్రతి సోమవారం పురపాలకసంఘ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజీఆర్ఎస్)గ్రీవెన్స్ కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ శాసన సభ్యులు,రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించి, సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ,"ప్రజల వద్దకే పాలన.. సమస్యలకు వెంటనే పరిష్కారం" అనే సంకల్పంతో ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తూ,మాటలు చెప్పడం కాదు..ప్రజా సమస్యలకు స్పందించి పరిష్కారం చూపించడం మా ప్రభుత్వ నైజమని తెలిపారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మంత్రి నాదెండ్లను కలిసి తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియపరిచారు. ప్రధానంగా అంతర్గత రోడ్లు నిర్మించాలని, నూతన పింఛన్లు మంజూరు కోసం అదే విధంగా కొత్త రేషన్ కార్డులు మంజూరు లాంటి వివిధ సమస్యలపై ప్రజలు తమ అర్జీలను అందించారు. అదేవిధంగా పట్టణంలో వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభించాలని పట్టణ అభివృద్ధి సంఘం ప్రతినిధులు మంత్రి నాదెండ్లకు వివరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరిస్తూ మంత్రి నాదెండ్ల మనోహర్ వారి సమస్యలను సావధానంగా ఆలకిస్తూ తగు పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెనాలి మండల తహసీల్దార్ కెవి.గోపాలకృష్ణ,మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు,మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మొవ్వ ఏసుబాబు, వివిధ విభాగాల అధికారులు, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.




## పి.జి.ఆర్.ఎస్‌కు 524 అర్జీలు

**గుంటూరు,మే11, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 524 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 233, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 182 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 8 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 21 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 49, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 31 అర్జీలు అందాయి. సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు.



అర్జీలు పరిష్కారంలో ఎటువంటి అలసత్వం ఉండరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించారు.అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఆర్జీలను సమర్పించారు.

## చెరువులో మునిగి ఇరువురు మృతి



నరసరావుపేట క్రైమ్, మే 11 ప్రభాతవార్త :: మండలంలోని కాకాని చేపల చెరువులో ప్రమాదవశాత్తు పడి ఇరువురు కనుమూశారు. ఈ సంఘటన చేపల చెరువులో పడవ మునిగి పోవడం వలనసంభవించింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేపలకు ఆహారం వేసేందుకు తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో పడవలో ముగ్గురు కూలీలు వెళ్లారు.వారు చెరువులో కి చేపల మేతతో వెళ్లిన సమయంలో పడవ బోల్తా పడింది. దీంతో వారు నీళ్లలో పడిపోయారు. వారిలో ఒక కూలి మాత్రమేఈదుకుంటూ ఒడ్డుకు చేరారు.కాగా మరో ఇద్దరి కోసం గజ ఈతగాళ్ళు చెరువులో స్థానికులు గాలించారు. కాగా గల్లంతైన వారు పిట్టంబండ్ల హస్సాన్ బుడే(53), అగ్రహారం హుస్సేనా (32) గుర్తించారు. ఇరువురిలో హస్సాన్ బుడే మృతదేహం లభ్యమయింది.మరొకరి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

# నీట్ 2026 పేపర్ లీక్ !?

- పరీక్షకు ముందు కేరళ నుండి రాజస్థాన్ విద్యార్థులకు గెస్ పేపర్
- గెస్ పేపర్ లోని సుమారు 140 ప్రశ్నలు యథాతథంగా నీట్ పరీక్షలో
- విచారణ చేపట్టిన రాజస్థాన్ ప్రత్యేక దర్యాప్తు బృందం
- పేపర్ లీక్ ఆరోపణలను కొట్టిపారేసిన ఎన్‌టిఏ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు,తల్లిదండ్రులు
- తెలుగు రాష్ట్రాల నుండి 1.50 లక్షల మంది విద్యార్థులు నీట్ కు హాజరు.

**గుంటూరు మే 11, ప్రభాతవార్త ప్రతినిధి :**

అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థుల ఎంపిక కోసం నిర్వహించే నీట్ పరీక్ష పై మరోసారి నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద పరీక్షగా చెప్పబడుతున్న నీట్ నిర్వహణలో ఎన్‌టిఏ సామర్థం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నీట్ 2026 పరీక్ష ప్రశ్నావళిలోని కొన్ని ప్రశ్నలు గెస్ పేపర్ రూపంలో ముందుగానే లీక్ అయ్యాయనే వార్తలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం అయ్యాయి. 2024లో జరిగిన నీట్ పరీక్ష గందరగోళం తర్వాత కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశాయి.అయినా ఇలా ప్రతి సంవత్సరం లీక్ వార్తలు రావడం పరీక్షల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈసారి కూడా కొన్ని కోచింగ్ , పిజి సెంటర్లలో వుండే విద్యార్థులకు కొంతమంది బ్రోకర్ల ద్వారా భారీ మొత్తాలకు ప్రశ్నాపత్రాల్లోని ప్రశ్నలను గెస్ పేపర్ రూపంలో లీక్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వెలుగులోకి వచ్చింది ఇలా..**

రాజస్థాన్‌లోని సికార్ ప్రాంతంలో నీట్ పరీక్షకు ముందు కొన్ని పీజీ సెంటర్లలోని విద్యార్థులకు పిడీఎఫ్ రూపంలో సుమారు 80 పేజీల ఒక గెస్ పేపర్ వివిధ సోషల్ మీడియా గ్రూపుల ద్వారా చేరింది.ఈ గెస్ పేపర్ కొంతమంది లైట్ తీసుకోగా మరికొందరు సీరియస్‌గా ప్రిపేర్ అయ్యారు. అయితే మే 3 వ తేదీన పరీక్ష పూర్తయిన తర్వాత విద్యార్థులు ప్రశ్నపత్రం సరి చూసుకోగా గెస్ పేపర్ లో పేర్కొన్న సుమారు 140 ప్రశ్నలు మక్కీకి మక్కీ నీట్ ప్రశ్నపత్రంలో వచ్చినట్లు గుర్తించారు.ఈ విషయాన్ని విద్యార్థులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గెస్ పేపర్ విషయం వెలుగులోకి వచ్చింది.ఈ గెస్ పేపర్ పై దర్యాప్తు చేపట్టిన రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ ప్రాథమిక విచారణలో సుమారు 140 ప్రశ్నలు అసలు పేపర్‌తో ఖచ్చితంగా సరిపోలాయని గుర్తించింది. ఈ గెస్ పేపర్ కేరళలోని ఒక మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థికి చెందినదని , అతను మే 1న తన స్నేహితుడికి ఇవ్వగా అది వాట్సాప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా కోచింగ్ , పీజీ సెంటర్లలోని విద్యార్థులకు చేరిందని తేలింది. గెస్ పేపర్ ను ఒక్కో అభ్యర్థికి భారీ మొత్తాలకు విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు సుమారు 13 మంది అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేసి లోతుగా విచారిస్తున్నారు.




**లీకు వార్తల పై ఎన్‌టిఏ స్పందన..**

రాజస్థాన్. లో గెస్ పేపర్ రూపంలో నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం పై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ) స్పందించింది. దీనిపై ఆదివారం ఓ మీడియా ప్రకటన విడుదల చేసింది. ప్రశ్నపత్రం లీక్ అయిందన్న వార్తలను కొట్టిపారేసింది.2026 మే 3న పరీక్ష పూర్తి భద్రతా ప్రోటోకాల్‌లతో నిర్వహించామని పేర్కొంది. ప్రశ్నాపత్రాలు జిపిఎస్ ట్రాకింగ్ వాహనాల ద్వారా, ప్రత్యేక వాటర్‌మార్క్ గుర్తులతో రవాణా చేయబడ్డాయని తెలిపింది. పరీక్షా కేంద్రాల్లో ఏ ఐ ఆధారిత నిఘా వుంటుందని స్పష్టం చేసింది. అయితే మే 7 రాత్రి పరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత పరీక్షకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందిందని తెలిపింది. మీడియాలో వస్తున్న వార్తలు, కొందరిని అదుపులోకి తీసుకోవడాలు తదితర చర్యల్లో పాల్గొంటున్న సంస్థలకు కృతజ్ఞతలు తెలిపింది. విచారణకు కావలసిన సహకారాన్ని ఎన్ టి ఏ అందిస్తోందని స్పష్టం చేసింది. నిజాయితీగా పరీక్ష రాసిన విద్యార్థుల కృషి , నిబద్ధతపై ఎలాంటి సందేహం లేదని పేర్కొంది. ఈ తరహా వార్తలు కలిగించే ఆందోళనను తమకు తెలుసని, దర్యాప్తు సంస్థలు తమ పని పూర్తి చేయడానికి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించింది.

**తెలుగు రాష్ట్రాల నుండి 1.50 లక్షలకు పైగా విద్యార్థుల్లో ఆందోళన**

డాక్టరు అవ్వాలనే కల నెరవేర్చుకునేందుకు దేశవ్యాప్తంగా సుమారు 22.05 లక్షల మంది విద్యార్థులు నీట్ 2026 పరీక్షకు హాజరయ్యారు ఆంధ్రప్రదేశ్ నుండి 58 వేలకు పైగా విద్యార్థులు, పొరుగు రాష్ట్రమైన తెలంగాణ నుండి సుమారు 91వేలకు పైగా అభ్యర్థులు పరీక్ష రాశారు.అయితే ఈ లీక్ వ్యవహారంతో విద్యార్థులు , తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు స్పందిస్తూ నీట్ పరీక్ష పై వస్తున్న ఆరోపణలు లక్షలాది విద్యార్థులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. 2024లో జరిగిన అక్రమాల తర్వాత కూడా 2026లో మళ్లీ ఇలాంటి వివాదం రావడం ఎన్‌టీఏ భద్రతా వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపుతోందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారం పై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో లేదా సీబీఐ నేతృత్వంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని, ఎన్ టి ఏ భద్రతా ఏర్పాట్లు, ప్రశ్నాపత్రం సిద్ధం చేసే ప్రక్రియ, కోచింగ్ సెంటర్ల పాత్రను పూర్తిగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.

# పల్నాడులో అర్ధరాత్రి అలజడి

### అర్ధరాత్రి 2 గం.లకు బాల్య వివాహం పై పల్నాడు ఇంచార్జి కలెక్టర్‌కు సమాచారం
### బాల్య వివాహాన్ని అడ్డుకున్న పల్నాడు ఇంచార్జి కలెక్టర్
### పల్నాడు ఇంచార్జి కలెక్టర్ సంజన సింహా స్పందనకు ప్రజల ప్రశంసలు

**గుంటూరు మే 11, ప్రభాతవార్త ప్రతినిధి :** పల్నాడు జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని రామచంద్రాపురం తండాలో ఒక బాల్య వివాహాన్ని ఇంచార్జ్ కలెక్టర్ సంజన సింహ్ చాకచక్యంగా అడ్డుకున్నారు. సమాచారం అందిన వెంటనే స్పందించి, అధికారులను అప్రమత్తం చేయడంతో ఓ చిన్నారిని కాపాడటంలో విజయవంతం అయ్యారు.రామచంద్రాపురం తండాలో ఒక మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్లు అర్ధరాతి 2 గంటలకు సమాచారం అందుకున్న ఇంచార్జ్ కలెక్టర్, వెంటనే సంబంధిత అధికారులను క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వెల్దుర్తి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, ఎస్.ఐ, ఐ.సి.డి.ఎస్ మరియు చైల్డ్‌లైన్ ప్రతినిధులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారులు బాలిక వయస్సు ధృవీకరణ పత్రాలను పరిశీలించగా, వివాహానికి చట్టబద్ధమైన వయస్సు నిండలేదని నిర్ధారణ అయ్యింది. దీంతో అధికారులు వెంటనే వివాహాన్ని నిలిపివేసి, బాలికను సంరక్షణలోకి తీసుకున్నారు.పిల్లల బంగారు భవిష్యత్తును నాశనం చేసే బాల్య వివాహాలను జరపవద్దని ఇంచార్జ్ కలెక్టర్ సంజనా సింహ్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం వివాహానికి బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండడం తప్పనిసరి అన్నారు. నిబంధనలు అతిక్రమించి బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులు, ఇందుకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



## మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష

**గుంటూరు లీగల్, మే 11 (ప్రభాతవార్త):** ఆరో తరగతి చదువుతున్న 12 ఏళ్ల మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, క్రోసూరు మండలం, పెరికపాడు గ్రామానికి చెందిన నందిపాటి మరియమ్మ కూలి పనికి వెళుతుంది. 2022 మే, రెండో తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో, అదే గ్రామానికి చెందిన వారి సమీప బంధువు మందా నాగరాజు అనే వ్యక్తి మద్యం సేవించి, వీరి ఇంటికి వచ్చాడు. మరియమ్మ భర్తను మద్యం సేవించేందుకు పిలవగా, నిరాకరించడంతో నాగరాజు వెళ్లిపోయాడు. అదేరోజు అర్ధరాత్రి దాటాక మద్యం సేవించిన నాగరాజు, వారి చిన్న కుమార్తె నిద్రిస్తున్న మంచం పైకి చేరి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు లేవగా నాగరాజు పరారయ్యాడు. క్రోసూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును నరసరావుపేట దిశ మహిళా పోలీసులు దర్యాప్తు చేశారు. దిశ స్టేషన్ మహిళా ఎస్సై బి.అనంతకృష్ణ నిందితుడు నాగరాజును అరెస్ట్ చేసి చార్జిషీటు దాఖలు చేశారు. పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీగల దుర్గాప్రసాద్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుల్తానా బేగం తీర్పు చెప్పారు.

# నూరేళ్ల ఆలోచనతో అమరావతికి వరద నియంత్రణ

### రాజధానిలో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన

**అమరావతి,మే11,ప్రభాతవార్త :** రాజధాని అమరావతికి నూరేళ్ళ ముందు ఆలోచనతో వరద నియంత్రణకు బృహత్తర ప్రణాళిక రచించామని, దాని ఆధారంగా వరద నియంత్రణ అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రపంచ బ్యాంకు ప్రతనిధులకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి డి.లక్ష్మీపార్థసారథి వారు వివరించారు. ప్రపంచ బ్యాంకు నుంచి వైస్ ప్రెసిడెంట్ మరియు ఛీఫ్ రెస్యూ ఆఫీసర్



డెన్నిస్ మెక్‌లాగిల్న్‌తో కలిసి తొమ్మిది మంది ప్రతనిధులు సోమవారం రాజధాని అమరావతి పర్యటించారు. ముందుగా రాయపూడిలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఈ:3 ఎన్:16 జంక్షన్ వద్ద గ్రావిటీ కెనాల్ అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీసీ సీఎండీ వారికి అమరావతి వరద నియంత్రణ దానిపై టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో వివరించారు. వంద సంవత్సరాల ముందు చూపుతో వాగులు, రిజర్వాయర్లను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. రాజధానిలో ప్రభుత్వం చేపుతున్న ఫ్లడ్ మిటిగేషన్‌లో భాగంగా ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమరావతిలో 35 ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రోడ్లతో గొప్ప రవాణా వ్యవస్థ టూరిజానికి ఊతమిస్తుందన్నారు. 7.8 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్న గ్రావిటీ కెనాల్‌లో బోటింగ్, 5 వేల స్క్వేర్ మీటర్లతో ప్లాట్లు చేసి ఇంటర్నేషనల్ థీమ్స్‌గా అభివృద్ధి చేసేందుకు పేరొందిన ఆర్కిటెక్టలను నియమించామన్నారు. కొండవీటి వాగు 24.4 కి.మి.లు, పాలవాగు 17.24 కి.మి.ల మేర పరీవాహక ప్రాంతాన్ని సుందరమైన అవెన్యూ ప్లాంటేషన్‌తో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పెన మాక రిజర్వాయర్ 0.1 టీఎంసీ, శాఖమూరు 50 ఎకరాలలో 0.03 టీఎంసీ, నీరుకొండ రిజర్వాయర్ 0.4టీఎంసీల సామర్థంతో వరద నియంత్రణకు అభివృద్ధి చేస్తున్నామని



ఈ సమాహారంతో అతి పెద్ద పర్యాటక కేంద్రంగా అమరావతి నగరం రూపుదిద్దుకోనుందని సీఎండీ వారికి వివరించారు. మధ్యాహ్నం ఈఎస్ఎంయూ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ పర్యటనకు ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ శ్రీ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ నేతృత్వం వహించారు. ప్రపంచ బ్యాంకు నుంచి ఇండియా యాక్టింగ్ కంట్రీ డైరెక్టర్ పాల్ ప్రోసీ, ప్రిన్సిపల్ సోషల్ డెవలప్‌మెంట్ నిపుణులు అభిషేక్ సింగ్, సీఆర్వో ప్రత్యేక సహాయకులు పాట్రిక్ ఫెట్యూ, సౌత్ ఏషియా ఎన్విరాన్‌మెంట్ అండ్ సోషల్ రిస్క్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీస్ మేనేజర్ క్రిస్టియన్ పీటర్, అర్బన్ స్పెషలిస్ట్ లీడ్ బాలకృష్ణ మీనన్, లీడ్ ట్రాన్స్‌పోర్టు స్పెషలిస్ట్ జెరాల్డ్ ఒల్లివియర్, ది వరల్డ్ బ్యాంకు సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్ట్ జోసెఫ్ ఎసె అక్వోకోడ్జే, ది వరల్డ్ బ్యాంకు సీనియర్ సోషల్ డెవెలప్‌మెట్ స్పెషలిస్టు బాయన వెంకట్రావులు ఉన్నారు.

# 22 ఏ కేసులు పక్కాగా విచారణ చేయాలి

### గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

**గుంటూరు, మే 11, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలో 22 ఏ కేసులు పక్కాగా విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం రెవెన్యూ, రీ సర్వే, జి రామ్ జి అంశాలపై జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 22 ఏ భూముల విచారణలో తహసిల్దార్ విధిగా వ్యక్తిగతంగా తనిఖీ చేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు విధిగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. క్లాసిఫికేషన్ ఖచ్చితంగా ఉంటే జాబితా నుండి తొలగించాలని ఆదేశించారు. అభ్యంతరకర పోరంబోకుగా ఉన్న జల వనరుల ప్రదేశం, చెరువులను స్పష్టంగా విచారణ చేపట్టి, నిర్ణయాన్ని స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. జిల్లాలో 22 ఏ క్రింద ఉన్న వాటిని శుక్రవారం నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. రిసర్వేను నాణ్యంగా చేయాలని ఆదేశించారు. రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు.

**ఉపాధి హామీ పనుల వేతనదారుల సంఖ్య పెరగాలి**

జిల్లాలో ఉపాధిహామీ వేతనదారుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని ఆదేశించారు. మేడికొండూరు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, ఫిరంగిపురం మండలాల్లో పరిస్థితీ బాగా మెరుగుపరచాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. ప్రజలు వివిధ అవసరాలకు దరఖాస్తు చేసుకున్న సేవలను త్వరగా అందించాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలోనే సేవలు అందాలని అన్నారు. రెవిన్యూ క్లినిక్ లకు తహసిల్దార్ లు హాజరు కావాలని, అదే సమయంలో మండలాల్లో ఉప తహసిల్దార్ లు పి.జి.ఆర్.ఎస్ విధిగా నిర్వహించాలని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సైతం పి.జి.ఆర్.ఎస్ విధిగా నిర్వహించాలని ఆదేశించారు.

**జన గణన ప్రాధాన్యతతో చేపట్టాలి**

జిల్లాలో జన గణనను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్యుమరేటర్లు, పర్యవేక్షకులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు ఉదయం, సాయంత్రం ఇళ్ల వద్ద అందుబాటులో ఉంటారని గమనించాలని స్పష్టం చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఎన్యుమరేటర్లు ఉదయం, సాయంత్రం వేళల్లో గృహ సందర్శన చేయడం శ్రేయస్కరమని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగడం తగ్గించాలని అన్నారు.



**జలధార జల హారతి పనులు పూర్తి చేయాలి**

జలధార జల హారతి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంజూరు చేసిన పనులలో ఇంకా ప్రారంభం చేయడంలో జాప్యం జరుగుతుండటం పట్ల చేబ్రోలు, కాకుమాను, పొన్నూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ప్రశ్నించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పనులను పూర్తి చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని ఆదేశించారు. పనుల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని సూచించారు. పూర్తి సామర్థంలో చెరువులలో నీటి నిలువ చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో ఉండాలని, నియోజక వర్గాల ప్రత్యేక అధికారులు, వారంలో మూడు రోజులు గురువారం, శుక్రవారం, శనివారం విధిగా క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు.

## 284 స్కూల్ బస్సుల్లో భద్రతా తనిఖీలు



**గుంటూరు, మే 11 ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలో పాఠశాలలకు చెందిన 284 బస్సుల భద్రతా ప్రమాణాలు తనిఖీ చేయడం జరిగిందని ఉప రవాణా కమిషనర్ కే సీతారామిరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు తనిఖీ చేసిన బస్సులలో భద్రతా ప్రమాణాలు లేని 78 వాహనాలపై నోటీసులు జారీచేయడం జరిగిందని చెప్పారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమములో భాగంగా గుంటూరు జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల బస్సుల భద్రతా ప్రమాణాలును మోటారు వాహన తనిఖీ అధికారులు తనిఖీ చేస్తున్నారని తెలిపారు. పాఠశాల బస్సులు రహదారిపై ప్రయాణించడానికి ఎంత వరకు అనుకూలంగా ఉన్నాయో పరిశీలించి, తనిఖీలో గుర్తించిన లోపాలను సరిదిద్ది బస్సులను సిద్ధం చేసుకోవాలని పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలకు సూచించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. పాఠశాలలు, కళాశాలల బస్సులకు మోటార్ వాహన తనిఖీ అధికారి సూచించిన భద్రతా ప్రమాణాలును పాటించి ఆటోమేటెడ్ ఫిట్నెస్ సెంటర్ల వద్ద ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందాలని స్పష్టం చేశారు.

## ఉద్యోగం పేరిట టోకరా

**గుంటూరు క్రైమ్,మే11,ప్రభాతవార్త:** ఉద్యోగం ఇప్పిస్తానని విద్యార్థి నుండి నగదు తీసుకుని మోసగించిన వ్యక్తి పై ఆరెండల్ పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా గురజాల మండలం, చర్లగూడిపాడు గ్రామానికి చెందిన బండి రామకృష్ణ కుమారుడు విజయ్ డిప్లొమా పూర్తి చేశాడు.పై చదువులు చదివేందుకు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకుందామని గుంటూరు చేరుకున్నాడు.బ్రిడ్జి ఓవర్సీస్ కన్సల్టెన్సీ కు చెందిన శ్యామ్ బాబు,శ్రీనివాసరావు అనే వ్యక్తులు విజయ్ కి మంచి ఉద్యోగం ఇప్పిస్తానని,పై చదువుల నిమిత్తం విదేశాలకు కూడా పంపుతామని నమ్మబలికారు.విద్యార్థి తండ్రి వద్ద నుండి రూ7,70,000 నగదు తీసుకున్నారు.ఉద్యోగం ఇప్పించకుండా కాలయాపన చేయటంతో బాధితుడు వారిని గట్టిగా ప్రశ్నించి ఆరెండల్ పేట పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు అవగాహనలో మనమూ పాడుదాం రండి

**గుంటూరు కల్చరల్,మే 11,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 20సంవత్సరాల నుండి ప్రతినెలా క్రమం తప్పకుండా ఔత్సాహిక గాయనీ గాయకుల కోసం నిర్వహిస్తున్న మనమూపాడుదాం రండి కార్యక్రమం మే 12వ తేది మంగళవారం సాయంత్రం 6గంటలకు సంస్థ కార్యాలయంలో జరుగుతుందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.ఔత్సాహిక గాయనీ గాయకులు అనుభవంతో సంబంధం లేకుండా ఎవరైనా వచ్చి పాటలు పాడవచ్చని సంస్థ ఆహ్వానిస్తుంది



MN 8 PAGE-BPTfff:MN 8 PAGE-BPTfff 01/01/2001 08:25 Page 1



# బాపట్ల జిల్లా వార్త



## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ : భార్గవ్



**కొల్లిపర,మే 11 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవ్ అన్నారు.మండల కేంద్రం కొల్లిపర మండల రెవిన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి అర్జీను సంభందిత అధికారులకు పంపించి పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో పరిపాలనాధికారి కిషోర్‌కుమార్,డిప్యూటి ఎంపీడీవో దానయ్య,హౌసింగ్ ఏఈ పద్మావతి,ఆర్ఐ వంశీకృష్ణ,ఏపిఓ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంగీత ప్రదర్శనలో తెనాలి చిన్నాకు గిన్నిస్ వరల్డ్ రికార్డు



**రేపల్లె, మే 11, ప్రభాతవార్త:** రేపల్లె పట్టణానికి చెందిన రిటైర్డ్ వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ తెనాలి చిన్నాకు ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లభించింది.హైద్రాబాద్‌లో హాల్లెల్ మ్యూజిక్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ది లార్జెస్ట్ ఎలక్ట్రానిక్ కీబోర్డు ఎన్‌సెంబుల్ కార్యక్రమంలో 22 దేశాల నుండి హాజరైన 2 వేల మంది కీబోర్డ్ కళాకారులతో కలిసి సంగీత ప్రదర్శనలో చిన్నా పాల్గొన్నారు.777 మంది ప్రతిభావంతులలో తెనాలి చిన్నా ఒకరుగా నిలిచారు.హాల్లెల్ మ్యూజికల్ విద్యాసంస్థ వ్యవస్థాపకుడు అగస్టీన్ చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు ధృవపత్రాన్ని చిన్నా అందుకున్నారు.ఈ సందర్భంగా చిన్నాను పట్టణానికి చెందిన ప్రముఖులు,స్నేహితులు అభినందించారు.

# ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

### ఈనెల 21 నుంచి జూన్ 2 వరకు పరీక్షలు



బాపట్ల,మే11. ప్రభాతవార్త ప్రతినిధి:జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ మరియు బెటర్మెంట్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు.ఈనెల 21వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు.ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,132 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 3,984 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారన్నారు.ఉదయం పూట 23 కేంద్రాలలో, మధ్యాహ్నం 18 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు.

అధికారులకు కీలక ఆదేశాలు:పరీక్షల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ శాఖను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. "ఈనెల 14న ప్రశ్నపత్రాలు బాపట్లకు చేరుతాయనీ వాటిని పోలీస్ స్టేషన్లలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచాలన్నారు.మాల్ ప్రాక్టీస్ జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసామన్నారు.

ఎండల దృష్ట్యా ప్రత్యేక జాగ్రత్తలు:ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తాగునీటి సదుపాయం కల్పించాలని, ప్రాథమిక చికిత్స కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలు జరిగే సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) జి.గంగాధర్ గౌడ్, ఇంటర్మీడియట్ బోర్డ్ జిల్లా అధికారి జుబేర్, ఇతర కమిటీ సభ్యులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలి

### కలెక్టర్ వినోద్ కుమార్



**బాపట్ల,మే11.,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను అధికారులు పూర్తి బాధ్యతతో, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 138 అర్జీలు నమోదు కాగా, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను పురమాయించారు.అర్జీల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి వేగంగా విచారణ జరపాలన్నారు.ఇకపై ప్రతిరోజూ, వారం, నెలవారీగా దశలవారీ సమీక్షలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు ప్రతి సోమవారం స్థానికంగా జరిగే పీజీఆర్ఎస్‌కు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.పెండింగ్‌పై ఆరా.. అధికారులపై ఆగ్రహంమండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలపై కలెక్టర్ ఆరా తీశారు. ముఖ్యంగా చెరుకుపల్లిలో 11 అర్జీలు పెండింగ్‌లో ఉండటం, దేవాదాయ శాఖలో 48, జలవనరుల శాఖలో 11 అర్జీలు నమోదు కావడంపై సమీక్షించారు. కర్లపాలెం మండలంలో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో ఎందుకు నిక్షిప్తం చేయలేదని తహసీల్దార్‌ను నిలదీశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 261 అర్జీలపై ఆడిట్ నిర్వహించాలని, అర్జీల పరిష్కారంపై నేరుగా ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడతామని వెల్లడించారు. అలాగే జనగణన ప్రక్రియ ప్రారంభించని ప్రాంతాల్లో వెంటనే పనులు మొదలుపెట్టాలని ఆదేశించారు.5,520 మందికి నైపుణ్య శిక్షణఅనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో 5,520 మంది యువతను స్కిల్ హబ్‌లలో నమోదు చేయించి, వారికి విరివిగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. త్రైమాసిక ప్రణాళిక ప్రకారం శిక్షణలు కొనసాగాలని, జాబ్ మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే అధికారుల లక్ష్యం కావాలన్నారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్ఓ జి.గంగాధర్ గౌడ్, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకే వాట్సాప్ పాలన.!

**ప్రతి సచివాలయంలో క్యూఆర్ కోడ్ స్కానర్లు**
**ఫ్యామిలీ సర్వేను వేగవంతం చేయాలి**
**వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశం**

**బాపట్ల,మే11.ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అధికారులను ఆదేశించారు.




సోమవారం కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్‌లో విద్యాశాఖ, గ్రామ/వార్డు సచివాలయ సేవలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి సచివాలయంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలకు సంబంధించి క్యూఆర్ కోడ్ స్కానర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు ఈ సేవలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు.డిజిటల్ సేవల వినియోగంలో బాపట్ల జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు.యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ప్రక్రియ బాపట్ల అర్బన్ పరిధిలో మందకొడిగా సాగడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే పురోగతి చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ సేవలు, ఎఫ్ఆర్ఎస్ హాజరు, ఈకేవైసీ నమోదు, డాక్యుమెంట్ అప్‌లోడ్ ప్రక్రియలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

పాఠశాల విద్యకు సంబంధించి లీప్ యాప్ నివేదికలు, ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరుపై కలెక్టర్ ఆరా తీశారు. ఖితల్లికి వందనంఖి, మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎటువంటి లోపాలు ఉండకూడదని ఆదేశించారు. అపార్ ఐడీల నమోదును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ సింగ్, జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు. హైబ్రిడ్ విధానంలో జరిగిన ఈ సమీక్షకు జిల్లావ్యాప్తంగా ఎంపీడీవోలు, ఎంఈవోలు హాజరయ్యారు.

# కన్నవారిని కాదంటే కఠిన చర్యలు

**ఆస్తులు తీసుకుని రోడ్డున పడేయడం అమానుషం**
**మహిళల వేధింపులపై తక్షణమే స్పందించాలి**
**ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్**

**బాపట్ల.మే11, ప్రభాతవార్త ప్రతినిధి:** తమ రక్తాన్ని ధారపోసి, రెక్కలు ముక్కలు చేసుకుని పెంచి పెద్ద చేసిన కన్నవారిని వృద్ధాప్యంలో రోడ్డున పడేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని బాపట్ల జిల్లా ఎస్పీ



ఉమామహేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే) లో ఆయన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సుమారు 41 మంది అర్జీదారులు తమ గోడును ఎస్పీకి వినిపించుకున్నారు.

**తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం తగదు..**

ఈ సందర్భంగా పలువురు వృద్ధులు తమ పిల్లలు చేస్తున్న వేధింపులపై ఎస్పీకి మొరపెట్టుకున్నారు. దీనిపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ ఆస్తులన్నీ తీసుకుని, తల్లిదండ్రులను విస్మరించే పిల్లల తీరు అమానుషమని మండిపడ్డారు. ఇలాంటి ఘటనల్లో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యతను గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

**త్వరితగతిన న్యాయం చేయండి..**

వచ్చిన అర్జీలలో ప్రధానంగా ఆస్తి వివాదాలు, కుటుంబ కలహాలు, భూ సమస్యలు, ఆర్థిక మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. బాధితులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ సమస్యల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు.మహిళలను వేధించే భర్తలు, అత్తింటి వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చూడాలన్నారు.పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ బాధితుల పక్షానే ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావుతో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# 6 మంది అంగన్వాడీ ఆయాలకు పదోన్నతి

### -రాజీనామా ఫైళ్లకు కలెక్టర్ ఆమోదం.. విధులకు గైర్హాజరైన ఒకరి తొలగింపు



**బాపట్ల,మే11.,ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీ, సిబ్బంది క్రమబద్ధీకరణపై యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లా పరిధిలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న ఆరుగురు ఆయాలకు కార్యకర్తలుగా పదోన్నతి కల్పిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

**పదోన్నతులు పొందింది వీరే..**

బాపట్ల, వేటపాలెం, పల్లపట్ల మరియు అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో సుదీర్ఘ కాలంగా ఆయాలుగా సేవలందిస్తున్న ఆరుగురికి వారి సీనియారిటీ, అర్హతలను బట్టి అంగన్వాడీ కార్యకర్తలుగా ప్రమోషన్ కల్పించారు. పదోన్నతి పొందిన వారు తక్షణమే కేటాయించిన కేంద్రాల్లో బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

**క్రమశిక్షణ తప్పితే వేటే..**

విధు పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కలెక్టర్ కఠినంగా వ్యవహరించారు. విధులకు సుదీర్ఘకాలంగా గైర్హాజరవుతున్న ఒక అంగన్వాడీ ఆయాను సేవల నుండి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

**రాజీనామాలపై నిర్ణయం..**

వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసిన ముగ్గురు అంగన్వాడీ కార్యకర్తలు, నలుగురు ఆయాల రాజీనామా ఫైళ్లను కమిటీ క్షుణ్ణంగా పరిశీలించింది. అనంతరం వారి రాజీనామాలకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధామాధవి, సంబంధిత సీడీపీఓలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గవినివారిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో దారుణ ఫలితాలు!

**-36 మందికి 9 మందే పాస్.. 26 మంది ఫెయిల్**
**-కలెక్టర్‌కు గ్రామస్తుల మొర..**
**-సమ్మర్ క్లాసులు నిర్వహించాలని విజ్ఞప్తి**
**- స్కూల్ నిధులు ఏమయ్యాయి? నిలదీస్తున్న తల్లిదండ్రులు**

**బాపట్ల.మే11,ప్రభాతవార్త ప్రతినిధి:** చీరాల మండలం గవినివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదో తరగతి ఫలితాలు నిరాశాజనకంగా ఉండటంపై గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధిలో పాలకుల నిర్లక్ష్యం, విద్యాబోధనలో లోపాల కారణంగానే విద్యార్థులు నష్టపోతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫలితాల్లో వెనుకబాటు.. 26 మంది ఫెయిల్ఇటీవల వెలువడిన ఫలితాల ప్రకారం.. ఈ పాఠశాల నుండి పదో తరగతి పరీక్షలకు 36 మంది విద్యార్థులు హాజరుకాగా, కేవలం 9 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన 26 మంది విద్యార్థులు ఫెయిల్ కావడం గ్రామంలో చర్చనీయాంశమైంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఫెయిల్ అయిన వారికి తక్షణమే ప్రత్యేక సమ్మర్ క్లాసులు నిర్వహించి వారు తిరిగి పుంజుకునేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు మంజూరైనా అందని అభివృద్ధికొత్తగా ఏర్పడిన ఈ జెడ్పీ హైస్కూల్ అభివృద్ధి కోసం గతంలో రూ.26 లక్షలు మంజూరైనట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ నిధులు వినియోగంలోకి రాకుండానే నిరుపయోగంగా మారిపోయాయని, ఫలితంగా పాఠశాల అభివృద్ధి కుంటుపడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు సకాలంలో విడుదల చేసి ఉంటే పాఠశాల వసతులు మెరుగుపడి, ఫలితాలు మరోలా ఉండేవని గ్రామ పెద్దలు అభిప్రాయపడుతున్నారు.ఈ సమస్యలన్నింటినీ వివరిస్తూ గవినివారిపాలెం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు బాపట్ల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, నిలిచిపోయిన నిధులను వెంటనే విడుదల చేసి పాఠశాలను అభివృద్ధి చేయాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా టిడిపి బీసీ సెల్ ప్రెసిడెంట్ గవిని శ్రీనివాసరావు. ఎం నాగేశ్వరరావు. షేక్ అబ్దుల్. తదితరులు పాల్గొన్నారు

# ఆత్మవిశ్వాసంతో దివ్యాంగులు ముందడుగు వేయాలి

### రూ. 1.39 లక్షల విలువైన ఉపకరణాల పంపిణీ

**బాపట్ల, మే11,ప్రభాతవార్త ప్రతినిధి:** దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, ప్రభుత్వం అందిస్తున్న



సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆకాంక్షించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఉచితంగా సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు.ముఖ్యంగా దివ్యాంగ శక్తిఖి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని, ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.సమాజంలో దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా, స్వయంశక్తితో ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో భాగంగా మొత్తం రూ. 1,39,700 విలువైన పరికరాలను పంపిణీ చేశారు. వీటిలో 14 మూడు చక్రాల సైకిళ్లు, 3 వీల్ చైర్లు, 2 వినికిడి యంత్రాలు ఉన్నాయి. ఉపకరణాలు అవసరమైన దివ్యాంగులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# రేపల్లె ఎన్టీఆర్ నగర్‌లో ఇళ్ళకు డోర్ నెంబర్లు ఏర్పాటు చేయించాలి




**రేపల్లె, మే 11, ప్రభాతవార్త:** పట్టణంలోని పిఎంఎవై కింద నిర్మించిన ఎన్టీఆర్ నగర్‌లో నివాసాలకు విధిగా డోర్ నెంబర్ల సదుపాయం కల్పించాలని ఎన్టీఆర్ నగర్ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు,సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ కోరారు.సోమవారం ఎన్టీఆర్ నగర్‌లోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించిన అనంతరం రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె పురపాలక సంఘంలో వార్డుల సంఖ్య 36కి చేరుకోనున్న దృష్ట్యా అధికారులు స్పందించాలన్నారు.1500 కుటుంబాలు నివసిస్తున్నందున ఎన్నికల నిబంధనల ప్రకారం స్థానికంగా ఓటు హక్కు కల్పించాలని చెప్పారు.28 వార్డులుగా ఉన్న రేపల్లె పురపాలక సంఘంలో వార్డుల పునర్విభజనను దృష్టిలో ఉంచుకుని తక్షణమే డోర్ నెంబర్ల సదుపాయాన్ని ప్రారంభించాలని ఆయన సూచించారు.ఎన్టీఆర్ నగర్‌లో నూతనంగా రేషన్ దుకాణాన్ని ప్రారంభించాలని ఆయన కోరారు.రేషన్ వాహనాలు రద్దు తర్వాత తాత్కాలికంగా మొదటి వారంలో ఒక పూట రేషన్ షాపు ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో ప్రజలకు రేషన్ తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన వివరించారు.రా ష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి,స్థానిక ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ హామీ మేరకు రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించాలని మణిలాల్ విజ్ఞప్తి చేశారు.వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి బోర్లు మరమ్మతులకు చేరితే వెంటనే మరమ్మతులు చేయించాలని,వీధి దీపాల మరమ్మతులు పూర్తి చేయించి విద్యుత్ వెలుగులు నింపాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి.ధనమ్మ,కె.నాంచారమ్మ,సిపిఎం నాయకులు కె.ఆశీర్వాదం,బి.ఆగస్టీన్,కొప్పుల గోపి, జె.ధర్మరాజు.ఎస్.కె.షకీరా,సింధుదేవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు



**రేపల్లె, మే 11, ప్రభాతవార్త:** పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి 11 అర్జీలు అందినట్లు ఆర్డీవో బి.శ్రీదేవి తెలిపారు.అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు.రేపల్లె పట్టణంలో మురుగునీటి కాల్వల్లో పూడికలను తీయించి డ్రెయినేజీ వ్యవస్థను పటిష్టపరచాలని ఓలేటి వీరరాఘవయ్య,భారతీయ జనతా పార్టీ తరపున పిన్ని సాంబశివరావు అర్జీలు అందజేశారు.ఎన్టీఆర్ నగర్‌లో ఓటు హక్కు కల్పించాలని పి.ధనమ్మ,నూతన రేషన్‌షాపు ఏర్పాటు చేయించాలని

ఎస్‌కె షకీరా,ఇంటి డోర్ నెంబర్లు ఏర్పాట చేయించాలని కుంచా నాంచారమ్మ అర్జీలు అందజేశారు.9వ వార్డులో కారం మిల్లు,మినపపప్పు మిల్లు,బియ్యం పిండి మిల్లు, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణాల వలన అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని వై.ఆదిశేషగిరిరావు ఫిర్యాదు చేశారు.స్థలం కొలతల విషయంలో బంధువుల నుండి బెదిరింపులు వస్తున్నాయని రక్షణ కల్పించాలని,స్థలాన్ని సర్వే చేయించాలని భట్టిప్రోలు మండలంలోని కోనేటి పురంకు చెందిన పడమటి శివధర్మారావు అర్జీ అందజేశారు.స్థల విషయంపై సమస్యలు తలెత్తుతున్నాయని నగరం మండలంలోని తోటపల్లికి చెందిన కె.సుధారాణి ఫిర్యాదు చేశారు.తన భూమిని సర్వే చేయించాలని భట్టిప్రోలుకు చెందిన కొలసాని విక్రమ్ అర్జీ అందజేశారు.పెండింగ్‌లో ఉన్న ఆర్ఓఆర్ కేసును త్వరితగతిన పరిష్కరించాలని చుండూరు మండలంలోని మోదుకూరుకు చెందిన మిరియాల సుబ్బాయమ్మ అర్జీ సమర్పించారు.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



**రేపల్లె, మే 11, ప్రభాతవార్త:** రేపల్లెలోని న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్ చెప్పారు.సోమవారం రేపల్లెలోని బార్ అసోసియేషన్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె న్యాయస్థానంలోని మౌలిక సదుపాయాల కొరత,న్యాయవాదుల వసతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు.ఈ సందర్భంగా చలసాని అజయ్‌కుమార్‌ను రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకా పూర్ణచంద్రరావు,బార్ అసోసియేషన్ కార్యదర్శులు పెద్దపల్లి హనోక్,మోర్ల కృష్ణారామ్,సీనియర్ న్యాయవాదులు పి.నాగాంజనేయులు,డి.సాంబశివరావు,మునిపల్లి సుబ్బయ్య,కె.గోపాలరావు, జి.ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్తా,ఒడుగు రాంబాబు,జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త

## నేడు హనుమజ్జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి




**యడ్లపాడు, మే 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోయపాలెం, యడ్లపాడు, కొండవీడు, ఇతర గ్రామాలలో నేడు హనుమజ్జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు అయా గ్రామల నిర్వాహకులు తెలుపుతున్నారు. మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానము నందు 1100మామిడి పండ్లతో సహస్రనామ పూజ నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఉదయం నుండే స్వామి వారికి ప్రత్యేకమైన చందన అలంకారము, 8రకాల ప్రసాదములు వినియోగము, ఏకాహం, శ్రీరామ నామ భజన సంకీర్తనము, అనంతరము అన్నదాన వినియోగము నిర్వహించటం జరుగుతుందన్నారు. కావున ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదం స్వీకరించవల్సిందిగా కోరుతున్నారు.

## రేపు మండల సర్వ సభ్య సమావేశం : ఎంపీడీవో



**యడ్లపాడు, మే 11, ప్రభాతవార్త :** యడ్లపాడు మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశము 13వ తేది బుధవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించటం జరుగుతుందని ఎంపీడీవో వి హేమలాదేవి తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, అధ్యక్షతన సమావేశం నిర్వహించటం జరుగుతుందని, కావున సదరు సమావేశమునకు మండల ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులందరూ తప్పక హాజరు కావలసినది కోరుతున్నారు. అదేవిధంగా మండలములోని వివిధ శాఖల అధికారులందరూ వారి వారి శాఖల యొక్క పూర్తి సమాచారముతో హాజరు కావల్సిందిగా కోరడమైందన్నారు.

## రైతుల వద్ద నున్న మొక్కజొన్న, శనగ పంటలను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలి

**యడ్లపాడు, మే 11, ప్రభాతవార్త :** రైతుల దగ్గర ఉన్న పప్పు శనగ, మరియు మొక్కజొన్న పంటను ప్రభుత్వం మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పలనాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం యడ్లపాడు మండల కేంద్రంలో పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం యడ్లపాడు మండల రెండవ మహాసభలు వి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెప్పే ప్రభుత్వాలు తీరా పంట చేతికి వచ్చేసరికి నామమాత్రంగా కొని మిగతా పంటను ప్రైవేటు దళారులకు అమ్ముకునే విధంగా ప్రభుత్వమే చేస్తుందని విమర్శించారు. దీనివల్ల రైతాంగం దోపిడీకి గురై అప్పులు పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా పలనాడు జిల్లాలో చిలకలూరిపేట నియోజకవర్గంలోని దాదాపుగా 55 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయని, వీటిల్లో చాలా మూత పడ్డాయని వెంటనే ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించి సాగునీరు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 2019 సంవత్సరం నుండి దాదాపు ఐదారు సంవత్సరాలుగా మండలంలోని ఆరు గ్రామాల్లో విద్యుత్ హై టెన్షన్ వైర్ల వల్ల నష్టపోయేటువంటి రైతులందరినీ ఐక్యం చేసి దాదాపు 200 మంది రైతులకు నష్టపరిహారం ఇప్పించడంలో సంఘం కృషి చేసిందన్నారు. మండలంలో అనేక సమస్యలు రైతు సంఘం పోరాటాల వల్ల పరిష్కారమయ్యాయని, రాబోయే కాలంలో రైతులందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.



అనంతరం రైతు సంఘం యడ్లపాడు మండల నూతన కమిటీ అధ్యక్షులుగా గాండ్ల అనిల్, ఉపాధ్యక్షులుగా వి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కల్లూరి రామారావు, సహాయ కార్యదర్శి రంగిసెట్టి జయరావు, కోశాధికారి పోపూరి వీరాంజనేయులు, కమిటీ సభ్యులుగా తులసి జగన్మోహనావు, మిర్యాల అంకారావు, కల్లూరి అనిల్, అలవాల వీరారెడ్డి, తోట శ్రీనివాసరావు, కల్లూరు రామస్వామి ఎన్నికయ్యారు. ఈనెల 14, 15 తేదీలలో వినుకొండ లో జరిగే జిల్లా మహాసభలకు పెద్ద ఎత్తున తరలి వెళ్లాలని కమిటీ తీర్మానించిందని తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు నూతలపాడు కాళిదాసు జరుగుల శంకర్రావు తదితరులు మాట్లాడారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు తల్లి, బిడ్డకు క్షేమం : డాక్టర్ మేరీ శ్రీలేఖ

**క్రోసూరు( మే 11 ప్రభాతవార్త ):** ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం తల్లి, బిడ్డకు కూడా క్షేమమని క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మేరీ శ్రీ కళ అన్నారు ప్రతి నెల తొమ్మిదవ తేదీన, పదవ తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం 10వ తేదీన ఆదివారం వచ్చుట వలన సోమవారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన 35 మంది గర్భవతులకు



ఎత్తు, బరువు, రక్తపోటు, చక్కెర, మూత్ర, రక్త పరీక్షలు నిర్వహించి వారిలో రెండవ, మూడవ కాన్పు గర్భిణీ స్త్రీలను క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుకు రమ్మని ప్రోత్సహించటం జరిగినది అనంతరం ఎనిమిది గ్రాములు కంటే తక్కువ హిమోగ్లోబిన్ ఉన్న గర్భిణీ స్త్రీలకు స్టాఫ్ నర్స్ రాజ్యలక్ష్మి ఐరన్ సూక్రోజ్ ఇంజక్షన్ ను సెలైన్ ద్వారా ఎక్కించటం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ మేరీ గర్భిణీ స్త్రీలు ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు వాడాలన్నారు ముఖ్యంగా బెల్లం చిక్కిలు, నువ్వులు, కొబ్బరి, పచ్చని ఆకుకూరలు మరియు కూరగాయలు, మాంసము, మొలకెత్తు ధాన్యాలు, రాగి జావా, రాగి సంగటి, చేసిన పిండి వంటలు, దానిమ్మ పండు వంటి ఆహారం నిత్యం ఏదో ఒకటి రోజు తినే తిండి లో ఉండే విధంగా చూసుకోవాలన్నారు ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ పిహెచ్సిలో కాన్పు అనంతరం విద్యార్థి సమయంలో బిడ్డకు జనన ధ్రువ పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు బిడ్డకు జీరో డోస్ టీకాలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు తల్లిపాల ప్రాముఖ్యత, హెచ్ పి వి టీకా ల ప్రాముఖ్యతపై సిబ్బంది అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రాజ్యలక్ష్మి, ఫార్మసిస్ట్ ఫాతిమా, ల్యాబ్ టెక్నీషియన్ ప్రభాకర్, ఎం ఎల్ హెచ్ పి/సిహెచ్ఓ లు , ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు

## లిడ్ క్యాప్ భూములను కబ్జా చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : ఏపీ చర్మకారుల సేవా సంఘం

**క్రోసూరు,మే 11, ప్రభాతవార్త:** పెదకూరపాడు. లిడ్ క్యాప్ భూములను కబ్జా చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు కట్టాలని ఆంధ్రప్రదేశ్ చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి గార్లపాటిదాసు డిమాండ్ చేసినారు. రాష్ట్ర అధ్యక్షులు బుల్ల రాజారావు పిలుపుమేరకు సోమవారం పెదకూరపాడు నియోజకవర్గము పెదకూరపాడులో ఏపీ చర్మకారుల సేవా సంఘం కార్యాలయంలో



మండల అధ్యక్షులు మందడపు నాగయ్య ఆధ్వర్యంలో పత్రిక విలేకరుల సమావేశంలో గార్లపాటి దాసు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సొంత జిల్లా అయిన తిరుపతి లో చంద్రగిరి నియోజకవర్గము శాసనసభ్యులు పులివర్తి నాని ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ తిరపతి రూరల్ మండలం చైతన్య పూరి పంచాయతీలో సర్వేనెంబర్ 72/2 ఏ లో ఒక ఎకరం 11 సెంట్లు లిడ్ క్యాప్ కు సంబంధించిన భూమిని కబ్జా చేయడానికి గిరిధర్. రామ్మూర్తి. గోవిందు. అనే కబ్జాదారులు శనివారం జెసిబిలుతో వచ్చి చదును చేయడం ముఖ్యమంత్రికి స్థానిక శాసనసభ్యులకు కనిపించడం లేదా అని అన్నారు. స్థానిక తిరుపతి మాదిగ లిడ్ క్యాప్ భూములు పరిరక్షణ కమిటీ నేతలు వెంటనే తిరుచానూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వెళ్లి అక్కడ సదును చేస్తున్న జెసిబిలను స్టేషన్కు తరలించగా గిరిధర్. రామ్మూర్తి. గోవింద్. ఈ భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ మా వద్ద ఉన్నాయని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. లిడ్ క్యాప్ భూమికి సంబంధించి పట్టాలు సృష్టించిన వారిపై లేదా పట్టా ఇచ్చిన వారిపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో లిడ్ క్యాప్ భూములు కబ్జాకు గురవుతున్న లిడ్ క్యాప్ ఎండి సెక్రటరీ మరియు లిడ్ క్యాప్ చైర్మన్ లకు భూములను పరిరక్షించాల్సిన బాధ్యత లేదా అని అన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన వారు సాగు చేసుకుంటున్నా భూములలో దౌర్జన్యంగా స్థానిక నాయకులు గ్రావెల్ తోలుకోవడం లేదా కబ్జా చేయడం రాష్ట్రంలో ప్రతి చోట ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నది. అప్పటి ప్రభుత్వం మాదిగ చర్మకారులను అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలో లిడ్ క్యాప్ కు వందల ఎకరాలను లిడ్ క్యాప్ కు అప్పగించినారు. కూటమి ప్రభుత్వం ఆ భూములను అభివృద్ధి చేయకుండా చర్మకారులను విస్మరించటం తగదన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ లిడ్ క్యాప్ భూములను విచారణ చేసి కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ చర్మకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని గార్లపాటి దాసు తెలిపినారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిలకా భాస్కరరావు. పెదకూరపాడు నియోజకవర్గము కన్వీనర్ కంచర్ల అచ్యుతరావు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

### జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంజన సింహా

**నరసరావుపేట,మే 11 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్ లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని ఆయా మండలాల



నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజల నుండి జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంజన సింహా అర్జీలను స్వీకరించారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ, ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 119 అర్జీలను స్వీకరించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులను జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంజన సింహా మాట్లాడుతూ, పిజిఆర్ఎస్ అర్జీలను సత్వరం అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. ఆయా శాఖల అధికారులు గడువులోపు అర్జీలను పరిష్కరించడం చేయాలన్నారు. ప్రతిరోజు అర్జీలను మానిటర్ చేయాలని, గడువు తీరకముందే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చేయాలని ఆదేశించారు. అర్జీలను ఎలాంటి పెండింగ్ ఉంచరాదని, పెండింగ్ ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ అర్జీలను ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంజనా సింహా ఆదేశించారు.

## ఉచిత ఉర్దూ పుస్తకాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, మే 11, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని 15వ వార్డులో ఆవో ఉర్దూ సీఖే .... రండి ఉర్దూ నేర్చుకుందాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత ఉర్దూ మెటీరియల్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు చేతుల మీదుగా విద్యార్థులకు, ఔత్సాహికులకు ఉర్దూ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉర్దూ భాష నేర్చుకోవడం ద్వారా సాంస్కృతిక ఐక్యత పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. ఉర్దూ అకాడమీ ద్వారా ఉచితంగా అందిస్తున్న ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ ఫిరోజ్, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, అంజుమన్ కమిటీ సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలతో పేదల జీవితాల్లో వెలుగులు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 11, ప్రభాతవార్త: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రత్తిపాటి ఫౌండేషన్ అందిస్తున్న ఉచిత వైద్యసేవల్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత వైద్య



సేవలు అందిస్తూ, తమ జీవితాల్లో వెలుగులు నింపుతున్న స్వచ్ఛంధ, ఆరోగ్య సంస్థల్ని ప్రజలు ఆదరించాలని శాసనసభ్యులు, టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.ప్రత్తిపాటి ఫౌండేషన్ వైద్య శిబిరాల్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడండి.. స్వర్గీయ ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 29న నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరం ప్రచార పత్రాలను ఆదివారం ప్రత్తిపాటి ఆవిష్కరించారు. పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్ లో 29వ తేదీ ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రత్తిపాటి ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహిస్తున్న 43వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ఫౌండేషన్ నిర్వాహకులు, కార్యనిర్వాహక సభ్యులదేనని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య సిబ్బంది సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, డాక్టర్ రామకృష్ణ, ఫౌండేషన్ నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ముద్దన నాగేశ్వరరావు, తుపాకుల అప్పారావు, ఆర్.యం.పి. వైద్యులు మురళి, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లిలో చైన్ స్నాచింగ్ కేసు ఛేదించిన పోలీసులు

**-ఇద్దరు నిందితులు, ఇద్దరు బాల నేరస్తులు పోలీసుల అదుపులోకి-రూ.1.33 లక్షలు విలువైన బంగారం, బైక్ స్వాధీనం**

**సత్తెనపల్లి, మే 11, ప్రభాతవార్త:** సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 11వ తేదీన ఉదయం సత్తెనపల్లి పట్టణంలో ఓ మహిళ మెడలో ఉన్న బంగారు తాళిబొట్టును అపహరించిన ఘటనపై కేసు నమోదు చేశారు. కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించారు. నిందితుల నుంచి సుమారు 13.88 గ్రాముల వెండి ఆభరణాలు, అంచనా విలువ రూ.1,33,000 నగలు, అలాగే ఎపి 07 బిఎ 2113 నంబర్ గల హీరో స్పెండర్ ప్లస్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసులో



ఉపయోగించిన ఇతర వస్తువులను కూడా పోలీసులు జప్తు చేశారు. ఈ కేసును ఛేదించడంలో ఎం. పవన్ కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ఏ.వి. ఆంజనేయులు, పోలీస్ కానిస్టేబుల్ కే. రాజు కీలక పాత్ర పోషించారు. వారి సేవలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అభినందించారు. సత్తెనపల్లి ప్రాంతంలో నేరాల నియంత్రణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

## మాతృ,శిశు మరణాలు జరగకుండా చూడాలి

**రాజుపాలెం, మే 11, ప్రభాతవార్త:** రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హనుమకుమార్ సందర్శించి ప్రతి నెల 9,10 వ తేదీల్లో జరిగే



ప్రధాన మంత్రి సురక్షత మాతృత్వ అభియాన్ కార్యక్రమం పరిశీలించారు. అనంతరం ఆయన సిబ్బంది తో మాట్లాడుతూ ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో మాతృ,శిశు మరణాలు జరగకుండా చూడాలని అన్నారు. గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటూ ఉండాలన్నారు.గర్భిణీలకు సకాలంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఈవిధంగా చేస్తే ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెరగడమే గాకుండా మాతృ మరణాలను నివారించవచ్చు అని,వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం,కుటుంబ సంక్షేమ కార్యక్రమాలన్నీ సక్రమంగా అమలయ్యే విధంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని డాక్టర్ రవితేజ నాయక్ కు తెలియచేసినారు.గ్రామం లోని ప్రతి వ్యక్తి కి ఆష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ నెంబర్ కి వారి కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర కి లింక్ చేయాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమలో హెల్త్ సూపర్‌వైజర్ జీవనరావు, హెల్త్ విజిటర్ ఉషారాణి, స్టాఫ్ నర్సు చందన, ఫార్మాసిస్ట్ శివ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ తెజేశ్వని, శిరీష, మహిళా ఆరోగ్య కార్యకర్త మస్తాన్ బీ,ఆశా కార్యకర్తలు పాల్గున్నారు.

## నేడు సత్తెనపల్లిలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**సత్తెనపల్లి, మే 11, ప్రభాతవార్త:** ఈనెల 12వ తేదీ మంగళవారం ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎరిక్షన్ ఆఫ్ 33కెవి లైన్ కోసం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది దీనివలన చెంచు కాలనీ ,రఘురామ నగర్,ఆంజనేయ స్వామి ఆలయం సెంటర్, బొడ్డురాయి సెంటర్ , కుక్క అంతరాల బజార్, సుందరయ్య కాలనీ, భాస్కర్ రెడ్డి ప్లాట్లు,వడ్డవలి,గర్లపాడు రోడ్డు , శాస్త్రి నగర్, అంబేద్కర్ నగర్, అబ్బూరు రోడ్, అచ్చంపేట్ రోడ్ విద్యుత్తు అంతరాయము జరుగుతుందని అధికారులు తెలిపారు. .కావున విద్యుత్తు వినియోగదారులు దీన్ని గమనించగలరని విజ్ఞప్తి చేశారు.

## గిరి ప్రదక్షిణ రోడ్డు పనులు పరిశీలించిన చీఫ్‌విప్ జీ.వీ

**వినుకొండ,మే11,ప్రభాతవార్త:** పట్టణంలో చేపట్టిన గిరి ప్రదక్షిణ బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రూ.1.85 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ బీటీ రోడ్డు పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు



నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జీ.వీ ఆదేశించారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులు,స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జీవీ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ప్రజలకు ఉపయోగపడే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐనవోలు గ్రామంలో కార్డెన్ సెర్చ్

**నూజెండ్ల,మే11,ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా ఎస్పీఆదేశాల మేరకు మండలంలోని ఐనవోలు గ్రామంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 100 మంది పోలీసులతో సీఐ బ్రహ్మయ్య,ఎస్సై కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. కార్డన్ అండ్ సెర్చ్ లో భాగంగా సుమారు



36 మోటార్ సైకిళ్ళు కొన్ని కత్తులు,గడ్డపారలు సీజ్ చేయడం జరిగినది. అనంతరం గ్రామస్తులకు డ్రగ్స్,రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

## మాచర్ల పట్టణ సీఐగా మహమ్మద్ నజీర్‌బేగ్



**మాచర్ల, మే 11 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణ సీఐగా మహమ్మద్ నజీర్‌బేగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా సీఐ నజీర్‌బేగ్ మాట్లాడుతూ పట్టణంల శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు భయం లేకుండా జీవించే వాతావరణాన్ని కల్పించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అక్రమ కార్యకలాపాలు, జూదం, బెట్టింగ్, మద్యం అక్రమ రవాణా వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి నేరాలను అరికట్టడంతో భాగస్వాములు కావాలని కోరారు. సమస్యలపై ఎప్పుడైనా పోలీసు స్టేషన్‌లో సంప్రదించవచ్చన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానన్నారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలంటూ వినతి

**కారంపూడి, మే 11 ప్రభాతవార్త:** స్థానికంగా మాచర్ల రోడ్డులో డ్రైనేజీ కాలువలు పూడిక పేరుకుపోవడం వల్ల మురుగునీరు రోడ్లపైకి వచ్చి దుర్గంధం వెదజల్లుతోందని సమస్యను పరిష్కరించాలంటూ స్థానిక నాయకులు పాలెపోగు బాబు, కోట దాసు, షావుకారు జానీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి



కసిన్యానాయక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాబోయే వర్షాకాలంలో మురుగు రోడ్లపై ప్రవహించడం వల్ల రోడ్లు దెబ్బతింటాయని, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. మురుగు నిల్వ వల్ల దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందిన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని వినతిలో పేర్కొన్నారు.

## ఉర్దు అకాడమిలో పుస్తకాలు పంపిణీ

**గురజాల, మే 10 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్ధూ అకాడమీ ఆధ్వర్యాన చైర్మన్ మహ్మద్ ఫరూక్ సుబ్లీ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పట్టణంలో ఉర్ధూ అకాడమీ కంప్యూటర్, లైబ్రరీ సెంటర్



ఆధ్వర్యాన 'ఆవో ఉర్ధూ సిఖ్షే కార్యక్రమంను స్థానిక మదర్సా అసరా ఫుల్ ఉలూమ్ ట్రస్ట్‌లో సోమవారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఏపీ స్టేట్ ఉర్ధూ అకాడమీ ఉద్యోగుల, మదర్సా ముఫ్టి షేక్ అబ్దుల్ సలాం, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు, పట్టణ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ బాబావలి, టౌన్ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ ముజీబ్, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, షేక్ సైదా, షేక్ వాచర్ బుడే, షేక్ ఫరీద్ మేస్త్రి, ఫయాజ్ రెహ్మాన్, షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## రైలు పట్టాల పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**మాచర్ల, మే 11 ప్రభాతవార్త:** రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం సమయంలో హైవే వంతెన వద్ద రైలు కింద పడి ఓ వ్యక్తి చేయి, కాలు తెగిపోయిన స్థితిలో మృతి చెందాడు. అతని వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయన్నారు. బ్లూగీతలు కలిగిన ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. సంబంధికులు ఎవరైనా ఉంటే నడికుడి రైల్వే పోలీసుల ఫోన్ నంబరు 9849234990,9440373372లో సంప్రదించాలన్నారు.



MN 6 PAGE-GNT FFF:MN 6 PAGE-GNT 01/01/2001 08:14 Page 1



# షాదీఖానా నిర్మించండి

## మంత్రి నాదెండ్లకు మైనార్టీ నేతల విజ్ఞప్తి



**తెనాలి మున్సిపాలిటీ, మే11,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని ముస్లిం మైనారిటీల కోసం నూతన షాదీఖానా నిర్మించాలని పట్టణ ముస్లిం మైనారిటీ సోదరులు మంత్రి నాదెండ్ల మనోహార్ కి వినతిపత్రం అందజేశారు.సోమవారం పురపాలకసంఘ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక(పిజీఆర్ఎస్)గ్రీవెన్స్ కార్యక్రమంలో, స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహార్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెనాలి పట్టణ ముస్లిం మైనారిటీ సోదరులు మరియు కూటమి సభ్యులు మంత్రి నాదెండ్ల మనోహార్ ని కలిసి తెనాలి పట్టణం లోని ముస్లిం మైనారిటీల కొరకు నూతన షాదీఖానా నిర్మించి ఇవ్వవలసినదిగా కోరుచు మరియు తెనాలి పట్టణం లోని పాండురంగపేటలో ఉన్నటువంటి షాదీఖానాకి నూతన కమిటీ నియమించవలసినదిగా కోరుతూ వినతిపత్రం సమర్పించటం జరిగింది ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ జాకీర్ హుస్సేన్ మరియు ఈద్గా కమిటీసభ్యులు మరియు మైనారిటీ కూటమి సభ్యులు పాల్గొన్నారు.

**చిరు వ్యాపారులకు ఆశీలు రద్దు:**

పురపాలకసంఘ పరిధిలో తోపుడుబండ్లపై,వ్యాపారాలు నిర్వహించే చిరువ్యాపారులకి మంత్రి మనోహార్ భారీ ఊరట కల్పించారు.చిరువ్యాపారుల నుండి వసూలు చేస్తున్న ఆశీలు ను నేటినుండి రద్దు చేస్తున్నట్టు ,ప్రకటించారు.ఇకపై ఎలాంటి వసూళ్లు జరగకుండా చూడాలని మున్సిపల్,పోలీస్ అధి కారులను ఆదేశించారు.దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు ఆదేశాలు పంపినట్లు మంత్రి వెల్లడించారు.

**మంత్రి నాదెండ్లను కలిసిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్:**

స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ని, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,సోమవారం తెనాలి మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఇటీవల మృతి చెందిన మనోహార్ తండ్రి భాస్కరరావు మరణం పట్ల ఎస్పీ సంతాపం తెలిపారు.అనంతరం పలు అంశాలపట్ల చర్చించారు.వీరితో పాటు,తెనాలి డిఎస్పీ బి. జనార్ధనరావు, మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు,తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ ఉన్నారు.

# పోలీసు ఔట్ పోస్ట్‌ను ప్రారంభించిన ఎస్పీ



**గుంటూరు క్రైమ్,మే11,ప్రభాతవార్త:** గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో,శ్రీ అలపర్తి లక్ష్మయ్య జ్ఞాపకార్థం ప్రముఖ వైద్యులు శ్రీమతి డా. అలపర్తి.నందన ప్రియ, నందన హాస్పిటల్, గుంటూరు వారి సౌజన్యంతో నిర్మించబడిన నూతన "పోలీస్ ఔట్ పోస్ట్" ను సోమవారం ఉదయం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.గుంటూరు జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డా.ఎస్.ఎస్.వి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రిబ్బన్ కత్తిరించి పోలీస్ ఔట్ పోస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ ఔట్ పోస్ట్ నిర్మాణానికి సహకారం అందించిన నందన హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయడం అత్యంత అవసరమైన,ప్రజలకు ఉపయోగకరమైన చర్య అని తెలిపారు.ప్రమాదాలు, ఇతర ఘటనల్లో గాయపడిన వారికి ఎమ్మెల్సీ సర్టిఫికెట్లు జారీ చేయడం, మరణించిన వారి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్లకు తెలియజేయడం వంటి విధుల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఆసుపత్రిలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించేందుకు,అలాగే బాధితులు తమ ఫిర్యాదులను పోలీసులకు అందించేందుకు ఈ ఔట్ పోస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ పోలీస్ ఔట్ పోస్ట్‌లో 5 మంది పోలీస్ సిబ్బంది 24 గంటలు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తారని,ఆసుపత్రిలో తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించి పై అధికారులకు సమాచారం అందిస్తారని వివరించారు.ఆసుపత్రిలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఇది సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు.గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ మాట్లాడుతూ కోస్తాంధ్రలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఆసుపత్రిగా నిలిచిందని,ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు వివిధ ప్రాంతాల నుండి వైద్య సేవల కోసం ఇక్కడికి వస్తారని తెలిపారు. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన ఆసుపత్రిలో పోలీస్ ఔట్ పోస్ట్ అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. అరండల్ పేట ఆర్.ఓ.బి నిర్మాణ పనుల కారణంగా పాత ఔట్ పోస్ట్ తొలగించబడగా, ప్రముఖ వైద్యురాలు డా"అలపర్తి నందన ప్రియ సహకారంతో వెంటనే నూతన ఔట్ పోస్ట్ నిర్మించబడిందని తెలిపారు.ప్రమాదాలు,మరణాలు,ఫోరెన్సిక్,లీగల్ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయడంలో ఈ ఔట్ పోస్ట్ బాధితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు ప్రసిద్ధి చెందిన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు,సిబ్బంది,ఆసుపత్రి అధికారులను కోరారు.పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటుకు సహకారం అందించిన డా"నందన ప్రియకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్,ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్,జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డా.ఎస్.ఎస్.వి రమణ,ఎస్బి డీఎస్పీ అలహరి శ్రీనివాస్,కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి,లాలపేట సీఐ శివప్రసాద్,ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్,ఇతర పోలీస్ అధికారులు, ఆసుపత్రి యాజమాన్యం,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 14న ఎస్ఆర్ఎంలో బీటెక్ సీట్ల కేటాయింపు

### -జూన్ 10 నుంచి రెండో ఫేజ్ ఎస్ఆర్ఎం జేఈఈఈ -ఈ ఏడాది నుంచి బీటెక్ లో ఏఐ, క్వాంటమ్ ప్రోగ్రామ్స్

**మంగళగిరి, మే 11, ప్రభాతవార్త:** ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బీటెక్ అడ్మిషన్ల కోరుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 14న సీట్ల కేటాయింపు జరుగుతుందని ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్




ప్రొఫెసర్ వై. శివశంకర్ పేర్కొన్నారు. మొదటి దశ కింద ఎంట్రన్స్ టెస్ట్ (ఎస్ఆర్ఎం జేఈఈఈ) కు హాజరైన విద్యార్థులు తమకు అవసరమైన ప్రోగ్రామ్ లను ఈ నెల 10వ తేదీ వరకూ ఎంపిక చేసుకున్నారనీ, వీరందరికీ ర్యాంకుల ఆధారంగా సీట్లను కేటాయిస్తూ 14న సమాచారం అందుతుందని వివరించారు. ఆదేవిధంగా జూన్ 10వ తేదీ నుంచి 15 వరకూ రెండో దశ ప్రవేశ పరీక్ష జరుగుతుందనీ, జూన్ 4 వరకూ ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి బీటెక్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ, హెల్త్ ఇంజినీరింగ్, డిఫెన్స్ ఇంజనీరింగ్ ఎనర్జీ ఇంజనీరింగ్, మరియు సెమీకండక్టర్ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్లను ప్రవేశ పెట్టినట్లు డాక్టర్ శివశంకర్ వివరించారు. టెన్త్ 60 శాతం, ఇంటర్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ (పీసీఎం) 60 శాతం మార్కులు గడించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

**ఎంటెక్,ఎమ్మెస్సీ,ఎంబీఏ అడ్మిషన్లు..**

అదేవిధంగా ఈ వార్షిక విద్యా సంవత్సరానికి గాను ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంబీఏ అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయని డాక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. ఎంటెక్లో సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఎంబెడెడ్ సిస్టమ్, మెటీరియల్స్ అండ్ మాన్యుఫాక్చరింగ్, థర్మల్ ఇంజినీరింగ్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీరింగ్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఎమ్మెస్సీలో ఎకనామిక్స్, సైకాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇవి మాత్రమే కాకుండా ఎంబీఏలోరెసిడెన్షియల్ ప్రోగ్రామ్ కూడా అందుబాటులో ఉందన్నారు. ఇకపోతే బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీకాం డిగ్రీలకు కూడా అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొంటూ, ఎస్ఆర్ఎం లో బీటెక్ అడ్మిషన్లు కల్పిస్తామంటూ గుంటూరు, విజయవాడ నగరాల్లో కొంత మంది ఏజెన్సీలు నిర్వహిస్తున్నారనీ, వీరిపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడ్మిషన్లు అవసరమైన వారు నేరుగా మంగళగిరి సమీపంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సంప్రదించాలని కోరారు.

# జనసేన పార్టీ క్రియా ఇన్సూరెన్స్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**మంగళగిరి, మే 11, ప్రభాతవార్త :** మంగళగిరి, జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో తిశిలీ శీదిది ఏపీఎం ఎస్ ఐ డి సి చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా జనసేన పార్టీ క్రియా ఇన్సూరెన్స్ తోపాటు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు.క్రియా ఇన్సూరెన్స్ తీసుకున్న కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే పలువురు సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు.ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసైనికుల కుటుంబాలకు అండగా జనసేన పార్టీ క్రియా ఇన్సూరెన్స్ నిలుస్తుందని అన్నారు. పార్టీ కోసం స్వచ్ఛందంగా పనిచేస్తున్న జన సైనికులకు, వీర మహిళలకు అండగా నిలిచేందుకు జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్రియా ఇన్సూరెన్స్ ను ప్రవేశపెట్టారన్నారు.ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ జనసేన నాయకులు జొన్న రాజేష్, చిట్టెం అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# రామభక్త శ్రీవీరాంజనేయ స్వామికి పంచామృతాలతో అభిషేకం



**తెనాలి మే11(ప్రభాతవార్త):** తెనాలి పట్టణం మారీసు పేట లో వేంచేసిన రామభక్త శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానం(అప్పలస్వామి గుడి)లో కల శ్రీ వీరాంజనేయ స్వామి వారికి హనుమాన్ జయంతి సందర్భంగా గత 11 రోజులుగా స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు,ఈ 11 రోజులు పూజలో ఉంచిన రక్ష కట్టిన కొబ్బరికాయతో పాటు స్వామివారి డాలర్ భక్తులకు అందజేస్తున్నాం అని హనుమాన్ జయంతి రోజు స్వామివారికి పంచామృతాలతో, పళ్ళరసాలతో, డ్రై ఫ్రూట్స్ తో అభిషేకం నిర్వహిస్తామని అనంతరం భక్తులచే మన్య సూక్తం హోమం నిర్వహిస్తామని అలాగే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని ధర్మకర్త లంక శివానంద్ కుమార్ తెలియజేశారు.ఆలయ ధర్మకర్తలు కునపల్లి నారాయణస్వామి,లంక శివానంద్ కుమార్,లంక శివ ఆంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో, శ్రీ విష్ణుభట్ల ఆంజనేయ శాస్త్రీ పర్యవేక్షణలో,ఆలయ ప్రధాన అర్చకులు ధనుష్ సుబ్రహ్మణ్య శర్మ క్రతువు లను నిర్వహించారు.

# ఆర్.వి.ఆర్ జె.సి.ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ టెక్నాలజీ డే" వేడుకలు

**గుంటూరు విద్య,మే 11, ప్రభాతవార్త :** గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ లో భారత్ ను అగ్రస్థానంలో నిలిపేందుకు యువ ఇంజినీర్లు పరిశోధనల వైపు దృష్టి సారించాలని, ప్రారంభదశ లోని పోఖ్రాన్, త్రిశూల్ క్షిపణి అణు పరీక్షల విజయాలు భారత దేశాన్ని శక్తివంతమైన సాంకేతిక దేశంగా ప్రపంచ వేదికపై నిలబెట్టాయని ప్రముఖ అంతర్జాతీయ శాస్త్ర సాంకేతిక రంగ




నిపుణులు రోహిత్ మున్నంగి (జర్మనీ) పేర్కొన్నారు.జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ఐ.ఐ.సి సెల్ ఎస్.టి.పి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఇంక్యుబేషన్ సెంటర్లో విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు వాటి విజయాలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో రోహిత్ మున్నంగి మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశం విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో అద్భుతమైన పురోగతి సాధిస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తూ, అంతరిక్ష పరిశోధనలు, కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ టెక్నాలజీ, వంటి రంగాల్లో భారత యువత ప్రతిభ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం దేశానికే గర్వకారణమని తెలిపారు. ప్రపంచ సాంకేతిక రంగంలో భరత్ ను అగ్రగామి దేశంగా నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ఆత్మనిర్భర్ భారత్", "డిజిటల్ ఇండియా", "మేక్ ఇన్ ఇండియా" లక్ష్య సాధనలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని ఒక సందేశం ద్వారా పేర్కొన్నారు.విద్యార్థులు విద్యలోనే కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు మరియు స్టార్ట్ అప్ ల దిశగా ముందుకు సాగాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న జియో ప్లాట్ఫారం లిమిటెడ్ (బెంగుళూరు) ప్రిన్సిపల్ డేటా సైంటిస్ట్ శ్రీ క్రుషీల్ మున్నంగి ఏ ఐ ఎమ్ ఎల్ టూ టెలికం క్రూడ్ అనాలసిస్ అండ్ గ్యాస్ ఇన్స్పోరేషన్ అండ్ ప్రొడక్షన్ మొదలైన అప్లికేషన్స్ మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన ఉత్తమ ఆవిష్కరణలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, అకడమిక్ ఆర్ డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు, డా.ఎమ్.వి.పి చంద్రశేఖర్ రావు, డా.శోభా, డా.ప్రవీణ్ కుమార్, డా.అలపర్తి ముద్దు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి : గ్రంథాలయ అధికారి కనకదుర్గ

**వట్టిచెరుకూరు, మే 11, ప్రభాతవార్త :** వట్టిచెరుకూరు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి నెమలిపురి కనకదుర్గ



పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి నెమలిపురి కనకదుర్గ విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ..విద్యార్థులు వేసవిలో సమయాన్ని వృధా చేసుకోకుండా శిక్షణ ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో రాణించవచ్చనే సంకల్పంతో ప్రభుత్వం వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తుందని చెప్పారు. ఈ శిక్షణా తరగతులను ఏప్రిల్ 28 నుండి జూన్ 6వ తేదీ వరకు ఉదయం 8గంటల నుండి గం.11.30ని.ల వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ తరగతులలో ముఖ్యంగా విద్యార్థులలో తెలుగు భాషాభివృద్ధి పెంపొందించేందుకు కథలు చదవడం, రాయడం, పుస్తకాలు చదవడం, విలువల విద్య, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్ పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, చెస్, జికె, యోగ, వ్యక్తిత్వం, వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, హస్తకళలు, వ్యాసరచన, గణిత ఆటలు, పర్యావరణం పై అవగాహన, సృజనాత్మకత, శారీరక, మానసిక వికాసానికి దోహదపడేలా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. 15 సంవత్సరాల వయసు లోపు పిల్లలందరు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సెల్ ఫోన్ వదలండి పుస్తకాలు పట్టండి అనే నినాదంతో ప్రభుత్వం ఈ ఏడాది ఈ వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలను ఈ శిక్షణ తరగతులకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ స్వామివారి హనుమత్ జయంతోత్సవంలో స్వామి వారికి లక్ష తమలపాకులతో పూజ



**గుంటూరు విద్య మే 11 ప్రభాతవార్త :** గుంటూరు పట్టణం కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీ స్వామివారి హనుమత్ జయంతోత్స్నవలోభాగముగా సోమవారం ఉదయం 11.00 గం.లకు లక్ష ఆకు పూజ నిర్వహించారు . రాత్రి 8.00 గం.లకు శ్రీ హనుమాన్ దీక్షా సమాజం వారి ఆధ్వర్యంలో భాజాబజంత్రీలు, దీపాలంకరణ, వివిధ రకముల దేవతామూర్తుల వేషధారణలతో కోలాటం, భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచాలతో శ్రీ స్వామి వారి గ్రామోత్సవమును గుంటూరు నగరంలోనీ భాస్కర్ డీలక్స్ రోడ్డు, కొత్తపేట, శనక్కాయల ఫ్యాక్టరీ రోడ్డు, కొత్తపేట శివాలయం, భగత్ సింగ్ సెంటర్, విజయ టాకీస్ రోడ్డు, జిన్నా టవర్ సెంటర్, కృష్ణ మహల్ రోడ్ మీదగా శ్రీ స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్షా స్వాములు, మహిళలు, చిన్నారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి టి సుభద్ర,దేవస్థానం చైర్మన్మల్లెంపూడి శ్రీనివాసరావు, శ్రీ హనుమాన్ దీక్షా సమాజం గౌరవ అధ్యక్షులు తిరువల్లూరి వెంకట సుబ్బారావు దీక్ష సమాజం సభ్యులు, నాగేశ్వరరావు, సిహెచ్ రమేష్,మారుతి, వెంకట రమణ, మంశీ ప్రసాద్, బాపి రాజు, కిషోర్ ఆలయ ముఖ్య అర్చక స్వామి నరసింహాచార్యులుధర్మకర్తల మండలి సభ్యులు అరుణ, జగదీష్ కుమార్, గిరిబాబు, లలిత, కిరణ్ కుమార్, దుర్గ, అరుణ కుమారి, శివయ్య గిరి వెంకట ప్రసాద్ రావు, పద్మావతి. పాల్గొన్నారు.

# అధ్యాపకులు బోధన నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలి

## జేఎన్టీయూకే అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్

**వట్టిచెరుకూరు, మే 11, ప్రభాతవార్త :** అధ్యాపకులు బోధన నైపుణ్యాలను అభివృద్ధి చేసు కోవాలని కాకినాడ జేఎన్టీయూ సిఎస్ఈ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సియస్ఈ (ఏఐ ఎంఎల్) విభాగం ఆధ్వర్యంలో జేఎన్టీయూకే ప్రాయోజకత్వంలో క్వాంటం టెక్నాలజీస్ మరియు ఆటోనోమోస్ ఏఐ ఏజెంట్స్ అంశంపై ఐదు రోజుల పాటు నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్డిపి) సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అధితులుగా జేఎన్టీయూకే సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, విజయవాడ రేయ్ పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ ప్రొఫెసర్ డాక్టర్ పి.సాయికిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ..అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాలు, ఫలితాదారిత విద్య తత్వాన్ని పెంపొందించడానికి బోధన, అభ్యాసన వ్యవస్థ, మరియు ఇతర విద్య ప్రక్రియలలో అధ్యాపకులు తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కీలకమైన ప్రాథమిక, మరియు వృత్తిపరమైన నైపుణ్యాలతో అధ్యాపకులు ముందుండాలని సూచించారు. వృత్తిపరమైన సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి, కొత్త అధ్యాపకులను చేర్చుకొని తీర్చిదిద్దడానికి ఇలాంటి వేదికలు ఎంతో ముఖ్యమని ఉద్ఘాటించారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం అనేది ఆన్లైన్లోనైనా లేదా భౌతిక విధానములోనైనా దానిలో పాల్గొనే వారికి గరిష్ట అభ్యాసన ఫలితాన్ని అందించడానికి ఔచిత్యం, అనుసంధానం మరియు అనువర్తనీయత అనే అంశాలు నిర్ధారిస్థాయని చెప్పారు. ఎఫ్డిపీల కోసం కీలక అవసరాలు అధ్యాపకులకు బోధనాంశాలు సంబంధితంగా ఉండేలా చూసుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. అధ్యాపక



అభివృద్ధి కార్యక్రమాల ద్వారా బోధించే బోధనా పద్ధతులు, విధానాలు లేదా సూత్రాలు వారి అభ్యాసకుల సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని సులభంగా అర్థమయ్యేలా బోధించాలని తెలియజేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ..క్వాంటమ్ టెక్నాలజీస్ మరియు స్వయంచాలక ఏఐ వ్యవస్థల ప్రాముఖ్యత, భవిష్యత్ అవకాశాలు, పరిశోధన రంగాలలో వాటి వినియోగంపై విశ్లేషణాత్మకంగా వివరించారు. ఎఫ్డీపీ కన్వీనర్ డా.జి.మురళి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక రంగాలలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు తమ జ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోనమస్ ఏఐ ఏజెంట్స్ వంటి ఆధునిక అంశాలపై లోతైన అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు, డైరెక్టర్ డాక్టర్. కె.హరిబాబు, కిట్స్ సమన్వయకర్త డాక్టర్.ఎస్.నాగేంద్రం, వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరి భాజపా కార్యాలయంలో జనతా వారధి

**మంగళగిరి,మే11,ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద జనతా వారది కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ప్రధానమంత్రి విశ్వకర్మ



యోజన పథకం ద్వారా తాపీ పనివారు స్వర్ణకారులు, 18 రకాల చేతివృత్తు దారులకు అర్హులైన లబ్ధిదారులకు శిక్షణ ఇప్పించి వారికి ఉచిత పనిముట్లు, వారికి వడ్డీ రాయితీ తో లోన్లు ఇప్పించే ఏర్పాటు చేయవలసిందిగా ఎంపీఎంసీ డిప్యూటీ కమిషనర్ శకుంతలను కలిసి విజ్ఞప్తి చేశారు. ఉండవల్లిలో నిర్మించిన చర్మకార సోదరులు షాపులు కేటాయించమని ఇద్దరు అర్జీలు పెట్టుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా కోస్తాంధ్ర జోనల్ ఇంచార్జ్ మేకల లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు టంకశాల ఈశ్వర్ నాయుడు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బుల్లా రాజారావు, ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి పిల్లి నాగేశ్వరరావు , పట్టణ ఉపాధ్యక్షులు బుద్ధంటి రవికిరణ్ , పట్టణ కోశాధికారి సంగెపు రామ మల్లేశ్వరరావు, ఓబులేశ్వర్రావు, కే నవీన్ ,కర్ణ రోశయ్య, అద్దంకి వెంకటేశ్వరరావు, గార్లపాటి ప్రసాద్ , శానిపాముల జోని బాబు పాల్గొన్నారు

# తొలి భారతీయ మహాత్ముడు జ్యోతిబా పూలే

**మంగళగిరి, మే 11, ప్రభాతవార్త :** జ్యోతిబా పూలే సామాజిక సేవకు గుర్తింపుగా ఆనాటి బొంబాయి మహానగరంలో జరిగిన భారీ బహిరంగ సభలో విఠల్రావు కృష్ణాజీ వందేకర్ 1888 మే 11, ఇదే రోజున



మహాత్మా బిరుదును ప్రధానం చేశారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. సోమవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో తొలిసారి భారత్ లో ఖిఖిమహాత్మాఖిఖిబిరుదు ప్రధానమైన ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూ,పూలే చిత్రపటానికి పలువురు బీసీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ 19 వ శతాబ్దానికి చెందిన ప్రముఖ సంఘసంస్కర్త, విద్యావేత్త,సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబా పూలే అన్నారు. కుల వ్యవస్థ నిర్మూలనకు,స్త్రీ విద్యావ్యాప్తికి వారు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సతీసహగమనానికి,బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వారు పోరాడారన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మేకా వెంకటేశ్వరరావు, ఉప్పాల వెంకట్రావు,దా నా గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

# పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దుటలో తల్లిదండ్రుల పాత్ర కీలకం




**తాడేపల్లి, మే 11, ప్రభాతవార్త:** తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామంలో స్థానిక ఆర్.సీ.యం చర్చి ఆవరణలో సోమవారం గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ , ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల పిల్లలకు రక్షణ కల్పించగలం అనే నినాదం తో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిస్టర్ నీరజ మాట్లాడుతూ పిల్లల పెంపకం అనేది ఒక కళ, వారి వ్యక్తిత్వం, భవిష్యత్తుకు తల్లిదండ్రులు పునాది వేయాలన్నారు. పిల్లలకు ప్రేమ, భద్రత, మంచి విలువలను అందించడం, వారి ప్రవర్తనను అర్థం చేసుకోవడం, భావోద్వేగ మద్దతు ఇవ్వడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడం తల్లిదండ్రుల ప్రధాన బాధ్యత అన్నారు.పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు నూతన మార్గాలు అన్వేషిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జి. లక్ష్మీ ఎ.ఎన్.ఎం,కమ్యూనిటీ ఆర్గనైజర్ పెద్దిపాగ అనీల్ కుమార్ సంస్థ సభ్యులు ఎన్.నాగమణి, అత్తోట పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సిసి క్యాంపులో దంత వైద్య పరీక్షలు



**గుంటూరు విద్య మే 11 ప్రభాతవార్త :** వివిఐటి యూనివర్సిటీ నందు నిర్వహిస్తున్న ఎన్సిసి 2(ఎ) బెటాలియన్ వార్షిక శిక్షణ శిబిరంలో క్యాడేట్లకు సిబార్ దంత వైద్యశాల డాక్టర్లచే ఉచిత దంత వైద్య పరీక్షలు మరియు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. క్యాడెట్లు శారీరక దృఢత్వంతో పాటు నోటి ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని ఆహారపు అలవాట్లు, చిగుళ్ల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు సూచించారు.

MN 11 Final:MN 11 Final 01/01/2001 10:48 Page 1



# ఏఐ ద్వారా వృత్తిలో నైపుణ్యం

## కలెక్టర్ సాయికాంత్ వర్మ

**గుంటూరు, మే 11 ప్రభాత వార్త ప్రతినిధి :** ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ (ఎ.ఐ) వినియోగంతో వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవచ్చని జిల్లా కలెక్టర్



సాయి కాంత్ వర్మ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎ.ఐపై జిల్లా అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ స్వయంగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యూరోక్రాట్ మాత్రమే కాకుండా స్వయంగా టెక్నోక్రాట్ కూడా కావడంతో సవివరంగా, అనుభవ పూర్వకంగా ఎ.ఐ వినియోగం, ప్రయోజనాలు, ఏ స్థాయిలో, ఏ విధంగా వినియోగించుకోవాలి తెలిపారు. ఎ.ఐలో పొందుపరచ కూడని అంశాలను కూడా వివరించారు. ఎ.ఐ వినియోగంతో వృత్తిని సులభంగా నిర్వహించవచ్చని, సమయం ఎంతో అదా అవుతుందని అన్నారు. ఎ.ఐకు కొంత డేటా ఇవ్వడంతో మనకు అవసరమగు రీతిలో ఆఫీస్ నోట్, ఉత్తర ప్రత్యుత్తరాలు అందించగలదని చెప్పారు. ఎ.ఐ అందించిన వివరాలను విధిగా సరిచూడాలని, పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని స్పష్టం చేశారు. ఎ.ఐలో వివిధ కంపెనీలకు చెందిన యాప్ లు ఉన్నాయని, వాటిలో మంచి వివరాలు అందించగల యాప్ ను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, లక్ష్మి కుమారి, శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి తదితరులు

# స్వచ్ఛమైన పరిసరాల కోసం రీసైక్లింగ్ సెంటర్ : మంత్రి మనోహార్

**తెనాలి,మే11,(ప్రభాతవార్త):** తమకు ఉపయోగపడని వస్తువులు వేరొకరు ఉపయోగించుకోవటానికే రీసైక్లింగ్ సెంటర్ లను ఏర్పాటు చేసినట్టు, స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.సోమవారం బుర్రిపాలెం



రోడ్‌లోని మాంటిసోరి స్కూల్ పక్కన ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్ రీసైకిల్-రేస్ ) సెంటర్ ను మంత్రి మనోహర్ ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,పరిశుభ్రమైన తెనాలి పట్టణంలో, పర్యావరణ పరిరక్షణ మరియు వ్యర్థాల సమర్థ నిర్వహణ దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగని, ప్రజలు తమకు అవసరం లేని వస్తువులను ఈ కేంద్రంలో ఇవ్వటం ద్వారా అవి ఇతరులకు ఉపయోగపడతాయని ఆయన సూచించారు.కావున వీటిని సద్వినియోగించుకోవాలన్నారు.పలువురు చిన్నారులకు ఆటవస్తువులు అందించారు.అంతేకాకుండా ఈ సెంటర్ ఏర్పాటు చేయటమే కాదు,నిర్వహణ కూడా జాగ్రత్తగా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

**నూతన సీసీ రోడ్డు పరిశీలించిన మంత్రి నాదెండ్ల:**

అనంతరం,పురపాలకసంఘ పరిధిలోని,బుర్రిపాలెం రోడ్డు గాంధీనగర్ లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు.ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 45రోజుల్లో నూతనంగా సీసీ రోడ్డు నిర్మించామని, ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో జాప్యం లేకుండా, సౌకర్యాలు కల్పిస్తామని, అలాగే రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని, మురుగునీరు పారుదల సక్రమంగా జరిగేట్టు, నూతన డ్రైనేజీ లను నిర్మిస్తామని మంత్రి తెలిపారు. మంత్రి వెంట, మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు,మాజీ కౌన్సిలర్ ఆడుసుమల్లి వెంకటేశ్వరరావు,వట్టికూటి సుబ్బారావు,పలువురు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా,పారదర్శకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తాం : ఎస్పీ

**గుంటూరు క్రైమ్,మే11,ప్రభాతవార్త:**

గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులు, వినతులను స్వీకరించి,ప్రతి అంశాన్ని శ్రద్ధగా పరిశీలించారు.ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యల వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిశీలించి త్వరితగతిన చట్టభద్దంగా పరిష్కరిస్తామని తెలిపారు.బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని,వారి ఫిర్యాదులను త్వరితగతిన



పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు అత్యుత్తమ సంతృప్తి కలిగే విధంగా ఉత్తమమైన పోలీస్ సేవలు అందించడం పోలీస్ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని తెలియచేశారు.గుంటూరు జిల్లా ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీస్ శాఖకు తెలియజేయాలని,వాటి పరిష్కారానికి పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ(అడ్మిన్) జివి రమణమూర్తి, మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి,ట్రాఫిక్ డిఎస్పీ బెల్లం శ్రీనివాస్,సౌత్ డిఎస్పీ మధుసూదన్ రావు,డిఎస్పీ,పిజిఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్ కూడా పాల్గొని,వచ్చిన వినతులను నమోదు చేసి తదుపరి చర్యల కోసం సంబంధిత

# తెనాలి అభివృద్ధి కూటమికే సాధ్యం

## సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

**తెనాలి,మే11,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెనాలి నియోజకవర్గ శాసన సభ్యులు, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రివర్యులునాదెండ్ల మనోహార్ పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని బోస్ రోడ్డు నుంచి చినరావూరు పార్క్ వరకు రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్నమెంటల్ సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను సోమవారం సాయంత్రం మంత్రి నాదెండ్ల మనోహార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ, పట్టణ సౌందర్యవృద్ధితో పాటు ప్రజలకు రాత్రి వేళల్లో మరింత భద్రత, సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ ఆధునిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోస్ రోడ్డుకు నూతన వెలుగులు తీసుకువచ్చే ఈ ఆర్నమెంటల్ లైటింగ్ తెనాలి పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అన్నారు.అదేవిధంగా త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వి.ఎస్.ఆర్ కాలేజ్ సమీపం నుంచి ఆటోనగర్ వరకు రెండు కిలోమీటర్ల మేర దాదాపు రూ.1.50 కోట్ల వ్యయంతో ఇదే తరహా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో కొత్తగా నిర్మించబోయే మున్సిపల్ భవనం పరిసర ప్రాంతాల్లో కూడా ఆధునిక సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి తెనాలి పట్టణాన్ని మరింత సుందరీకరించనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహార్ వెల్లడించారు.అదేవిధంగా తెనాలి నియోజకవర్గ



అభివృద్ధిలో భాగంగా మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పోలీసు అధికారులతో కలిసి తీసుకున్న నిర్ణయం మేరకు పట్టణంలోని పలు ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం, పట్టణ అభివృద్ధిని వేగవంతం చేయడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెనాలి పట్టణంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నగరంలో వార్డుల వారీగా ప్రత్యేక అధికారుల నియామకం

-మెరుగైన సేవలు ప్రజలకు అందేలా పర్యవేక్షణ
-నగర కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాలు

**గుంటూరు కార్పొరేషన్, మే 11, ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన సేవలు అందేలా పర్యవేక్షణకు వార్డ్ ప్రత్యేక అధికారుల నియామకం చేపట్టడం జరుగుతుందని నగర కమిషనర్ మయూర్ అశోక్ తెలిపారు. గుంటూరు





మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డుల వారీగా నియమించిన ప్రత్యేక అధికారులు రెవెన్యూ, పారిశుద్ధం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల పనులు సమర్ధవంతంగా పర్యవేక్షణ చేయాలనే లక్ష్యం తో ప్రతి వార్డులో వార్డ్ లెవల్ పర్యవేక్షణ కమిటీలను 2 రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వార్డ్ స్పెషల్ ఆఫీసర్స్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ ప్రత్యేక అధికారులు వార్డు సచివాలయాల పనితీరును పర్యవేక్షించడంతో పాటు ప్రభుత్వ సర్వేలు, ఎన్నికల పనులు, జనగణన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పారిశుధ్య విభాగంలో వార్డుల శుభ్రత, స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమాలు, సాసా కార్యక్రమాల అమలు పర్యవేక్షి ంచాలని ఆదేశించారు. రెవెన్యూ విభాగంలో పన్నుల వసూళ్లు, షాపింగ్ కాంప్లెక్స్ లు, మార్కెట్లు, ఫంక్షన్ హాళ్ల అద్దెల వసూళ్లపై దృష్టి పెట్టాలని, ప్రజా ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఉపా సెల్ పరిధిలో టిడ్కో హౌసింగ్ రుణాలు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్, ఇతర సంక్షేమ పథకాల అమలును సమర్ధవంతంగా పర్యవేక్షి ంచాలన్నారు. ఇంజినీరింగ్ విభాగం తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, టౌన్ ప్లానింగ్ విభాగం నిర్మాణ వ్యర్థాల తొలగింపు, అనధికార బ్యానర్లు, ఫ్లెక్సీల తొలగింపుపై చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారులు రోజువారీగా వార్డుల్లో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారానికి సంబంధిత శాఖాధిపతులతో సమన్వయం చేసుకోవాలన్నారు. శాఖాధిపతులు కూడా ప్రత్యేక అధికారులు సూచించిన లోపాలపై తక్షణ చర్యలు తీసుకుని అమలు నివేదికలను కమిషనర్ కార్యాలయానికి అందించాలన్నారు. క్షేత్ర స్థాయి విధుల్లో నిరక్ష ్యం చేసే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ (ఇంచార్జి) జి.సాంబశివరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, ఈఈ

# మహిళ పోలీస్ స్టేషనులో పిర్యాదు చేయటంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కొల్లిపర,మే 11 ప్రభాతవార్త: సహజీవనం చేస్తున్న మహిళ పోలీస్‌స్టేషనులో పిర్యాదు చేయటంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన ఆదివారం మండల కేంద్రం కొల్లిపరలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపరకు చెందిన పిల్లి ఆనంద్ భార్య మృతి చెందింది.దీంతో కొంత కాలంగా ఆనంద్ అదే గ్రామానికి చెందిన మరో మహిళతో సహజీవనం సాగిస్తున్నాడు,.కొద్ది రోజులుగా ఆమె ప్రవర్తనపై అనుమానంతో ఆనంద్ ప్రశ్నించసాగాడు,ఆమె పిల్లి ఆనంద్ వేదింపులకు గురి చేస్తున్నట్లు కొల్లిపర పోలీసస్టేషన్‌లో పిర్యాదు చేసింది.ఇది తెలుసుకున్న ఆనంద్ ఆందోళనకు గురై తన వెంట తెచ్చుకున్న బ్లేడుతో మాయాబజార్ సెంటర్‌లో ఆదివారం రాత్రి గొంతు కోచుకున్నాడు.ఇది గుర్తించిన స్థానిక లు వెంటనే అతనిని కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స చేసి వైద్యుల సూచనల మేరకు 108 ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.దీనిపై కొల్లిపర పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



# వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో నేర సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎస్పీ

**గుంటూరు క్రైమ్,మే11,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు సోమవారం మధ్యాహ్నం2గంటల నుంచి4గంటల వరకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమన్స్ అమలు పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి,పెండింగ్ సమన్స్ ను త్వరితగతిన అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అలాగే రౌడీషీటర్ల బైండ్ ఓవర్ చర్యలు,వారి కదలికలు,ప్రస్తుతం వారు ఇన్వాల్వ్ అయిన కేసుల వివరాలు,కేసుల స్థితిగతులను ప్రతి పోలీస్ స్టేషన్ వారీగా అడిగి తెలుసుకొని,నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.ఎక్కువ కేసుల్లో ప్రమేయం ఉన్నప్పటికీ ఇంకా రౌడీషీట్ ఓపెన్ చేయని వ్యక్తులపై వెంటనే రౌడీషీట్లు ఓపెన్ చేసి,చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.టాప్10 నేరస్తుల జాబితాకు సంబంధించిన ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిమినల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని,వారి కదలికలు,కేసుల పురోగతి,బెయిల్ పరిస్థితులు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ సూచించారు.కొత్తగా నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించిన ఎస్పీ సాధారణ కేసులను 60 రోజుల్లోగా,గ్రేవ్ కేసులను 90 రోజుల్లోగా చార్జిషీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. టెక్నికల్ కారణాలు మినహా దర్యాప్తులో ఎటువంటి నిరక్ష్యం సహించబోమని హెచ్చరించారు. అదేవిధంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులపై జరిగే నేరాల పట్ల సున్నితంగా వ్యవహరించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సీసీటీవీ కెమెరాల వినియోగం,బీట్ పోలీసింగ్,రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి నేర నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధవంతంగా వినియోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.సైబర్ నేరాలు,డ్రగ్స్,గంజాయి రవాణా,పేకాట,అక్రమ మద్యం,ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీస్ అధికారులతో పాటు అన్ని సబ్ డివిజన్ అధికారులు,సీఐలు, ఎస్ఐలు,సంబంధిత పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..




# నేడు అల్పపీడనం ముప్పు

**వట్టిచెరుకూరు, మే 11, ప్రభాతవార్త :** నేడు జిల్లాకు అల్పపీడనం ముప్పు పొంచి ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సోమవారం వెల్లడించింది. బిహార్ నుంచి ఒడిశా,ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా కోస్తాంధ్ర తీరప్రాంతం వరకు ద్రోణి కొనసాగుతుందని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.శ్రీలంకల్లో విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాబోయే 24 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు.వీటి ప్రభావంతో కోస్తాంధ్రలో గురువారం వరకు విస్తృతంగా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. నేడు మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. గంటకు 3050 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. పాత భవనాలు, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడరాదని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములతో వర్షం పడేటప్పుడు రైతులు, పశు కాపరులు చెట్ల కిందకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.



# సరస్వతీ రాజ్ అయ్యర్‌కు అరుదైన గౌరవం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మే11,ప్రభాతవార్త: ఏఎన్‌యుల సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగాం ప్రొఫెసర్ ఆచార్య సరస్వతీ రాజు అయ్యర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఎండల్ అసోసియేషన్స్ ఇంటర్నేనల్ కన్సల్టింగ్ వారి గ్లోబల్ రోస్టర్ ఆఫ్ జెండర్ ఎక్స్‌పర్ట్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు ఆ సంస్థ డైరెక్టర్, వ్యవస్థాపకులు నికోలా, లీ నుంచి ఆమెకు నియామకం పత్రం అందింది. లింగ సమానత్వం, శాంతి, భద్రత ఎజెండా పట్ల తమ నిబద్ధతలను నిలబెట్టుకోవడానికి, వృత్తిపరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి, ఇతర సంబందిత భాగస్వాములకు మద్దతు కోసం ఈ సంస్థ 2019లో బెర్లిన్‌లో ఏర్పాటైంది. ఈ సందర్భంగా వీసి ఆచార్య కె.గంగాధరరావు అయ్యర్‌ను అభినందించారు. ఇటువంటి హోదా వర్సిటీకి కూడా గర్వకారణమన్నారు. ఈ సందర్భంలో ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె.మధుబాబు తదితరులు అయ్యర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణి చేసిన ఎమ్మెల్యే

**నరసరావుపేట, మే 11 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు చేతుల మీదుగా నలుగురు వికలాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. వారి స్వయం ఉపాధికి, సంచారానికి అవసరమైన సదుపాయాలు కల్పించడం తమ ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జిల్లావ్యాప్తంగా 78 బస్సులకు రవాణా శాఖ నోటీసులు

**గుంటూరు లీగల్, మే 11 (ప్రభాతవార్త):** భద్రత ప్రమాణాలు లేని 78 వాహనాల యజమానులకు నోటీసులు జారీచేసినట్లు గుంటూరు రవాణా శాఖ ఉప కమిషనర్ కె.సీతారామిరెడ్డి వెల్లడించారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో భాగంగా, జిల్లావ్యాప్తంగా పాఠశాల, కళాశాల బస్సుల భద్రత ప్రమాణాలను సోమవారం నుండి మోటారు వాహన అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఆయా బస్సులు ప్రయాణించడానికి ఉన్న అనుకూలతలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గుర్తించిన లోపాలను సరిదిద్ది బస్సులను సిద్ధం చేసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. 284 స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. యాజమాన్యాలు ప్రమాణాలను పాటించి ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ సెంటర్ల వద్ద ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందవలసినదిగా సూచించారు.



# ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

**చిలకలూరిపేట, మే 11, ప్రభాతవార్త:** ఆర్టీసీ డ్రైవర్‌పై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటన చిలకలూరిపేట డిపోకు చెందిన డ్రైవర్ గంటూరు నుంచి సుమారు 70 మంది ప్రయాణికులతో బస్సు ను తీసుకుని బయలుదేరారు. మార్గమధ్యంలో చౌడవరం వద్ద ప్రయాణికులు దిగాల్సి ఉండగా, అక్కడ వర్షం కురుస్తుండటంతో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు ను కొంచెం ముందుకు తీసుకెళ్లి ఆపేందుకు డ్రైవర్ ప్రయత్నించారు. ఈ క్రమంలో ఒక వ్యక్తి అకస్మాత్తుగా బస్సు కు అడ్డంగా రావడంతో కండక్టర్ మరియు డ్రైవర్ అతడితో మాట్లాడారు. అయితే, బస్సు ఎందుకు ఆపలేదని ఆగ్రహించిన సదరు వ్యక్తి, తన అనుచరులతో కలిసి డ్రైవర్‌పై దాడికి దిగాడు. దాదాపు 10 మందికి పైగా వ్యక్తులు డ్రైవర్‌ను, కండక్టర్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తూ విచక్షణారహితంగా కొట్టారని ఈ దాడిలో డ్రైవర్ తీవ్ర అస్వస్థతకు గురై, బీపీ పడిపోవడంతో స్పృహ కోల్పోయారు. వెంటనే సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది బాధితుడిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన వ్యక్తులు కండక్టర్ ఫోన్‌లోని వీడియోలను బలవంతంగా డిలీట్ చేయించడమే కాకుండా, డ్రైవర్ లైసెన్స్ జిరాక్స్ తీసుకుని బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు



# వీధి విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలి

**చిలకలూరిపేట, మే 11, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయుడు శివకుమార్ పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్ మేనేజర్ కు, మెప్మా అధికారులకు ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భం గా రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయుడు శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చినటువంటి జీవో కు అనుగుణంగా వీధి విక్రయదారులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనేకమంది ప్రజలు తమ జీవన భృతి కోసం వీధివిక్రయదారులుగా మారి జీవనాన్ని కొనసాగిస్తున్న తరుణంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వేములకొండ వెంకటేశ్వర్లు, మారు బోయిన శ్రీనివాసరావు, మేకపోతుల శ్రీనివాసరావు , బొంతా భగత్ సింగ్ తదితరులు ఉన్నారు.



# ఇరువురు వ్యక్తులు అరెస్ట్

గుంటూరు క్రైమ్,మే11,ప్రభాతవార్త:

ఆన్లైన్లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఇరువురి వ్యక్తులను అరండల పేట పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం అరండలపేట పోలీస్ స్టేషన్ పరిధి నందు ఆదివారం రాత్రి 08:00 గం"లకు అరండల్ పేట, వసంతరాయపురం మెయిన్ రోడ్డు సెలూన్ షాప్ లో అంన్లైన్ లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారన్న సమాచారంతో టాస్కోఫర్స్,ఎస్బి



సమాచారం మేరకు ఎస్బి డిఎస్పీకి తెలియపరచి టాస్కోఫర్స్ సీఐ ఆదేశాల మేరకు అరండలపేట శీ! ఏడుకొండలు, అరండలపేట శీతీ వారితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పిల్లుట్ల.నరసింహారావు,దొప్పలపూ.ఆనంద్ అను ఇరువురు ఆన్లైన్ లో బెట్టింగ్ ఆడుతున్నారు. వీరిలో నరసింహారావు అనే అతని సెల్ఫోన్ చెక్ చేయగా యాప్ వ్యాలెట్ లో 5,466/ రూపాయలు ఉన్నాయి. అతని వద్ద 15,830/రూపాయలు ఉన్నవి.ఇరువురు వ్యక్తులు,1 సెల్ ఫోన్,15,830/ రూపాయలు సీజ్ చేసి తదుపరి విచారణ కొరకు అరండలపేట పోలీస్ స్టేషన్ కి అప్పగించడం

# విద్యార్థికి ఘనసత్కారం

**గుంటూరు క్రైమ్,మే11,ప్రభాతవార్త:** గుంటూరు ఎస్‌బి డీఎస్పీ కార్యాలయంలో, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలానికి చెందిన పదవ తరగతి విద్యార్థి బొందిగా మోహన్ కృష్ణను సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయన పదవ తరగతి పరీక్షల్లో 587 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో



నిలిచాడు.బొందిగా మోహన్ కృష్ణ తండ్రి వెంకటేశ్వర్లు,పెదనందిపాడు మండలం రావిపాడు గ్రామ నివాసి.ఈ సందర్భంగా ఎస్‌బి డీఎస్పీ అలహరి శ్రీనివాసులు,పత్తిపాడు సీఐ శ్రీనివాసరావు విద్యార్థిని అభినందించి సన్మానించారు. నగదు పురస్కారాన్ని ఏఎస్ఐ మైల సాంబశివరావు అందజేశారు.పత్తిపాడు మండలంలోని పత్తిపాడు గ్రామంలో ఉన్న శ్రీనివాస్ హైస్కూల్‌లో చదువుతున్న బొందిగా మోహన్ కృష్ణ 587 మార్కులు సాధించి మండలంలో ప్రథముడిగా నిలవడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు ఆనందం వ్యక్తం చేస్తూ

## ఉప్పల్ స్టేడియంలో
# హైదరాబాద్ సన్‌రైజింగ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్.. సొంతగడ్డపై ఇరగదీసింది.సొంతగడ్డ ఇచ్చిన విజయాల బూస్టింగ్‌తో హైదరాబాద్ వెలుపల జరిగిన మ్యాచ్‌ల్లోనూ విజయాలు అందుకుంది. ఉప్పల్ స్టేడియం ఈ సీజన్‌లో లక్కీగా నిలిచింది. 6 మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు అందుకుంది. ఇక హైదరాబాద్ వెలుపల సన్‌రైజర్స్ ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడితే మూడింటిలో నెగ్గింది. ఇంటా బయటా రెండేసి పరాజయాలు ఎదుర్కొంది. నేటి మ్యాచ్‌తో కలుపుకుని మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా, అందులో ఒకటి ఉప్పల్ స్టేడియంలో, రెండు హైదరాబాద్ వెలుపల ఆడనుంది. ఈ మూడింటిలో రెండు నెగ్గినా సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్లే ఆఫ్ బెర్త్ ఖాయం.

1 **చిన్నస్వామి స్టేడియం బెంగళూర్**
ఫలితం : 6 వికెట్ల తేడాతో ఓటమి
ఆర్సీబీ-203/4, ఎస్ఆర్‌హెచ్ -201/9

2 **ఈడెన్ గార్డెన్స్ కోల్‌కతా**
ఫలితం: 65 పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-226/8, కేకేఆర్-161

3 **ఉప్పల్ స్టేడియం హైదరాబాద్**
ఫలితం: 5 వికెట్ల తేడాతో ఓటమి
ఎస్ఆర్‌హెచ్- 156/9, లక్నో-160/5

4 **న్యూ చండీఘర్ స్టేడియం**
ఫలితం: ఆరు వికెట్ల తేడాతో ఓటమి
ఎస్ఆర్‌హెచ్ -219/6, పంజాబ్-223/4

5 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 57పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-216/6, రాజస్థాన్- 159

6 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: పది పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్- 194/9, సీఎస్‌కే -184/8

7 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 47 పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-242/2, ఢిల్లీ- 195/9

8 **సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం, జైపూర్**
ఫలితం: 5వికెట్ల తేడాతో విజయం
రాజస్థాన్-228/6, ఎస్ఆర్‌హెచ్ 229/4

9 **వాంఖడే స్టేడియం, ముంబై**
ఫలితం: 6 వికెట్ల తేడాతో విజయం
ముంబై -243/5, ఎస్ఆర్‌హెచ్-249/4

10 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 7 వికెట్ల తేడాతో ఓటమి
ఎస్ఆర్‌హెచ్-165, కేకేఆర్: 169/3

11 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 33 పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-235/4, పంజాబ్-202/7



# టాప్-2 కోసం టఫ్ ఫైట్

## ఆహ్మదాబాద్‌లో నేడు గుజరాత్ టైటాన్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్

**ఆహ్మదాబాద్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ నిర్ణయాత్మక దశకు చేరుకుంది. ప్లే ఆఫ్ బెర్త్ దక్కించుకోవాలంటే ఇక ఇక్కడి నుంచి అన్ని జట్లకే గెలుపే పరమావధిగా మారింది. ఈ పరిస్థితుల్లో 14పాయింట్లతో పాయింట్లపట్టికలో రెండోస్థానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్..నేడు కీలక మ్యాచ్ ఆడనుంది.ఆహ్మదాబాద్ నరేంద్రమోదీ స్టేడియం వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. సొంతగడ్డపై విక్టరీతో ఆహ్మదాబాద్ వచ్చిన పాట్ కమిన్స్ సేన... ఇక్కడా గెలుపుతో ప్లే ఆఫ్ బెర్త్ ఖాయం చేసుకోవాలన్న పట్టుదలతో ఉంది.

శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ ఈ సీజన్‌ను నెమ్మదిగా ప్రారంభించినప్పటికీ... రాజస్థాన్ రాయల్స్‌పై 77పరుగుల భారీ విజయంతో సహా వరుసగా నాలుగు విజయాలతో పుంజుకుంది. ఫుల్‌జోష్‌తో సొంతగడ్డపై మ్యాచ్‌కు సిద్ధమైంది. గుజరాత్ ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో సమవుజ్జీగా ఉంది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ చక్కని ఫామ్‌లో ఉన్నారు.ఇద్దరూ గుజరాత్‌కు ఫ్లయింగ్ స్టార్ట్‌లు అందిస్తున్నారు.మరోసారి అలాంటి శుభారంభం లభిస్తే గుజరాత్‌కు తిరుగుండదు.ఇక మిడిల్ ఆర్డర్‌లో జోస్ బట్లర్, వాషింగ్టన్ సుందర్‌లపైనే ఎక్కువగ ఆధారపడుతోంది. ఈ నలుగురిలో ఇద్దరూ విఫలమైనా బ్యాటింగ్ పేకమేడను తలపిస్తోంది. వారి బౌలింగ్ దళం కూడా అంతే పటిష్టంగా ఉంది. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మహమ్మద్ సిరాజ్, రబడ పవర్ ప్లేలోనే వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్ల పతనాన్ని శాసిస్తున్నారు. మధ్య ఓవర్లలో రషీద్ ఖాన్ మ్యాచ్ మలుపు తిప్పే స్పెల్స్ చక్కగా తోడవుతున్నాయి.

ఇక పంజాబ్ కింగ్స్‌పై 4 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు సాధించి, 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించడం ద్వారా ఆరేంజ్ ఆర్మీ సరైన సమయంలో సరైన లయను అందుకుంది. ఇది సన్‌రైజర్స్ బ్యాటింగ్ సామర్థ్యాన్ని స్పష్టం చేస్తోంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిక్ క్లాసెన్‌లతో కూడిన టాప్‌ఆర్డర్ ఫైరింగ్‌లో ఉంది. అత్యంత విధ్వంసకర బ్యాటింగ్ యూనిట్లలో ఒకటిగా చాటుకుంది. అత్యంత దూకుడు వల్లే ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ 200 ప్లస్ స్కోర్లు సాధిస్తూ వస్తోంది. ముంబై ఇండియన్స్‌పై అత్యధికంగా 249 పరుగులతో సహా ఏకంగా ఎనిమిది సార్లు 200 ప్లస్ స్కోర్లు చేసింది. స్లాగ్ ఓవర్లలో సూపర్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి తన బ్యాటింగ్‌తో మెస్మరైజ్ చేస్తున్నాడు. సన్‌రైజర్స్ ఓడిన మ్యాచ్‌లన్నీ దాదాపు బ్యాటింగ్ వైఫల్యంతోనే. నిర్లక్ష్యం దరిచేరకుండా బ్యాటింగ్ కొనసాగిస్తే సన్‌రైజర్స్‌కు తిరుగుండదు. బౌలింగ్ దళం ప్రత్యర్థిని కట్టడిచేసే స్థాయిలో ఉంది. గాయం కారణంగా మొదటి అర్ధ భాగానికి దూరమైన కమిన్స్..తిరిగి జట్టులో చేరిన తర్వాత బౌలింగ్ అటాక్ బలంగా మారింది. శ్రీలంకన్ పేసర్ మలింగ ఈసీజన్‌లో అద్భుతంగా బౌలింగ్ చేస్తూ ప్రతి మ్యాచ్‌లో వికెట్లు అందిస్తున్నాడు. యంగ్ పేస్ గన్ సాకిబ్ హుస్సేన్ అదనపు బలంగా మారాడు. శివంగ్ కుమార్, రవిచంద్రన్ రూపంలో స్పిన్ వేరియేషన్ ఉంది.




**హెడ్ టు హెడ్**

సన్‌రైజర్స్‌పై గుజరాత్ టైటాన్స్ పైచేయిగా ఉంది. ఇరుజట్లు ఏడు మ్యాచ్‌ల్లో తలపడితే గుజరాత్ అయిదింటిలో నెగ్గింది. సన్‌రైజర్స ఒకే ఒక మ్యాచ్ 2022లో గెలుపొందింది. ఒక మ్యాచ్ రద్దయింది. 2025 సీజన్‌లో రెండు సార్లు కూడా గుజరాత్ టైటాన్స్ నెగ్గింది. ఈ సీజన్‌లో ఇరు జట్లు తొలిసారి ఢీకొంటున్నాయి.

**గుజరాత్ టైటాన్స్(అంచనా):** సుదర్శన్, గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్, సుందర్, హోల్డర్, తెవాటియా, నిశాంత్, రషీద్ ఖాన్, అర్షద్, కగిసో రబడ, సిరాజ్; **ఇంపాక్ట్ ప్లేయర్:** కిషోర్

**సన్‌రైజర్స్ హైదరాబాద్ (అంచనా):** అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, క్లాసెన్, నితీష్ రెడ్డి, సలీల్, రవిచంద్రన్, పాట్ కమిన్స్ (కెప్టెన్), శివంగ్ కుమార్, మలింగ, సాకిబ్ హుస్సేన్; **ఇంపాక్ట్ ప్లేయర్:** హర్ష్ దూబే



# వన్డే ర్యాంకుల్లో టీమిండియా టాప్

**ముంబై:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా 118పాయింట్లతో మరోసారి నెంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. న్యూజిలాండ్ 113 పాయింట్లతో రెండో స్థానంలో నిలవగా, 109 పాయింట్లతో ఆస్ట్రేలియా మూడో ప్లేస్ లో కొనసాగుతోంది. అద్భుతమైన ప్రదర్శనలతో సౌతాఫ్రికా 102 పాయింట్లతో 4వ స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో పాకిస్థాన్(98)ని వెనక్కి నెట్టింది. శ్రీలంక(96), అఫ్గానిస్థాన్(93), ఇంగ్లాండ్(89), బంగ్లాదేశ్(84), వెస్టిండీస్(74)ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అలాగే ఐర్లాండ్ 54 పాయింట్లతో 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టేసింది. జింబాబ్వే 53 పాయింట్లతో 12వ స్థానంలో ఉంది. మరోవైపు అమెరికా 46 పాయింట్లతో 13వ స్థానానికి ఎగబాకి స్కాట్లాండ్ కంటే ముందుకు వచ్చింది. కాగా ఐసీసీ ప్రకటించిన రూల్స్ ప్రకారం 2027 మార్చి 31వ తేదీ నాటికి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ -8లో నిలిచే జట్లు నేరుగా వన్డే వరల్డ్ కప్ 2027కు అర్హత సాధించనున్నాయి. ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వే ఇప్పటికే టోర్నీకి నేరుగా అర్హత పొందినప్పటికీ, దక్షిణాఫ్రికా టాప్8లోనే కొనసాగితే మరో టీమ్ కి ఛాన్స్

# పంజాబ్‌కు నాలుగో ఓటమి : గెలిచి నిలిచిన ఢిల్లీ

**ధర్మశాల:** ఐపీఎల్ 2026లో పంజాబ్ ఖాతాలో వరుసగా నాలుగో ఓటమి చేరింది. ఢిల్లీ క్యాపిటల్స్ కీలక పోరులో మూడు వికెట్లతో గెలుపొందింది. 211 పరుగుల భారీ టార్గెట్‌ను మరో ఓవర్ మిగిలి ఉండగానే అందుకుని ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. అయిదో విజయంతో పది పాయింట్లకు చేరుకుంది.

భారీ లక్ష్య చేధనలో ఢిల్లీ ఆరంభంలో తడబడింది. కేఎల్ రాహుల్(9)ను అవుట్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికిన అర్షదీప్ సింగ్.. అదే ఊపులో సాహిల్ ఫారిఖ్(13)ను కూడా పెవిలియన్ పంపాడు. మరో ఎండ్‌లో అభిషేక్ పోరెల్(5)ను యష్ ఠాకూర్ క్లీన్ బౌల్డ్ చేయగా, ట్రిస్టన్ స్టబ్స్(13) కొన్నొలీ అద్భుత త్రోకు రనౌట్ అయ్యాడు. దీంతో ఢిల్లీ 74 రన్స్‌కే 4 వికెట్లు కోల్పోయింది, ఈ దశలో కెప్టెన్ అక్షర్ పటేల్(30 బంతుల్లో 56), డేవిడ్ మిల్లర్(28 బంతుల్లో 51) ధాటిగా ఆడుతూ విజయానికి బాటలు వేశారు.చివర్లో అశుతోష్(24),మాధవ్ తివారీ(18) మెరుపు బ్యాటింగ్‌తో ఢిల్లీకి విజయాన్ని ఖాయం చేశారు.







టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య(33 బంతుల్లో 56; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(18)అదిరే ఆరంభాన్ని ఇచ్చారు. ఇన్నింగ్స్ మొదటి ఓవర్ లోనే రెండు సిక్సర్లు, ఒక ఫోర్, 5 వైడ్లతో కలిపి ఏకంగా 22 పరుగులు రాబట్టారు. ఈ క్రమంలోనే పంజాబ్ కింగ్స్ కేవలం 2.4 ఓవర్లలోనే 50 పరుగుల మైలురాయిని అందుకుంది. ఇక క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే బాదుడు మొదలు పెట్టిన ప్రియాంష్ ఆర్య కేవలం 24 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేశాడు. ఓపెనర్లు అవుటైన తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(36 బంతుల్లో 59; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కూపర్ కొన్నోలీ(38) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 83 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని జోడించారు. కొన్నోలీ అవుటైన తర్వాత మార్కస్ స్టోయినిస్, శశాంక్ సింగ్‌లను స్టార్క్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు.ఒకవైపు వికెట్లు పడుతున్నా శ్రేయస్ అయ్యర్ నిలకడగా ఆడి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. చివర్లో సూర్యాంశ్ షెడ్జ్(8 బంతుల్లో 21) భారీ షాట్లతో విరుచుకుపడటంతో పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 210కి చేరుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, మాధవ్ తివారీ తలో రెండు వికెట్లు తీసుకోగా, ముకేష్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు.




## మార్కెట్లపై ప్రధాని మోడీ ప్రకటన ఒత్తిళ్లు
# జ్యుయెలరీ షేర్లు భారీ పతనం
# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, మే 11:** ఇరాన్ శాంతిప్రతిపాదనలకు ట్రంప్ నో చెప్పడం, ప్రధాని మోడీ బంగారం కొనవద్దని, పెట్రోడీజిల్ వాడకం పొదుపు చేయాలని కోరుతూ చేసిన ప్రకటనలు స్టాక్ మార్కెట్లను ముంచేసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 1312.91 పాయింట్లు క్షీణించి 76,015.28 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 360.30 పాయింట్లు క్షీణించి 23,815.85 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగించింది మూడు ట్రేడింగ్ సెషన్లలోను సెన్సెక్స్ 2.5శాతం, నిఫ్టీ సూచీ 2.1శాతం క్షీణించింది. భారతి ఎయిర్‌టెల్ 4.18శాతం, రిలయన్స్ 3.31 శాతం, హెచ్‌డిఎఫ్‌సి 2.13శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో ట్రేడింగ్ టర్నోవర్ ఒక్కరోజే ఆరులక్షలకోట్లు క్షీణించినట్లుతేలింది. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ కూడా 1.26శాతంక్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.96శాతం దిగజారింది.

మార్కెట్లపరంగా బిఎస్ఇలో కేవలం 1358 కంపెనీలు మాత్రమే పెరిగాయి.మూడువేల కంపెనీల షేర్లు క్షీణించాయి.192షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 95.31వద్ద ముగిసింది.ముందురోజు చెలామణి 94.49వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ సెటిల్‌మెంట్లు రూ.1,51,975కి చేరాయి.కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు జులై సెటిల్‌మెంట్ దరలు 2.25 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 103.54 డాలర్లుగా కొనసాగింది. విదేశీ మార్కెట్లపరంగా ఎస్అండ్‌పి 500సూచీ 0.84శాతంపెరిగింది. నాస్‌డాక్ కాంపోజిట్ 1.71శాతంపెరిగితే డౌజోన్స్ పారిశ్రామిక సగటు 12.19 పాయింట్లు పెరిగింది. వ్యవసాయేతర ఉపాధి కొలువులు 1.15 లక్షలుగా ఉన్నట్లు తేలింది.55వేల వరకూ ఉంటాయన్న అంచనాలను అధిగమించింది. అమెరికా నిరుద్యోగిత రేటు 4.3శాతంగా ఉంది.

ఇక ప్రధానిమోడీ చేసిన ప్రకటనతో జ్యూయెలరీ షేర్లుభారీ పతనం చెందాయి. ఏడాదిపాటు బంగారం కొనవద్దంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలు జ్యుయెలరీ, బంగారం కంపెనీలపై భారీ ఒత్తిడిని తెచ్చాయి. కల్యాణ్ జ్యుయెలర్స్ 9.23శాతం, సెన్‌కో గోల్డ్ 8.61శాతం క్షీణిస్తే టైటాన్ కంపెనీ 6.83శాతం, స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ 6.63శాతం క్షీణించాయి. తంగమయిల జ్యుయెలరీ 5.69శాతం, పిసి జ్యూయెలరీస్ 4.94 శాతం చొప్పున క్షీణించాయి. ఎయిర్‌లైన్స్‌లో ఇండిగో స్టాక్ 4.94శాతం, స్పైస్‌జెట్ 4.72శాతం క్షీణించింది. ఎంసిఎక్స్ ఇండియా 2.92శాతం పెరిగింది.టాటాకన్స్యూమర్ ప్రొడక్ట్స్ 8.32శాతం, బిర్లా కార్పొరేషన్ 7.15శాతం, డ్రీమ్‌వెల్ నార్టన్ 6.61శాతం, కెనరాబ్యాంకు3.72శాతం, ఉత్కర్ష్ స్మాల్‌ఫైనాన్స్ 8.38శాతం చొప్పున క్షీణించాయి.బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్ సైతం7.40శాతం,ఆర్తి సర్ఫాక్టెంట్ 10.82శాతం పతనం అయ్యాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.97శాతం పెరిగాయి.




# పెట్రోడీజిల్, గ్యాస్ ధరల పెంపు?

**ముంబయి, మే 11:** ఇంధనం, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించుకోవాలని, ప్రజా రవాణాను, కార్ పూలింగ్‌ను ఉపయోగించుకోవాలని ప్రధాని మోడీ చేసిన సూచనలు ఇంధన ధరల పెంపును స్పష్టంచేస్తున్నాయి. వర్క్ ఫ్రమ్ హోం, ఆన్‌లైన్ మీటింగ్స్ పెట్టుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించుకోవాలని, కార్ల వినియోగం తగ్గించుకుని మెట్రో వంటి పబ్లిక్ రవాణా వ్యవస్థల్ని వాడుకోవాలని సూచించారు.మోడీ వ్యాఖ్యల నేపథ్యంలో దేశ ప్రజలకు పెట్రోల్, డీజిల్, గ్యా ధరలు పెరగబోతున్నాయని తెలిసింది. ఇక పశ్చిమాసియా యుద్ధం కారణంగా చమురు, గ్యాస్ సంక్షోభం తలెత్తింది. చమురు సంస్థలకు రోజుకు వెయ్యి కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికే లక్షల కోట్లు నష్టం వాటిల్లింది. దీంతో ధరలు పెంచాలని కేంద్రాన్ని ఒత్తిడి చేస్తున్నాయి. మంత్రిత్వ శాఖల మధ్య చర్చల నేపథ్యంలో ఇంధన ధరల పెంపు భారీగా ఉండొచ్చని వార్తలు వస్తున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరల పెంపుపై ఆలోచనలు ప్రారంభించింది. ప్రస్తుతం ఈ త్రైమాసికంలో ఆయిల్ కంపెనీల అండర్ రికవరీలు రూ.2 లక్షల కోటకు చేరే అవకాశం ఉందని, అందులో సుమారు రూ.1 లక్ష కోట్ల నష్టం వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. 24 గంటల్లోనే చమురు ధరలు పెరగవచ్చని వార్తలొస్తున్నాయి. ఆర్థిక, పెట్రోలియం మంత్రిత్వ శాఖలు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పెంపు సమయం ప్రపంచ ముడి చమురు పోకడలు, ద్రవ్యోల్బణం, ఆర్థిక ఒత్తిళ్లు, ఇంధన ధరలను సమతుల్యం చేయడానికి ప్రభుత్వం తీసుకునే విధానంపై ఆధారపడి ఉంటుందని వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ముడి చమురు, గ్యాస్, ఎల్పీజీలను అధిక ధరకు కొనుగోలు చేస్తున్నప్పటికీ, వినియోగదారులను ఆదుకునేందుకు తుది ఉత్పత్తులను తక్కువ ధరకు అమ్ముతున్నాయని దీనివల్ల రోజుకు రూ. 1,000 కోట్ల వరకు నష్టాలు వస్తున్నాయని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. పెరుగుతున్న నష్టాలను పూడ్చుకోవడానికి ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే అవకాశం ఉందని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి.

# 28 బోగస్ యాప్‌లు తొలగించిన గూగుల్

**ముంబయి, మే 11:** కాల్ హిస్టరీ వెల్లడిస్తామని, మీకు కాల్ చేసిన వ్యక్తుల వివరాలను అందిస్తామనే హామీతో ఈ స్పామ్ యాప్‌లను లక్షలాది మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ నకిలీ యాప్‌లకు కాల్ ఫాంటమ్ అని నామకరణం చేసారు.ఈ యాప్‌లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి 73లక్షలకు పైగా డౌన్‌లోడ్‌లు నమోదు చేశాయి. ఈ28ఆండ్రాయిడ్ యాప్‌లు ఎలా మోసం చేశాయంటే వినియోగదారుడు ఇచ్చిన ఏ ఫోన్ నెంబర్ ప్రైవేటు కాల్స్, ఎస్సెమ్మెస్ రికార్డులు, వాట్సాప్ కాల్ హిస్టరీని అయినా ఇవ్వగలమని ఈ నకిలీ యాప్స్ నమ్మించాయి. వాస్తవానికి ఈ యాప్‌లు నకిలీ డేటాను సృష్టించి, కల్పిత ఫలితాలను అందిస్తూ, సబ్‌స్క్రిప్షన్ కోసం వినియోగదారుల నుంచి డబ్బులు కూడా వసూలు చేశాయి. భద్రతా పరిశోధక సంస్థ ఈఎస్ఈటీ వెల్లడించిన ప్రకారం,కాల్‌హిస్టరీ ఆఫ్ ఎనీ నెంబర్ అనే యాప్ గురించి రెడ్డిట్ పోస్టులో గుర్తించిన అనంతరం పూర్తి వివరాలు తెలుసుకోవడానికి విచారణ ప్రారంభించారు. ఇండియన్ గవర్నమెంట్.ఇన్ అనే డెవలపర్ పేరుతో ఈ పోస్టు ఉంది. దీని ప్రకారం వినియోగదారుడు అందించిన ఏ ఫోన్ నెంబర్ కాల్ హిస్టరీనైనా తిరిగి పొందవచ్చు. ఈ యాప్‌నకు భారత ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదు. ఇది అందించిన కాల్ హిస్టరీ డేటా పూర్తిగా కల్పితమని కూడా రీసెర్చర్స్ గుర్తించారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఇలాంటి మరో 27 యాప్‌లను పరిసోధకులు గుర్తించారు. 2025 డిసెంబర్ 16వ తేదీన ఈ యాప్‌ల గురించి గూగుల్‌కు నివేదించినట్లు ఈఎస్ఈటీ తెలిపింది.

# పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన 6.6శాతం వృద్ధి



**న్యూఢిల్లీ,మే 11:** దేశంలోని పట్టణ ప్రాంతాల్లో జనవరి మార్చి త్రైమాసికంలో 6.6శాతం ఉపాధిపెరిగిందని కేంద్ర అర్థగణాంక, పథక అమలు విభాగం సోమవారం ప్రకటించింది. అంతకుముందు త్రైమాసికంలో 6.7శాతం మాత్రమే ఉంది. రెగ్యులర్ వేతనం, లేదా నెలసరి జీతంతో కూడిన ఉపాధి గ్రామీణ ప్రాంతాల్లో భారీ వృద్ధితో ఉంది. 14.8శాతంనుంచి 15.5శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 15 ఏళ్లకుపైబడిన వారు ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నట్లు తేలింది. మాధ్యమిక, ప్రాదేశిక రంగాల్లో ఉపాధి కూడా గ్రామీణప్రాంతాల్లోనే ఎక్కువ ఉంది. 15 ఏళ్లకుపైబడిన వారి కార్మిక శక్తి భాగస్వామ్యం రేట్ జనవరి మార్చి త్రైమాసికంలో 55.5శాతంగా ఉంది. అంతకుముందు త్రైమాసికంలో 55.8శాతంకంటే స్వల్పంగా తగ్గింది. మోస్పి వివరాలను బట్టిచూస్తే మహిళల కార్మికశక్తి భాగస్వామ్యం 34.7శాతంగా ఉంది. పట్టణప్రాంతాల్లో వర్కర్ జనాభా నిష్పత్తి కూడా స్థిరంగా 46.9శాతం వద్దనే ఉంది. మంత్రిత్వశాఖ విడుదలచేస్తే పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే ప్రకారంచూస్తే 15 ఏళ్లకుపైబడిన వారంతా కూడా ఉపాధిరంగంలో చొచ్చుకుపోతున్నారని తెలుస్తోంది. 2024 జనవరి నెలనుంచి పిఎల్ఎఫ్ఎస్ సర్వేకు ప్రామాణికంగా మోస్పి ప్రకటించింది.

# మ్యూచువల్ ఫండ్స్‌లోకి 38వేల కోట్ల పెట్టుబడులు

**ముంబయి, మే11:**ఈక్విటీ మ్యూచవల్ ఫండ్స్‌లోకి గతనెలలో రూ.38,440.20 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.అదేమార్చిలో అయితే 40వేల 450.26కోట్లు రాగా ఏప్రిల్‌లో స్వల్పంగా తగ్గింది. మొత్తంగా మూచువల్ ఫండ్స్ రంగంలోకి రూ.3.22 లక్షలకోట్లు పెట్టుబడులు వచ్చాయని ఆంఫీ వెల్లడించింది. అదే మార్చిలో రూ.2.39 లక్షలకోట్లు మాత్రమే అందాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్ లోనికే ఎక్కువ పెట్టుబడులు రాగా లార్జ్ క్యాప్ ఫండ్స్ రూ.2524.61 కోట్లు వచ్చాయి. మిడ్‌క్యాప్ కేటగిరీలో 6551.40కోట్లు వచ్చాయి. స్మాల్‌క్యాప్‌ఫండ్స్ నికరంగా రూ.6885.90 కోట్లు పెట్టుబడులు ఏప్రిల్‌లోనేవచ్చాయని ఆంఫీ ప్రకటించింది. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి 10వేల 147.85 కోట్లవరకూ నిధులు వచ్చాయి. సెక్టోరల్, థిమాటిక్ ఫండ్స్ రూ.1949.36 కోట్లు వచ్చినట్లు మూచువల్‌ఫండ్స్ సంస్థల సంఘం ఆంఫీ తెలిపింది. డెట్స్ రంగంలోకి కూడా రూ.2.47 లక్షల కోట్లు ఏప్రిల్‌నెలలో పెట్టుబడులుగా వచ్చాయి. రాత్రికిరాత్రే రూ.31,420.45 కోట్లు వచ్చాయి. ఇక లిక్విడ్‌ఫండ్స్ రూ.1.65 లక్షలకోట్లు రాగా సిప్ పెట్టుబడులు రూ.31,115 కోట్లుగాఉన్నాయి. ఇక హైబ్రిడ్ పాసివ్‌ఫండ్స్ రూ.20,565.24కోట్లుగా ఉన్నట్లు ఆంఫీ ప్రకటించింది. ఆర్బిటేజ్‌ఫండ్స్ రూ.12,378.46 కోట్లుగా ఉన్నాయి గోల్డ్ ఈటిఎఫ్‌లలోకి కూడా 3040.31కోట్లు పెట్టుబడుల రూపంలో వచ్చినట్లు తేలింది. ఇక కొత్తగా ఫండ్ ఆఫర్లు 11 వరకూ ఉన్నాయి. మొత్తం రూ.828 కోట్లు వచ్చాయి. ముందునెలతో పోలిస్తే అన్నివిభాగాల్లోను కొంతమేర తగ్గినట్లు తేలింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇంధన పొదుపు సూత్రాలు, ధరల పెంపు సంకేతాలతో పెట్టుబడులు కొంతమేర మార్చినెలతో పోలిస్తే సన్నగిల్లాయి. ఇక పసిడిఈటిఎఫ్‌లలోకి కూడా3040.3 కోట్ల పెట్టుబడులువచ్చాయి.ఫ్రిబవరిలో ఇన్వెస్టర్లు 2266 కోట్లు పెట్టుబడులుపెడితే, నికరంగా గోల్డ్ ఇటిఎఫ్‌లలో 34శాతంపెట్టుబడులు పెరిగాయి.



# 86% ఉద్యోగులు ఎఐ వినియోగిస్తున్నా రాబడి తక్కువే!

**ముంబయి, మే 11:** భారతదేశంలోని కార్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం గణనీయంగా పెరిగింది. దేశంలో దాదాపు 86 శాతం మంది ఉద్యోగులు తమ రోజువారీ పనిలో ఏఐని వాడుతున్నప్పటికీ, దానిపై పెట్టిన పెట్టుబడికి తగిన రాబడి అంచనాలకు తగ్గట్టుగా ఉందని కేవలం 35 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచ సగటు 22శాతం కంటే భారత్ మెరుగ్గా ఉండటం గమనార్హం. ఈ వివరాలను టెక్నాలజీ నిపుణుల సంస్థ ఇసాకా సోమవారం వెల్లడించింది.భారత్‌లోని 49శాతం సంస్థలు ఇప్పుడు పూర్తిస్థాయి, అధికారిక ఏఐ విధానాన్ని కలిగి ఉన్నాయి.2025లో ఇది 32 శాతంగా ఉండగా, ఇప్పుడు గణనీయంగా పెరిగింది. ప్రపంచ సగటు 38 శాతంతో పోలిస్తే ఇది అధికం.




అయినప్పటికీ దేశంలోని 23శాతం సంస్థలు పరిమిత విధానాలతోనే సరిపెడుతుండగా, 20 శాతం సంస్థల్లో అసలు ఎలాంటి ఏఐ పాలసీ లేకపోవడం గమనార్హం. రోజువారీ పనుల్లో ఏఐ భాగమైనప్పటికీ పాలన,కార్యాచరణ సంసిద్ధతలో ఇంకా వెనుకబాటుతనం కనిపిస్తోందని నివేదిక పేర్కొంది. రాబడి విషయంలో ఉద్యోగుల నుంచి మిశ్రమ స్పందనలు వచ్చాయి. 21 శాతం మంది రాబడి గురించి చెప్పడానికి ఇది చాలా తొందరపాటు అవుతుందనిచెప్పారు. మరో 21 శాతం మంది ఇప్పటివరకు పరిమిత రాబడి మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇంకో 18 శాతం మందికి రాబడిపై ఎలాంటి అవగాహన లేదని తేలింది. భారతీయ ఉద్యోగులు ప్రధానంగా ఉత్పాదకత పెంచుకోవడానికి 56శాతం, పునరావృతమయ్యే పనులను ఆటోమేట్ చేయడానికి 55శాతం, కంటెంట్ రాసేందుకు 51శాతం, భారీ డేటాను విశ్లేషించడానికి 42శాతం ఏఐని ఉపయోగిస్తున్నట్లు సర్వేలో తేలింది. సర్వేలో పాల్గొన్న వారిలో 82 శాతం మంది తమ వృత్తికి ఏఐ నైపుణ్యాలు చాలా అవసరమని భావిస్తున్నారు. రాబోయే 12 నెలల్లో తమ సంస్థలో ఏఐ సంబంధిత ఉద్యోగాలు పెరుగుతాయని 57 శాతం మంది అంచనా వేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14